Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 • సంచిక:288 • సోమవారం 29 జనవరి 2018 • హైదరాబాద్ ❋ పేజీలు:12+12 • వెల: 5.00 • Published from:Hyderabad|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati|Karimnagar|Kurnool|Suryapet|Anantapur|Nellore|Nizamabad



కష్టకాలంలో ఇష్టపడే బడ్జెట్ ఎలా?!

అరుణ్ జైట్లీ కత్తిమీద సాము

గ్రామీణ భారతం కల్లోలం • రెవెన్యూ వసూళ్ల నిరాశాజనకం

న్యూఢిల్లీ: ఈ ఏడాదిలో ఎనిమిది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది ముంచుకొస్తున్న సార్వత్రిక ఎన్నికలు ఒకవైపు హెచ్చరిస్తుండగా మరోవైపు వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) అమలుతో పడిపోతున్న రెవెన్యూ రాబడులు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. భారతీయ పౌరుడు బడ్జెట్ నుంచి వరాలు ఆశిస్తాడని అనాదిగా అనుకుంటున్న మాట ఒట్టి భ్రమ అంటూ ఒక జాతీయ టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్రమోడీ చేసిన వ్యాఖ్యలు వచ్చే బడ్జెట్‌లో ప్రజలకు ➪ 3వ పేజీలో...

త్రిపుల్ తలాఖ్ బిల్లును అడ్డుకోకండి

పార్లమెంటు సమావేశాలకు సహకరించండి



అఖిలపక్ష భేటీలో కేంద్రం

హామీలు నిలబెట్టుకోండి

వివిధ పార్టీల నేతల విజ్ఞప్తి

9లో



మే 20న

జేఈఈ అడ్వాన్స్‌డ్

మే 2 నుంచి దరఖాస్తు

14 నుంచి హాల్ టికెట్లు

జూన్ 10న ఫలితాలు

తెలంగాణలో 6, ఏపీలో 11 పరీక్షా కేంద్రాలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: దేశంలోని ఐఐటీలో ప్రవేశాల కోసం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్(జేఈఈ) అడ్వాన్స్‌డ్ - 2018 పరీక్ష మే 20న నిర్వహించనున్నారు. ఐఐటీ కాన్పూర్ ఈ పరీక్షను నిర్వహించనుంది. జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన 2,24,000 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హులుగా ➪ 3వ పేజీలో...

రైతులకిచ్చే వ్యవసాయ పెట్టుబడి సాయం బ్యాంక్ చెక్‌పై పట్టాదారు పాస్‌బుక్ కోడ్ ముద్రిస్తే అవకతవకలకు, అక్రమాలకు అస్కారం ఉండదని అభిప్రాయం. పంపిణీ విధానం కూడా సులభతరమని ప్రభుత్వ భావన.

• రైతుకు పెట్టుబడి సాయం...

బ్యాలెట్ పత్రాల తరహాలో

చెక్‌ల ముద్రణ



చెక్‌పై పట్టాదారు పాస్‌బుక్ కోడ్

చెక్‌లను ముద్రించే ప్రాంతంనుంచే

గ్రామీణ ప్రాంతాలకు సరఫరా

70 లక్షలకు పైగా రైతులకు లబ్ది

పెట్టుబడికి 11వేల కోట్లు అవసరం

'మే'లో రైతులకు చెక్కుల పంపిణీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు పెట్టుబడి సాయానికి స్థానిక సంస్థల ఎన్నిక తరహా ప్రణాళిక రూపొందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థలకు బ్యాలెట్ పత్రాలను ముద్రించే తరహాలోనే రైతు సాయానికి ఇచ్చే చెక్కులను అదే మాదిరిగా ముద్రిస్తే ఎలా ఉంటుందన్న అంశంపై ప్రభుత్వం అధ్యయనం చేస్తున్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఒకేసారి 70 లక్షల మంది రైతులకు ఏటా ఎకరాకు రూ.8 వేలు పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చింది. ఇంత పెద్ద మొత్తంలో సాయాన్ని అందించేందుకు వీలుగా బ్యాలెట్ పత్రాల ముద్రణ తరహాలో చెక్కులు ముద్రించి, రైతులకు అందించేందుకు వీలుగా బృహత్తర ప్రణాళిక రూపొందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వ్యవసాయ పెట్టుబడి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు రాజకీయంగా ఈ పథకాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందించే పనిలో నిమగ్నమై ఉన్నట్లు సమాచారం. ఇటీవల మూడ్రోజుల పాటు ఎర్రబల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో గడిపిన కేసీఆర్ వ్యవసాయ పెట్టుబడి పథకానికి సంబంధించి పార్టీకి చెందిన కొందరు ముఖ్యులతో సమాలోచనలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది.

రాష్ట్రంలో రైతు సమన్వయ సమితులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి రైతుకు అందించవలసిన పరిహారంపై జిల్లా స్థాయిల్లో సమావేశాలు నిర్వహించాలని, స్వయంగా హాజరై రైతులకు ➪ 7వ పేజీలో...

కొత్త సీఎస్‌గా ఎస్.కె. జోషి?

ఎస్.పి. సింగ్ పదవీకాలం పొడిగింపుపై తేలని నిర్ణయం

సీఎస్ రేసులో 11మంది సీనియర్ అధికారులు

ఆశావహుల జాబితాలో కేంద్రం నుంచి మరో ముగ్గురు

2లో

కృష్ణా బోర్డు వర్కింగ్ మాన్యువల్ సిద్ధం



అధికారాలన్నీ బోర్డుకే..!

ముసాయిదా ఆమోదమే తరువాయి • ప్రాజెక్టులు కట్టాలంటే బోర్డు అనుమతి తప్పనిసరి • ఇరురాష్ట్రాల అధికారులతో రేపు సమావేశం • మార్గదర్శకాలపై తెలంగాణ అసంతృప్తి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కృష్ణాబేసిన్ పరిధిలోని ప్రాజెక్టులపై పెత్తనానికి సంబంధించి.. బోర్డు తుది వర్కింగ్‌మాన్యువల్‌ను సిద్ధం చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల పరిధిలో కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులు, వాటి పరిధిలోని ఉద్యోగులంతా తమ ఆధీనంలో పనిచేసేలా మార్గదర్శకాలు ఖరారుచేసింది. ఇందుకోసం రూపొందించిన వర్కింగ్ మాన్యువల్‌పై బోర్డు ఈనెల 30న ఇరురాష్ట్రాల అధికారులతో చర్చించనుంది. ఈ మేరకు రెండు తెలుగురాష్ట్రాలకు బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం ఇప్పటికే ➪ 3వ పేజీలో...





కాకినాడలో జరిగిన హిందూ ఆత్మగౌరవ సభలో ప్రసంగిస్తున్న స్వామి పరిపూర్ణానంద, సభకు విచ్చేసిన హిందువులు

అస్తిత్వం కోసం ధర్మపోరాటం

హిందూ ఆత్మగౌరవ సభలో స్వామి పరిపూర్ణానంద

రాష్ట్రీయ హిందూసేన ఆవిర్భావం

త్వరలో హైదరాబాద్‌లో భారీ హిందూ సభ

కాకినాడ, ఆంధ్రప్రభ: హిందువుల అస్తిత్వ పరిరక్షణ కోసం శ్రీపీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి ధర్మపోరాటానికి పిలుపునిచ్చారు. హిందూ దేశంలో హిందువులు అన్ని విధాలుగా వివక్షతకు, దోపిడీకి గురౌతున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వాలు హిందూ ధర్మ సంస్థపై పెత్తనం చేస్తూ వ్యవస్థాపక లక్ష్యాల్ని నీరుగారుస్తున్నాయన్నారు. ఈ దేశంలో ఇతర మతస్తులకున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, భావప్రకటన హక్కులు హిందువులకు మాత్రం కొరవడ్డాయ న్నారు. వీటన్నింటిని తిరిగి సాధించుకునేందుకు తాము చేస్తున్న ధర్మపోరాటంలో భాగంగా తన అడుగులో అడుగేసి కదలిరావాలని యువతకు ➪ 3వ పేజీలో...

పాక్‌కు చైనా డ్రోన్‌లు

• భారత రక్షణ కేంద్రాలపై దాడిచేసే సామర్థ్యం

• ఏకధాటిగా 5 వేల కిలోమీటర్ల ప్రయాణం

• అప్రమత్తమైన భారత్

• అత్యాధునిక డ్రోన్ల తయారీపై దృష్టి



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

పాకిస్థాన్‌కు సరికొత్త ఆయుధాల్ని సరఫరా చేసి భారత్‌పైకి ఉసికొల్పేందుకు చైనా ప్రయత్నిస్తోంది. ఇప్పటికే అరుణాచల్‌ప్రదేశ్, డోక్లామ్, ఆక్సాయ్‌చిన్‌ల వద్ద చైనా తరచూ ఆక్రమణలకు ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు అత్యాధునిక ఆయుధాలిచ్చి పాక్‌ను అప్రమత్తం చేస్తోంది. ఇంతవరకు భారత్ వద్ద కూడా లేని అత్యాధునిక వింగ్‌లూంగ్ రకం డ్రోన్లు పాక్ వద్ద ఉన్నట్లు భారత సైన్యం గుర్తించింది. గత ఏడాది నవంబర్ 24న భారత ఉపగ్రహాలు తీసిన కొన్ని చిత్రాల్లో పాక్‌లో ఈ డ్రోన్‌లు ఉన్నట్లు వెల్లడైంది. ఈ డ్రోన్‌ల సాంకేతిక సామర్థ్యాన్ని చైనా అభివృద్ధి పర్చింది. ఈ డ్రోన్లు 4వ తరానికి చెందినవిగా సైనిక నిపుణులు గుర్తించా రు. ఇవి మానవరహితంగానే ప్రయాణించగలవు. వంద కిలోలకు పైగా బరువైన బాంబుల్ని మోసుకుపోగలవు. వీటికి తేలికపాటి మిస్సైళ్ళను కూడా అనుసంధానించి ప్రయోగించొచ్చు. గంటకు 280కిలోమీటర్ల వేగంతో ఇవి దూసుకుపోతాయి. ఏకధాటిగా 5వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేయగలుగుతాయి. అన్నింటికిమించి ఈ తరహా డ్రోన్లు రాడార్‌కు చిక్కనంత తక్కువ ఎత్తులో ఎగురుతాయి. నిర్దిష్ట లక్ష్యాన్ని ఇవి సునాయాశంగా చేరుకోగలుగుతాయి. ఈ డ్రోన్లను చైనాయే సరఫరా చేసిందన్న విశ్వసనీయ సమాచారం భారత ఆర్మీకి లభించింది. దీంతో ఇప్పుడు భారత్ మరింత అప్రమత్తమైంది. అసలే పాకిస్థాన్... పైగా చైనా సైనిక సహకారం. ఈ రెండు దేశాలు భారత్‌పై అక్కసు పెంచుకున్నాయి. రెండూ కూడా భారత సరిహద్దుల్లో చొచ్చుకుపోయేందుకు కాచుకునున్నాయి. వీటిని ఎప్పుడు ఎలా ప్రయోగించినా అడ్డుకునేందుకు వీలుగా ఇప్పుడు భారత సైన్యం అప్రమత్తమైంది. వాస్తవానికి ఇంత వరకు ఇలాంటి డ్రోన్లు చైనా వద్ద మాత్రమే ఉన్నాయి. వీటిని ఈజిప్ట్, సౌదీఅరేబియా, ఉజ్బెకిస్థాన్, యునైటెట్ అరబ్ ఎమిరేట్స్, కజిఖిస్తాన్‌లకు 2017లో చైనా విక్రయించిందన్న సమాచారం గతంలో లభించింది. అయితే పాక్‌కు సరఫరా చేసిందన్న విషయం తెలిసి ఇప్పుడు అమెరికా కూడా ఆశ్చర్యానికి లోనవుతోంది.

ఈ డ్రోన్లు వివి 7రకం. ఆకాశం నుంచి నేలకు తాకే క్షిపణుల్ని మోసుకుపోగలవు. అలాగే వైజడ్-212రకం లేజర్ గైడెడ్ బాంబుల్ని ➪ 3వ పేజీలో...

ఔరా..!



అమెరికాలో టెక్కీ అనుమానాస్పద మృతి

మృతుడు సిద్ధిపేట వాసి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అమెరికాలో ఉంటున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వెంకన్న గారి కృష్ణచైతన్య అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మూడ్రోజుల క్రితం డలాస్‌లో జరిగింది. కృష్ణ చైతన్య స్వస్థలం సిద్ధిపేటలోని ప్రశాంత్‌నగర్. కాగ్నిజెంట్ కంపెనీలో ఉద్యోగ నిమిత్తం మూడున్నరేళ్ల కిందట కృష్ణ చైతన్య అమెరికా వెళ్లాడు. డల్లాస్‌లోని సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్ కంపెనీలోకి మూడు నెలల క్రితం ఆయన మారాడు. డల్లాస్‌లోని ఓ ఇంట్లో ➪ 3వ పేజీలో...



ఆస్తికోసం...

తండ్రి, ఇద్దరు తమ్ముళ్లను హతమార్చాడు!

నాగర్ కర్నూల్ జిల్లా మామిళ్లపల్లిలో ఘటన

ఉప్పునుంతల, ప్రభన్యూస్: నాగర్ కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామంలో శనివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకోగా, ఆదివారం వెలుగుచూసింది. కన్నకొడుకే కాలయముడై తండ్రిని, ఇద్దరు సోదరులను అతికిరాతంగా కడతేర్చాడు. ప్రస్తుతం నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడు. మామిళ్లపల్లి గ్రామానికి చెందిన సామ భాస్కరయ్య పెద్దకుమారుడు మల్లేష్ ఎలియాస్ మల్లయ్య(24) ఆస్తి కోసం తండ్రి భాస్కరయ్య(60)తోపాటు ఇద్దరు సోదరులు శ్రీశైలం (22), రామస్వామి (18)ని వ్యవసాయ పొలంలో రాళ్లతో కొట్టి హత్య చేశాడు. హత్య చేసిన విషయాన్ని అన్నారంలోని మేనమామకు హంతకుడే స్వయంగా తెలియజేశాడు. అతనిచ్చిన సమాచారంతో హంతకుని పెద్దతండ్రి కుమారుడు రామస్వామి వ్యవసాయ పొలానికి వెళ్లి చూడగా శ్రీశైలం హత్యకు గురైనట్లు నిర్ధారించాడు. హంతకుడు తెల్కపల్లిలో ➪ 3వ పేజీలో...

యాసిడ్ బాధితులకు కేంద్రం భరోసా


(ఫైల్)

ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు

న్యూఢిల్లీ: యాసిడ్ దాడి బాధితులకు శుభవార్త. కారణమేదైనా యాసిడ్ దాడిలో గాయపడి జీవితంలో కోలుకోలేకపోతున్నవారిలో మనోధైర్యం నింపేలా కేంద్రం భరోసా ఇచ్చింది. యాసిడ్ దాడి క్షతగాత్రులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా కింద ఉద్యోగాలివ్వాలని నిర్ణయించింది. ఆటిజం, మానసిక అనారోగ్యం, మేధో వైకల్యాలతో పాటు యాసిడ్ బాధితులకు కూడా ఉద్యోగాల్లో కోటా కల్పించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లోని మొత్తం ఉద్యోగాల్లో 4శాతం ఉద్యోగాలను వీరికి కేటాయిస్తారు. వైకల్యం కలిగిన వారికి ఏ,బీ,సీ కేటగిరిలుగా కేటాయించి రిజర్వేషన్ కల్పిస్తారు. అంగవైకల్యం నిర్దిష్టాంశంగా పరిగణించేందుకు 40శాతం అంగవైకల్యాన్ని ప్రమాణంగా తీసుకుంటారు. వైకల్యం 40శాతం లోపు ఉంటే దాన్ని అంగవైకల్యంగా పరిగణించరు. దివ్యాంగులకు ప్రతీ రిక్రూట్‌మెంట్‌లో ఒకశాతం ఉద్యోగాలు రిజర్వ్ చేయాలని ఇటీవల డీవోపీటీ అన్ని ప్రభుత్వ శాఖలకు లేఖలు రాసింది. ఆటిజం, మానసిక అనారోగ్యం, మేధోవైకల్యం, నిర్దిష్ట అభ్యాస వైకల్యం కలిగిన వారికి ఒకశాతం రిజర్వేషన్ కల్పించనుంది.

తెలంగాణలో లులూ

రూ.2500కోట్ల పెట్టుబడులు

మంత్రి కేటీఆర్ సమక్షంలో ఒప్పందం

వెయ్యి కోట్ల పెట్టుబడులకు యూఏఈ సంస్థ సంసిద్ధత



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అంతర్జాతీయ వ్యాపార సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం భారీ వ్యాపార ఒప్పందాలను కుదుర్చుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఇ)కి చెందిన బిఆర్ఎస్ వెంచర్స్, అబూదాబిలోని లులూ కంపెనీతో పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ కీలక వ్యాపార ఒప్పందాలను కుదుర్చుకున్నారు. ఆయన దావోస్ పర్యట నలో భాగంగా అబూదాబిలోని లులూ గ్రూప్‌తో రూ.2500 కోట్ల పెట్టుబడులకు ఎంఒయూ కుదుర్చుకున్నారు. ఈ సంస్థ 400 మిలియన్ అమెరికన్ డాలర్లను తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో రిటైల్ వ్యాపారం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఈ మేరకు తమ పెట్టుబడులను పెట్టనుంది. 1.8 మిలియన్ చదరపుఅడుగుల్లో మెగా షాపింగ్ మాల్‌ను, కూరగాయలు, పండ్ల ఎగుమతులకు గానూ ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించేందుకు పరస్పర అంగీకారం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పంద పత్రాలపై సంస్థ చైర్మన్ యూసుఫ్అలీ ఎంఏ, తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌లు పరస్పరం సంతకాలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారం అద్భుతమని సంస్థచైర్మన్ యూసుఫ్అలీ అన్నారు. మూడు నెలల్లో తమ పనులను ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక రంగానికి ఎంతగానో సహకరిస్తోందని ఆయన అభినందించారు. తమకు అవసరమైన భూమిని ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమని ఆయన వ్యాఖ్యానించారు. అదే విధంగా యూఏఇలోని బిఆర్ఎస్ వెంచర్స్ సంస్థ హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్, ఫ:నాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ సంస్థతో ఐటి శాఖ కార్యదర్శి జయేష్‌రంజన్ ఎంఒయూ ఒప్పందాలపై సంతకం చేశారు. రానున్న 3నుంచి ఐదేళ్లలో రూ. 1000 కోట్లను పెట్టుబడులుగా పెట్టేందుకు ఈ సంస్థ సిద్దమైంది. 20 ఎకరాల్లో ఫార్మాస్యూటికల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, ఆర అండ్ డి యూనిట్‌ను, మెడికల్ డివైస్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను, 500 పడకలతో 20 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని, 50 ఎకరాల్లో మెడికల్, ఇంజనీరింగ్ , మేనేజ్‌మెంట్ కళాశాలను నిర్మించాలని ఒప్పందాల్లో పేర్కొంది. వచ్చే మూడు నెలల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా శంఖుస్థాపనలు చేసేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. మొత్తంగా 6వేల మందికి ఉపాధి కల్పనున్నట్లు ప్రభుత్వం భావిస్తోంది. మన రాష్ట్రానికి అంతర్జాతీయ ప్రమాణాలున్న సంస్థలు రావాలని కృషి చేస్తున్నామని, ప్రతిష్టాత్మక సంస్థలు తమ పెట్టుబడులను పెట్టేందుకు రాష్ట్రానికి రావడం గర్వకారణమని మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. భవిష్యత్‌లో అనేక కంపెనీలు రాష్ట్రానికి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

వైద్యవిధానంలో ఆధునిక పద్ధతులు అవలంబించాలి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: మారుతున్న సమాజానికి అనుగుణంగా వైద్య విధానంలో కూడా ఆధునిక పద్ధతులను అవలంభించాలని మాజీ గవర్నర్ రోశయ్య పేర్కొన్నారు. ఆదివారం తాజ్‌డెక్కన్‌లో ఆశ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి చెందిన ఎండీ డాక్టర్ జీవీ సోమయాజులు సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వైద్య విధానం నూతన ఒరవడులకు శ్రీకారం చుట్టిందన్నారు. కొత్త ఆలోచనలతో రోబోలతో చికిత్సలు చేయించే పరిస్థితికి మనం వెళ్లామని ఇది శుభపరిణామమన్నారు. ఒకప్పుడు ఆపరేషన్లు చేయాలంటే రోజుల తరబడి ఆస్పత్రిలోనే ఉండాల్సి వచ్చేది ప్రస్తుతం వచ్చిన ఆధునిక యంత్రాలతో ఒక్కరోజులోనే రోగి ఇంటికి వెళ్లే పరిస్థితి నెలకొంద న్నారు. యువ డాక్టర్లు విదేశాలవైపు వెళ్లకుండా మన దేశానికి, మనం పుట్టిన ప్రాంతానికి సేవ చేయాలనే ఆశయంతో పనిచేయాలన్నారు. డాక్టర్ సోమయాజులు ఫైల్స్‌కు సంబంధించి కొన్ని వేల ఆపరేషన్లచేశారని అందులో భాగంగా 55 సెకన్లలో ఫైల్స్ ఆపరేషన్ చేసి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సం పాదించుకున్నారని గుర్తుచేశారు. సోమయాజులు మరిన్ని ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించి దేశవ్యాప్తంగా మరింత పేరు సంపాదించు కోవాలని ఆయన సూచించారు. సినీ హీరో సుమన్, మరో నటుడు తనికెళ్ల భరణిలు మాట్లాడుతూ డాక్టర్ సోమయాజులు గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సంపాదించుకోవాలని దానికోసం ఇంకా కృషి చేయాలని కోరారు. డాక్టర్లు పాల్గొనే ఇలాంటి కార్యక్రమంలో మాలాంటి సినిమా వాళ్లకు చోటు కల్పించడం అదృష్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్, గోవిందహరి, శ్యామలా దేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేదాంత దేశికన్ పుస్తకావిష్కరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శ్రీవేదాంత దేశికన్ తిరునక్షత్ర మహోత్సవంలో తెలుగు రాష్ట్రా ల గవర్నర్ నరసింహన్ పాల్గొన్నారు. ప్రఖ్యాత తాత్వికవేత్త శ్రీవేదాంత దేశికన్ 750వ తిరునక్షత్ర మహోత్సవం తిరుచ్చి జిల్లా శ్రీరంగంలోని అహోబిల మఠంలో ఆయన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మంది భక్తులు, వైష్ణవ మేధావులు పాల్గొని దేశియ ప్రబంధంఅనే అంశంపై సదస్సు, ఉపన్యాసాలతో శ్రీవేదాంత దేశికన్ కవితలనుగానం చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ఈ వేడుకలో పాల్గొనడం సంతోషకరమన్నారు. దేశికన్ ఆశీర్వచనాలు అందిన అనుభూతికి లోనవుతున్నట్లు తెలిపారు. రామానుజులు, వేదాంత దేశికన్ వంటి మహానుభావులకు శ్రీరంగం ఓ విశిష్ట స్థలమన్నారు. హిందూ ధర్మాన్ని, ఆ ఇద్దరూ పరిరక్షించింది ఈ స్థలంలోనేని అన్నారు. కార్యక్రమంలో భాగంగా శ్రీవేదాంత దేశికనిన్ వైష్ణవ నెరిగల్ అనే పుస్తకాన్ని నరసింహన్ ఆవిష్క రించారు. తొలిప్రతిని శ్రీరంగంలోని రంగనాథస్వామి ఆలయ ప్రధాన అర్చ కులు రంగారాజుపట్టర్ సమక్షంలో చైన్నై కస్టమ్స్ విభాగం చీఫ్ కమిషనర్ చారి స్వీకరించారు.

సీఎస్‌గా ఎస్‌కే జోషి..?

- రేసులో అజయ్‌మిశ్రా, సురేష్‌చందా, చిత్రా రామచంద్రన్, రాజేశ్వర్ తివారీ, బీఆర్ మీనా
- ఎల్లుండి ఎస్పీ సింగ్ పదవీ విరమణ
- పొడిగింపుపై అనిశ్చితి
- ప్రభుత్వ సలహాదారుడిగా నియామకం!



ఎస్‌కె జోషి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవి ఎంపిక ఆసక్తి రేపుతోంది. ప్రస్తుతం ఈ పద విలో ఉన్న ఎస్పీ సింగ్ ఎల్లుండి(31న) పదవీ విరమణ చేయనున్నారు. ఈ బాధ్యతలను ఎవరికి అప్పగిస్తారన్న అంశం చర్చనీ యాంశమైంది. ఎస్పీ సింగ్ పదవీకాలాన్ని పొడిగించాలని సీఎం కేసీఆర్ కేంద్రానికి రాసిన లేఖపై ఇంతవరకూ స్పందన లేకపోవడంతో సీనియర్ ఐఏఎస్‌ను ఈ పదవిలో ఎంపిక చేస్తారన్న ప్రచారం జరుగుతోంది.

కేంద్ర ప్రభుత్వం నుంచి సింగ్ పొడిగింపునకు సంబంధించిన సమాచారం రాని పక్షంలో మంగళవారం సాయంత్రానికి కొత్త వారిని ఈ పద వికి ఎంపిక చేస్తూ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని సచి వాలయంలోని సాధారణ పరిపాలనాశాఖ అధికారులు చెబు తున్నారు. ప్రభుత్వప్రధాన కార్యదర్శి పదవికి పలువురు సీని యర్లు పోటీ పడుతున్నప్పటికీ సాగునీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి(ఎస్‌కె జోషి) నియామకంపైనే సీఎం కేసీఆర్ మొగ్గుచూపుతున్నట్లు సమా చారం. అయినా.. ఈ పదవికి అఖిల భారత సర్వీసు అధికా రులు తీవ్రంగా పోటీ పడుతున్నారని ప్రచారం జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కీలకమైన ప్రభుత్వప్రధాన కార్యదర్శి పదవిని ఎవరికి అప్పగిస్తారనే ఉత్కంఠ రేగుతోంది.



ఎస్పీ సింగ్

కేంద్ర సర్వీసుల్లో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారులను కలుపుకుంటే మొత్తం 11 మంది ఐఏఎస్‌లు ఈ పదవికి రేసులో ఉన్నట్లు సమా చారం. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న ఎస్పీ సింగ్‌ను ఏడాది క్రితం ఈ పదవిలో నియ మించిన సంగతి తెలిసిందే. ఈ హోదాలో ఎస్పీ సింగ్‌తో పాటు 1983 బ్యాచ్‌కు చెందిన డీపీ ఆచార్య, బినయ్ కుమార్, రంజీవ్ ఆర్ ఆచార్యలు ఉన్నారు. 1984 బ్యాచ్‌కు చెందిన శైలేంద్రకుమార్ జోషి, అజయ్ మిశ్రా, 1985 బ్యాచ్‌కు చెందిన పుష్పా సుబ్ర మణ్యం, సురేష్ చందా, చిత్రా రామచంద్రన్, హీరాలాల్ సమారియా, 1986 బ్యాచ్‌కు చెందిన రాజేశ్వర్ తివారి, బి.ఆర్.మీనా ఈ హోదాలో ఉన్నా రు. వీరిలో బినయ్‌కుమార్, పుష్పా సుబ్రమణ్యం, హీరా లాల్ సమారియా కేంద్ర సర్వీసుల్లో ఉన్నందున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వీరికి అవకాశాలు అంతంతమా త్రమేనని అంటు న్నారు. పుష్పా సుబ్రమణ్యం, సమారియాలు తమకు సీఎస్ పదవిని ఇస్తే రాష్ట్ర సర్వీసుల్లో తిరిగి చేరడానికి ఎలాంటి అభ్యంతరం లేదని సంకేతాలు పంపినట్లు సమాచారం. కేంద్ర సర్వీసు ల్లో ఉన్న ఈ ముగ్గురు పోను సీఎస్ పదవికి ఎనిమిది మంది సీనియర్ ఐఏఎస్‌లు పోటీ పడుతున్నారు.

ప్రస్తుత సీఎస్ ఎస్పీ సింగ్ పదవీకాలం పొడిగిస్తే మరో మూ డు నెలల పాటు ఆయన ఈ పద విలో ఉంటారు. ఢిల్లీలో తనకున్న పరి చయాలతో తన పదవీకాలం పొడిగిం పు నకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఐఏఎస్ లలో ప్రచారం జరుగుతోంది. ఒక వేళ కేంద్రం సాను కూలంగా స్పందించకపోతే ఎస్పీ సింగ్‌ను రాజీవ్‌శర్మ తరహాలో ప్రభుత్వ సలహాదారుగా నియమించే అవకాశాలు కనిపిస్తు న్నాయి. ఎస్పీ సింగ్ ప్రస్తుతం భూపరిపాలన శాఖ ప్రధాన కమిషనర్‌గా, మిషన్ భగీరథ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. మిషన్ భగీరథ ఫలాలను ఎన్నికలలోపు ఇంటింటికి నల్లా నీళ్ల ద్వారా అంది స్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ప్రతిష్టాత్మకమైన ఈ పథకం పూర్తయ్యే వరకూ ఎస్పీ సింగ్‌ని భగీరథ కార్పొరేషన్ ఎండీగా కొనసాగించాలని.. అవసరమైతే అదనంగా తన పరిధిలోకి రెండు, మూడు ప్రభుత్వ శాఖలను తీసుకురా వాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

ఎస్పీ సింగ్ తర్వాత 1983 బ్యాచ్‌కు చెందిన రంజీవ్ ఆర్ ఆచార్య ఉన్నారు. అయితే, ఆమె పదవీకాలం మరో తొమ్మిది నెలల పాటు ఉందని దీంతో ఆమెకు సీఎస్‌గా అవకాశం ఉండకపోవచ్చని తెలుస్తోంది. మిగతా సీనియర్లలో బీపీ ఆచార్య, ఎస్‌కే జోషిలు ఉన్నారు. ఆచార్యపై సీబీఐలో కేసులు ఉండటంతో సీఎస్ పదవికి ఆయన పేరును పరిశీలించ కపో వచ్చునని, వివాదరహితుడిగా పేరున్న జోషికే సీఎస్ పదవి దక్కవచ్చని అంటున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల, శ్రీరాంసాగర్ ఆధునీకరణ, దేవాదుల తదితర ప్రాజెక్టులను శరవేగంతో పూర్తి చేయడానికి జోషి ఎంతో ప్రయత్నిస్తున్నారని సాక్షాత్తూ రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ప్రశంసించిన సంగతి తెలిసిందే. దీంతో, ఎస్పీ సింగ్ స్థానంలో జోషినే సీఎస్ పదవికి ఎంపిక చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. రాజీవ్‌శర్మ సీఎస్‌గా పదవీ విరమణ చేశాక ఈ పదవిలో ఎవరిని నియమించాలనే ప్రతిపాదన వచ్చినప్పుడు ప్రదీప్‌చంద్ర, ఎస్పీ సింగ్‌లతో పాటు జోషి పేరును కూడా సీఎం కేసీఆర్ అప్పట్లో పరిశీలించారని సమాచారం. జోషికి మరో రెండేళ్లు పదవీకాలం ఉండటంతో ఆయననే సీఎస్‌గా నియమిస్తారని ఐఏఎస్‌లలో ప్రచారం ఊపందుకుంది. అజయ్ మిశ్రా, సురేష్ చందా, చిత్రా రామచంద్రన్, రాజేశ్వర్ తివారిలు కూడా తమదైన శైలిలో సీఎస్ పదవికి పావులు కదుపుతున్నట్లు సమాచారం. అ యితే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎంపిక విషయంలో సీఎం కేసీఆర్ ఆలోచన ఎలా ఉంటుందోనన్న ఆసక్తి రేపుతోంది. మొత్తమ్మీద కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియామకం వ్యవహారం ఒకట్రెండు రోజుల్లో తేలిపోనుందని సీఎం కార్యాలయవర్గాలు అంటున్నాయి.

కొత్త పథకాలకు మరిన్ని నిధులు!

- కీలక పథకాలకు అదనపు కేటాయింపులు!
- పురోగమనంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ
- ఆశించిన స్థాయిలో పన్ను వసూళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రాధాన్యతా పథకాలకు నిధుల కొరత తీరనుంది. రోజురోజుకు ఆర్థిక పరిస్థితి మరింత మెరుగవుతూ గాడిలో పడుతోంది. తద్వారా సంక్షేమ పథ కాలకు నిధుల లేమి లేకుండా రాష్ట్రం అద్భుతంగా పురోగ మిస్తున్నది. ఈ ఏడాది డిసెంబర్ మాసాంతానికి రాష్ట్ర పన్నుల రాబడి రూ. 79,624 కోట్ల అంచనాకుగానూ రూ. 50,272 కోట్లు సమకూరింది. ఇది గతేడాదితో పోలిస్తే 15.7శాతం అధిక వృద్ధి కావడం గమనార్హం. అయితే కేంద్ర గ్రాంటుల విష యంలో మాత్రం ఆశించిన రాబడులు ఖజానాకు చేరడం లేదు. పన్ను రాబడులలో రూ.50,272 కోట్లతో 63శాతం అంచనాలు చేరగా, పన్నేతర రాబడుల్లో రూ.6601కోట్ల అంచనాలకు గానూ రూ. 3081కోట్లతో 46 శాతం లక్ష్యం చేరింది. రూ.26, 857కోట్ల గ్రాంటుల అంచనాలకుగానూ కేవలం 21 శాతంతో రూ.5860కోట్లు మాత్రమే సమకూరాయి. ఇక రుణాల విష యంలో ఇప్పటికే 90శాతం చేరినట్లు ఆర్థిక శాఖ వివరణ ఇస్తు న్నది. కేంద్రం ఇచ్చిన 3.5 శాతం రుణపరిధిని రాష్ట్రం సద్వినియోగం చేసుకుంది. రుణాల్లో రూ.26096కోట్ల అంచనాలకు గానూ ఇప్పటికే రూ.23,084కోట్ల అప్పులను వివిధ రూపాల్లో ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా సేకరించింది.



అక్టోబర్‌లో అధికం...

కాగా ఈ ఆర్థిక ఏడాదిలో అక్టోబర్ మాసంలోనే అధిక పన్నుల రాబడి ఖజానాకు చేరింది. రూ. 6953కోట్ల పన్ను ఆదాయం ఈ నెలలో సమకూరగా సెప్టెంబర్‌లో అతి తక్కువగా రూ. 4343కోట్లు మాత్రమే ఆర్జించినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. డిసెంబర్‌లో రూ.4506కోట్ల రాబడి సాధ్యపడగా మిగతా 6నెలల్లో రూ.5వేల కోట్లకు తక్కువ కాకుండా పన్ను రాబడి సాధ్యపడింది. కాగా 2018-19బడ్జెట్‌లో ప్రభుత్వ పథకాలతోపాటు ఉద్యోగుల వేతనాలు, పీఆర్సీ అమలు భారం, కాంట్రాక్ట్‌ఉద్యోగుల క్రమబద్ధీకరణతో పెరిగిన వేత నాలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యో గుల వేతనాల పెంపు ఖజానాకు భారీ భారం కాను న్నాయి. ఇందులో మిషన్ కాకతీ య, వాటర్‌గ్రిడ్, సాగునీరు, విద్యు త్ ప్రాజెక్టులు, రైతు రుణమాఫీ, సబ్సిడీ ఎరువులు, విత్త నాల సరఫరా, షాదీ ముబారక్, కళ్యా ణ లక్ష్మి, డబుల్ బెడ్‌రూం ఇండ్లతో పాటు పెరిగిన కొత్త ఉద్యోగాలకు కే టాయిం పులు చేయా ల్సిన పరిస్థితి నెలకొంది. కాగా బడ్జెట్ ఆమోదం పొందేనాటికి గొర్రెల పెంపకం పథకం, చేపల పంపిణీ పథకాలు లేవు. వీటికి అదనంగా నిధులను ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు ఈ పథకాలను బిసి బడ్జెట్‌లో పెట్టే అవకాశముంది. మిషన్ భగీ రథకు రూ.19405కోట్లు ఇవ్వాలని ఇప్పటికే నీతి ఆయోగ్ కేంద్రానికి సూచించడంతో ఈ పథకంపై కొంత భారం తప్పనుంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు వ్యయం భారీగా పెరిగిన నేపథ్యంలో కేంద్రం రూ. 10వేల కోట్లు మంజూరీ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే డిమాండ్ చేసింది. హార్టికల్చర్ యూని వర్సిటీ, గిరిజన యూనివర్సిటీ, ఎయిమ్స్, స్టీల్ ప్లాంట్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీలకు కేంద్రం నిధులను కోరనుంది.



కీలక రాబడుల్లో జోష్...

కాగా ప్రస్తుత ఆర్థిక యేడాదిలో సొంత వనరుల పన్ను ఆదాయం సంతృప్తికరంగా ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే బడ్జెట్‌లో కీలకమైన రాబడి వనరులపై 15 నుంచి 20 శాతం వరకు అంచనాలు పెంచుకోవాలని యోచిస్తోంది. ఈ యేడాది డిసెంబర్ మాసాంతానికి వివిధ రాబడి శాఖలద్వారా పన్నుల రూపంలో రూ. 50,272 కోట్ల రాబడి ఖజానాకు చేరింది. అమ్మకం పన్ను (వ్యాట్) రూపంలో గతేడాదికంటే 18 శాతం వృద్ధిరేటు నమోదైంది. కీలక ఆదాయ వనరుల్లో ఒకటైన ఎక్సైజ్‌శాఖ ద్వారా 3890 కోట్లు రూపాయల ఆదాయం లభించింది. ఇది 2014-15 తో పోలిస్తే 18 శాతం ఆదాయం అధికరావడం గమనార్హం. స్టాంపులు- రిజిస్ట్రేషన్ల శాఖలో 30 శాతం ఆదాయం పెరుగుదల సాధ్య మయింది. రవాణా శాఖలో 1460 కోట్ల రూపాయల ఆదా యం ఖజానాకు చేరి గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 20 శాతం అధిక రాబడి నమోదు చేసుకుంది.



ఆర్నెళ్లూ లోటులోనే...!

మితిమీరిన ఖర్చులు, పెరుగుతున్న జీతభత్యాలు, ప్రాజెక్టులు, బడ్జెట్ పరిధిలోలేని పథకాలను ఆర్థిక ఏడాది మధ్యలో ప్రవేశపెట్టడం, ప్రజాసంక్షేమ పథకాల వ్యయాలు భారీగా పెరగడంతో గడచిన ఆరు మాసాల్లో రెవెన్యూ లోటు రూ. 5560 కోట్లకు చేరింది. మరోవైపు రాష్ట్రంలో రెవెన్యూ రాబడులకంటే రెవెన్యూ వ్యయం పెరుగుతుండటంతో బడ్జెట్‌లో బ్యాలెన్స్ లోటును తలపిస్తోందని తెలిసింది. 2015-16లోరాబడులు రూ. 76133కోట్లుకాగా వ్యయం రూ. 75,895కోట్లుగా నమోదైంది. దీంతో తొలి ఏడాది రూ. 238కోట్ల మిగులు సాధించగా, 2016-17లో రాబడులు రూ. 87,069కోట్లుగానూ, వ్యయం రూ. 86,870 కోట్లకు చేరింది. దీంతో వరుసగా రెండో ఏడాది రూ. 199కోట్ల మిగులు సాధ్య పడింది. ఇక ఈ ఏడాదిలో రాబడులను రూ. 113083 కోట్లుగా అంచనా వేసుకోగా వ్యయం రూ. 108511 కోట్లుగా ఉండి రూ. 4571 కోట్ల మిగులుగా అంచనా వేసుకున్నారు. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా మారుతుండటం, మరోవైపు జీఎస్టీ అమలుతో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాజెక్టులు, ఇతర పథకాలపై రూ. 22వేల కోట్ల అదనపు భారం నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. దీనిని అధిగమించే చర్యలను తీసుకొంటోంది.

ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు




హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ప్రజలు, ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని కేంద్ర మాజీ మంత్రి, భాజపా సీనియర్ నాయ కుడు దత్తాత్రేయ ఆరోపించారు. తెరాస ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఐపీసీ 506,508 సెక్షన్లను సవరణ చేయాలని చూడడం పూర్తిగా అప్రజా స్వామికమన్నారు. ఇది సిఎం కేసీఆర్ నియంతృత్వ ధోరణికి నిదర్శమని వ్యాఖ్యానించారు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడకుండా ఉండాలన్న దురుద్దేశ్యంతోనే కేసీఆర్ ఇలాంటి చర్యలకు పూనుకుంటున్నారని మండిపడ్డారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దత్తాత్రేయ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల కరెంటును సరఫరా చేయగలుగుతోందన్నారు. కానీ కరీంనగర్ జిల్లా పరిషత్ మాత్రం కేవలం 12 గంటల కరెంట్ మాత్రమే సరఫరా చేయాలని తీర్మానం చేయడంలో మతలబు ఏమిటని ఈ సందర్భంగా దత్తన్న ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరముందని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతుల ఆత్మహత్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమాయోజన వల్ల రైతులకు ఎంతో మేలు జరిగే అవకాశమున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద నిధులు మంజూరు చేయడం లేదని మండిపడ్డారు. ఈ పథకాన్ని సమగ్రంగా అమలు చేస్తే కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మంచి పేరు వస్తుందన్న భయంతోనే కేసీఆర్ ప్రభుత్వం రైతులకు చేయూతనందివ్వడం లేదని విమర్శించారు.

పంచాయతీరాజ్ చట్ట సవరణపై..
మంత్రివర్గ నివేదిక బయటపెట్టాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పంచాయత్‌రాజ్ చట్ట సవరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో వేసిన సబ్ కమిటీని నివేదికను ముందుగా బయటపెట్టాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయాలనే రాజకీయ కుట్రతోనే తెరాస ప్రభుత్వం చట్టసవరణకు పూనుకుందని విమర్శించారు. అధికార పార్టీ నేతలకు రాజకీయ ప్రయోజనాలను చేకూర్చడమే కోసం రాష్ట్ర ప్రభుత్వం పడుతున్న తాపత్రయంగా కనపడుతోందని వ్యాఖ్యానించారు.లోక్‌సత్తాపార్టీ ఆధ్వ ర్యంలోఆదివారం హమాయత్‌నగర్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వ హించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు పాండురంగారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నుంచి కోదండరెడ్డి, తెదేపా నుంచి నాయక్, ఆప్ పార్టీ నుంచి సుదర్శన్, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి అక్తర్ కాన్, జేఏసీ నుంచి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సర్పంచ్ ఎన్నికలను ప్రత్యక్ష పద్దతిలోనే జరపాలని డిమాండ్ చేశారు. అలాగే కోఆప్షన్ సభ్యుల్లో ఎన్ఆర్ఐలకు అవకాశం రల్పించాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటి వరకు పంచాయతీలకు నిధులు మంజూరు చేయని రాష్ట్ర ప్రభుత్వం...సర్పంచ్‌లు నిధులు దుర్వినియోగానికి పాల్పడే అవకాశం ఎక్కడ ఉంటుందని వక్తలు ప్రశ్నించారు. లేని పక్షంలో ప్రత్యక ఆందోళనకు పూనుకోవాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. దీనిపై త్వరలోనే రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి ఒక వినతి పత్రం సమర్పించాలని నిర్ణయించారు. భవిష్యత్ కార్యచరణ ప్రణాళికను రూపొందించి...ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నేతలు బండారి రామ్మోహన్‌రావు, సరోజిని, శివరామకృష్ణ, రాజీవ్, వీరప్రతాప్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎం కోర్సులో బాహుబలి



అహ్మదాబాద్: ప్రపంచవ్యాప్తంగా వెయ్యికోట్ల రూపాయలకు పైగా వసూలు చేసిన బాహుబలి రెండు భాగాలు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్, అహ్మదాబా ద్(ఐఐ ఎంఏ) అందించే ఒకానొక కోర్సుకు కేస్ స్టడీ కానుంది. మేనేజ్‌మెంట్ సెకండియర్ విద్యార్థులు సినిమా బిజినెస్‌పై ఎంపి క చేసుకున్న ఒక కోర్సులో బాహుబలి కేస్ స్టడీ ఒక భాగంగా ఉంటుందని ఐఐఎంఏ విజిటింగ్ ఫ్యాకల్టీ భరతన్ కందసామి తెలిపారు. బాహుబలి భారతీయ సినిమాకు సరికొత్త దారి చూపింది. కళ, వ్యాపారం, సాంకేతికతను అద్భుతంగా మేళవించింది అని మణిరత్నంతో రోజా, కమల్ హాసన్‌తో ఏక్ దూజే కేలియే లాంటి చిత్రాలను నిర్మించిన కవితాలయ ప్రొడక్షన్స్‌తో పని చేస్తున్న కందసామి చెప్పారు. చాలావరకు సినిమాలు సృజనాత్మకంగా, కళాత్మకంగా ఉంటాయి కానీ మంచి బిజినెస్ చేసుకోలేవు. కొన్ని సార్లు టెక్నా లజీని సరిగ్గా వాడుకోలేవు. కథ బాగుంటుంది కానీ తీసిన విధానం బాగు ండదు. అలాగే ఇంకొన్నిసార్లు మూసపోసిన కథలతో తీసిన సినిమాలకు మం చి ఓపెనింగ్స్ వస్తాయి. కానీ బలహీనమైన కథ కావడంతో అది ఎక్కువ రోజులు నిలబడదు అని ఆయన వివరించారు. అదే బాహుబలి విషయానికి వచ్చే సరికి కళ, టెక్నాలజీ, బిజినెస్ సరిగ్గా కుదిరాయి. అందువల్లనే బాహుబలి, దాని సీక్వెల్ ఘన విజయం సాధించాయని విశ్లేషించారు. మరో నాలుగు నెలల్లో కేస్ స్టడీ పూర్తవుతుందని తెలిపారు.

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిరూపం పరేడ్



- శకటాల కళాకారులకు ఉపరాష్ట్రపతి మెచ్చుకోలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: గణతంత్ర దినోత్సవంలో భాగంగా నిర్వహించిన పరేడ్ మనదేశ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిందని ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ విభాగాలకు చెందిన శకటాలపై వివిధ కళారూపాలను ప్రదర్శించిన కళాకారులకు ఉపరాష్ట్రపతి అభినందనలు తెలిపారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి సుమారు 2000 మంది కళకారాలు, అధికారులు, ఇతర సిబ్బంది హాజరయ్యారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లోని విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు, కళారూపాలను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చిన గణతంత్ర దినోత్సవ వేడుకల్ని గుర్తుచేస్తూ, కళాకారులు ఉపరాష్ట్రపతి నివాసంలోనూ కొన్ని కళారూపాలను ప్రదర్శించారు. కేంద్ర క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మల్లికాంబ క్రీడారూపకం అక్కడున్న అతిథులందరినీ అమితంగా ఆకట్టుకుంది. కళారూపాలు ప్రదర్శించిన ఆర్టిస్టుల్లో అసోం, జమ్ము-కాశ్మీర్, త్రిపుర, గుజరాత్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు.

అస్తిత్వం కోసం ధర్మపోరాటం

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. రాష్ట్రీయ హిందూసేనను స్వామిజీ ప్రారంభించారు. ఆదివారం కాకినాడలో హిందూ ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి వేలాది మంది యువత ఈ సభకు హాజరయ్యారు వారినుద్దేశించి ఆవేశ పూరితంగా ప్రసంగించిన స్వామిజీ వారిలో దేశభక్తిని, హిందూ ఐక్యతను రగిలించారు. తన శరీరం కాలిపో యినా తానువేసిన అడుగు వాడిపోకూడదన్నారు. హెగ్డేకర్ స్థాపించిన రాష్ట్రీయ స్వయం సేవక్ తనకు ఆదర్శమని చెప్పారు. సూర్యచంద్రులు ఉన్నంత కాలం ఆర్ఎస్ఎస్ తన ప్రభావాన్ని ప్రసరిస్తూనే ఉంటుం దన్నారు. ఆధునిక యువతను ఈ ఉద్యమంలో భాగస్తుల్ని చేసేం దుకే తాను రాష్ట్రీయ హిందూసేనను స్థాపించినట్లు వివరించారు. 2020నాటికి ఈ సంస్థ దేశవ్యాప్తంగా తన సత్తా ప్రదర్శిస్తుం దన్నారు.

హిందువులపై ఇంత వివక్షా..?

దేశంలో హిందువులపై వివక్ష సాగుతోందంటూ స్వామిజీ ఆగ్రహించారు. ఇతర మతస్తులకు లేని ఆంక్షలు, ఒత్తిళ్ళు హిందువులపై ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. తమ సభకు అనుమతిచ్చేందుకు స్వామిజీ వివాదాస్పద వాఖ్యలు చేయబోరంటూ ముందస్తు హామీ పత్రాన్ని పోలీసులు డిమాండ్ చేయడంపై ఆయన మండిపడ్డారు. విదేశాల నుంచొచ్చి ఇక్కడ క్రైస్తవ మత కూటములెట్టి హిందూ దేవుళ్ళను సైతానులుగా తిట్టిపోస్తున్న వారి నుంచి ఇలాంటి హామీపత్రాలు పొందుతున్నారా అంటూ ప్రశ్నించారు. ఓ ప్రజాప్రతినిధి అయి ఉండి అసదుద్దీన్ ఓవైసి ఈ దేశంలో గుళ్లు, గోపురాలన్నింటిని ధ్వంసం చేస్తానంటూ ప్రకటిస్తున్న సభలు, సమావేశాలకు ముందు ఇలాంటి పత్రాలు పొందారా అని నిలదీశారు. అక్బరుద్దీన్ ఓవైసి ఏకంగా వందకోట్ల మంది హిందువుల్ని నరికి పారేస్తానంటూ చేస్తున్న ప్రకటనలకు ముందే హామీలు పొందారా అని ఆగ్రహించారు. వారికి లేని ముందస్తు హామీలు శాస్త్రాలు, ఉపనిషత్తులు ప్రబోధించుకునే హిందువుల సభలకు మాత్రం అవసరమా అంటూ దుయ్యబట్టారు. హిందూదేశంలో ఇతర మతస్తులకున్న స్వేచ్ఛ హిందువులకు మాత్రం లేకపోవడం ఆవేదనా భరితమన్నారు. సుదీర్ఘ పోరాటానంతరం బ్రిటీషీయులు ఈ దేశం నుంచి కట్టకట్టుకుపోతూ సైతాన్ వంటి క్రైస్తవాన్ని ఇక్కడ వదిలిపెట్టి వెళ్ళారన్నారు. దేశాన్ని మతం పేరిట చీల్చారన్నారు. అంతకుముందే తురుష్కులు ఈ దేశంలో ఇస్లాంను వదిలి పోయారన్నారు. మతం పేరిట ప్రత్యేక దేశం కోసం డిమాండ్ చేసిన ముస్లింలు మొత్తంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు తరలిపోయి ఉండాల్సిందన్నారు. అప్పుడు ఈ అక్బర్ అసదుద్దీన్‌ల బాధ ఈ దేశానికి ఉండేదికాదన్నారు.

సమయం వచ్చింది.. సత్తా చాటుదాం

1218 తెగలుగా ఉన్న హిందువులు దేశ జనాభాలో 85శాతం ఉన్నారు. వీరంతా సంఘటితంగా రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సిన సమయమొచ్చిందని స్వామిజీ చెప్పారు. డిసెంబర్‌లో జరిగే రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ హిందూ అనుకూల ప్రభుత్వాలు ఏర్పాటు కావాలన్నారు. అప్పుడే హిందువుల హక్కులు రక్షింపబడతాయన్నారు. హిందువులు గడప లోపలే కులాన్ని ప్రస్తావించాలన్నారు. గడప దాటితే తామంతా హిందువులన్న ఐక్యభావంతో నడవాలన్నారు. త్వరలోనే అమరావతి, హైదరాబాద్‌ల్లో హిందూ సభలు ఏర్పాటు చేద్దామని పిలుపునిచ్చారు. అయితే ఇవి ఇతరుల్ని నిందించడానికి కాదన్నారు. తమ ధర్మ పరిరక్షణకు మాత్రమేనని స్పష్టం చేశారు.

ఆలయ ఆదాయ, వ్యయాలపై శ్వేతపత్రం

చర్చిలు, మసీదుల జోలికెళ్ళని ప్రభుత్వాలు హిందూ దేవాలయాల్ని రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చేశాయని స్వామీజీ ఆరోపించారు. దేవాదాయశాఖకు చెందిన ముగ్గురు అధికారులు ఏసీబీకి దొరికితేనే మొత్తం రూ. 450 కోట్ల అక్రమాస్తులు వెలుగుచూసాయన్నారు. మొత్తం 30వేల దేవాదాయశాఖ సిబ్బంది అక్రమాదాయాన్ని లెక్కిస్తే ఆలయ సంపదను వీరేవిధంగా దోచుకుంటున్నది అర్థమౌతుందన్నారు. పేద హిందువు కూడా రూపాయి రూపాయి పోగేసి తమ దేవుడి కోసం హుండీల్లో వేస్తుంటే ఆ సొమ్మును అధికారులు తమ సొంతానికి దిగమింగుతున్నారన్నారు. రాష్ట్రంలోని మొత్తం ఆలయాల్లో ఆదాయ, వ్యయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఓ పథకం ప్రకారం హిందూ దేవాలయాల్ని భ్రష్టుపట్టిస్తున్నారన్నారు. విజయవాడ కనకదుర్గ ఆలయంలో అర్థరాత్రి ఏం జరిగిందన్నది ఇంతవరకు ప్రభుత్వం ప్రకటించలేదన్నారు. అప్పటి ఈఓను మాత్రం బదలీ చేశారన్నారు. అసలు ఆలయంలో క్షుద్ర, తాంత్రిక పూజలు జరిగాయా అన్నది తేల్చాలన్నారు. హిందూ ఆలయాలపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలకు ప్రభుత్వం కూడా వంతపాడుతోందన్నారు. విజయవాడ అమ్మవారిని ఓ పాస్టర్ సైతాన్‌గా తిట్టాడరన్నారు. మరొకరు తిరుమల ఆనంద నిలయం పక్కనే నిలబడి ఇక్కడున్న సైతాన్‌ను తరిమికొట్టమంటూ ఏసు క్రీస్తును ప్రార్థిస్తున్న వీడియో సోషల్ మీడియాలో చక్కెర్లు కొడుతోందన్నారు. ఇలాంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోలేక పోతోందని దుయ్యబెట్టారు. తమ దేవుళ్ళను పరాయి మతస్తులు తిడుతుంటే వారి కాళ్ళు పట్టుకోవాలా అంటూ ప్రశ్నించారు. అలాంటి పరిస్థితి లేదని అవసరమైతే పీక



పట్టుకుంటామంటూ ప్రకటించారు. కోటప్పకొండపై శివుడి పక్కన మసీదు, చర్చి బొమ్మలు పెట్టడం ఓ ప్రజాప్రతినిధి ఇది సెక్యులర్ వ్యవస్థ అంటూ వ్యాఖ్యానించడంపై ఆయన మండిపడ్డారు. ఇటువంటివి ఉపసంహరించుకోని పక్షంలో తీవ్ర చర్యలు తప్పవన్నారు.

విజయఆదిత్యే స్ఫూర్తి

తన ధర్మ పోరాటానికి హైదరాబాద్‌కు చెందిన విజయఆదిత్యే స్ఫూర్తి అని స్వామీజీ ప్రకటించారు. ఆదిత్యకు కాళ్లూ చేతులు పని చేయవు.. వినికిడిలేదు.. మాట్లాడలేడు.. కానీ హిందూ ధర్మం పట్ల ఆయన భావతరంగాల్ని వికలాంగురాలైన తల్లి పసిగట్టగలుగుతుంది. వాటిని అక్షర బద్ధం చేస్తోంది. వాటిని స్నేహితులు పుస్తకరూపంలోకి తెస్తుంటారు. విజయా దిత్య తన వద్దనున్న రూ. 50 వేలకు చెక్కు రాసి దాన్ని సరిహద్దుల్లోని జవాన్ల రక్షణకు వినియోగించాలంటూ ప్రధానికి అందించమని తన చేతికిచ్చినట్లు స్వామీజీ తెలి పారు. ఇకముందు ఆదిత్య, ఆయన తల్లి బాధ్యతల్ని తానే స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు.

తప్పయితే అరెస్టు చేయండి

తమ మతంపై జరుగుతున్న దాడికి సంబంధించి తాను చేసిన వ్యాఖ్యలు తప్పయితే సభలో ఉన్న పోలీసులు తనను అరెస్టు చేసుకోవచ్చని స్వామీజీ పేర్కొన్నారు. తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని, అవసరమైతే జైలుకెళ్లేందుకు కూడా సిద్ధమేనన్నారు.

మే 20న జేఈఈ అడ్వాన్స్‌డ్



(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. అడ్వాన్స్‌డ్ పరీక్షను ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు. దరఖాస్తులను మే 2 నుంచి 7 వరకు స్వీకరిస్తారు. మే 8న ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పించారు. విద్యార్థులు తమ అడ్మిట్ కార్డ్(హాల్‌టికెట్)ను మే 14 నుంచి 20 వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ పరీక్ష మే 20న దేశవ్యాప్తంగా జరగనుంది. పేపర్-1 ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగుతుంది. విద్యార్థులు ఇచ్చిన మెయిల్ ఐడీలకు ప్రశ్నాపత్రం ప్రాథమిక కీని మే 25న పంపిస్తారు, 29, 30 తేదిల్లో అభ్యంతరాలను స్వీకరిస్తారు. జూన్ 10న ఫలితాలను ప్రకటిస్తారు. పేపర్-1, పేపర్-2 పరీక్షలకు హాజరైన వారికి మాత్రమే ర్యాంకులను ప్రకటిస్తారు. అడ్వాన్స్‌డ్ పరీక్షకు విద్యార్థి కనీసం 5 నగరాలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. వాటిలో ఒక పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తారు.

ఫీజు వివరాలు

పరీక్ష ఫీజు రూ. 2600గా నిర్ణయించారు. బాలికలకు రూ. 1300గా, ఎస్సీ, ఎస్టీలకు కూడా ఫీజును రూ. 1300గా నిర్ణయించారు. ఇతర దేశాల్లో ఉండేవారు పరీక్షకు హాజరయితే పరీక్ష ఫీజు దక్షిణాసియా దేశాల వారికి 160 అమెరికన్ డాలర్లుగా, ఇతర దేశాలకు 300 అమెరికన్ డాలర్లుగా నిర్ణయించారు.

తెలంగాణలో 6 నగరాల్లో పరీక్షా కేంద్రాలు

జేఈఈ అడ్వాన్స్‌డ్- 2018 పరీక్షకు తెలంగాణలోని హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వరంగల్ నగరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో 11 నగరాల్లో పరీక్షా కేంద్రాలు

ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, అనంతపూర్, ఏలూరు, గుంటూరు, కాకినాడ, కర్నూల్, నెల్లూర్, ఒంగోల్, రాజమండ్రి, తిరుపతి నగరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఏప్రిల్ 8న జేఈఈ మెయిన్స్

జేఈఈ మెయిన్స్- 2018 పరీక్ష ఆఫ్‌లైన్‌లో ఏప్రిల్ 8న జరగనుండగా ఆన్‌లైన్ పరీక్ష ఏప్రిల్ 15, 16 తేదిల్లో జరుగుతుంది. వీటిలో అర్హత సాధించిన 2,24,000 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయడానికి అవకాశం కల్పిస్తారు.

అధికారాలన్నీ బోర్డుకే..!

(మొదటిపేజీ తరువాయి)

లేఖ రాశారు. ఇరు రాష్ట్రాలు ఆమోదిస్తే మాన్యువల్‌ను కేంద్ర జలవనరుల శాఖ ఆమోదానికి పంపనున్నారు. ఈ మాన్యువల్‌కు ఆమోదం లభిస్తే కృష్ణాబోర్డుకు సర్వాధికారాలు దక్కుతాయి. కృష్ణాజలాలకు సంబంధించి.. రాష్ట్రప్రభుత్వాలు ఏం చేయాలన్నా బోర్డుకు వినతులు చేయాల్సి ఉంటుంది. మాన్యువల్‌లోని మార్గదర్శకాల ప్రకారం బోర్డు పరిధిలోకి వచ్చే ప్రాజెక్టుల విష యంలో ఏ పనులు చేయాలన్నా అనుమతి తప్పనిసరి. వాటి అంచనాలు బోర్డుకు అందించాల్సి ఉంటుంది. కృష్ణాబేసిన్‌లో హంద్రీనీవా, గాలేరునగరి, వెలిగొండ, తెలుగుగంగ, కల్వకుర్తి, నెట్టెంపాడు ప్రాజెక్టులను ఇరు రాష్ట్రాలు పూర్తిచేసు కోవచ్చు. కానీ కొత్తగా ప్రాజెక్టులు చేపట్టాలంటే బోర్డు అనుమతి తప్పనిసరి. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు తేల్చేవరకు కేంద్రం ఏర్పాటుచేసిన తాత్కాలిక ఒప్పందం అమల్లో ఉంటుంది. బోర్డు రూపొందించిన మాన్యు వల్‌లోని అంశాలను పరిశీలిస్తే కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులన్నీ బోర్డు పరిధిలోకి వస్తాయన్నది స్పష్టమవుతోంది. రాష్ట్రప్రభుత్వాల పాత్ర నామమాత్రం కానుంది.

అపెక్స్ కౌన్సిల్‌కు..

బోర్డు, కమిటీల స్వరూపం, అపెక్స్ కౌన్సిల్ భేటీలకు సంబంధించి బోర్డు మార్గదర్శకాలు ఖరారుచేసింది. దీని ప్రకారం చైర్మన్, సభ్య కార్యదర్శి, కేంద్రం నియమించేజలవిద్యుత్ నిపుణుడు, ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖల కార్యదర్శులు, ఈఎన్‌సిలు బోర్డులో సభ్యులుగా ఉంటారు. ఆర్థిక సంవత్సరంలో కనీసం రెండుసార్లు బోర్డు సమావేశం జరపాలి. ప్రత్యేక పరిస్థితులు ఉత్పన్నమైతే ప్రత్యేక సమావేశాలు కూడా నిర్వహించాలి. సంప్రదింపుల ద్వారానే నీటి కేటాయింపులు చేయాలి. ఒకవేళ ఓటింగ్ అవసరమైతే బోర్డు సభ్యులకు ఒక్కో ఓటు ఉంటుంది. సరిసమానంగా ఓట్లు వచ్చినపుడు చైర్మన్ ఓటుహక్కు వినియోగించుకుంటారు. పరిష్కరించలేని వివాదాలను అపెక్స్ కౌన్సిల్ పరిశీలనకు బోర్డు నేరుగా పంపవచ్చు. అపెక్స్ కౌన్సిల్‌ను ఆశ్రయించే స్వాతంత్ర్యం ఇరు రాష్ట్రాలకూ ఉంటుంది.

తెలుగురాష్ట్రాలు ఏం చేస్తాయి?

కృష్ణాబోర్డు రూపొందించిన వర్కింగ్ మాన్యువల్‌పై నీటిపారుదల శాఖవర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి కల్వకుర్తి, నెట్టెంపాడు పూర్తిచేసుకోవచ్చు.. ఇతర ప్రాజెక్టులు కొత్తగా నిర్మించాలంటే బోర్డు అనుమతి తప్పనిసరి అని మాన్యువల్‌లో ప్రతిపాదించారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టుల ప్రస్తావన లేకపోవడం.. కొత్తప్రాజెక్టులకు బోర్డు అనుమతులు తీసుకోవాలన్న మార్గదర్శకాల నేపథ్యంలో ఈ వర్కింగ్ మాన్యువల్‌పై.. ఏకాభిప్రాయం రావడం కష్టమేనన్న చర్చలు సాగుతున్నాయి. ఈనెల 30న బోర్డు భేటీ ఖరారుచేసిన నేపథ్యంలో.. వర్కింగ్ మాన్యువల్‌పై స్పష్టత రానుంది. కృష్ణా బోర్డు తీరుపై పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసిన తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి కూడా ఫిర్యాదులు చేసింది.

ఆస్తికోసం...

(మొదటిపేజీ తరువాయి)

హోటల్ దగ్గర ఉండగా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆదివారం సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఘటన దురదుష్టకరమని ఎస్పీ పేర్కొన్నారు. ఆస్తి దగాదా వల్లే ఈ దారుణం జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితుడిని కఠినంగా శిక్షించేలా చూస్తామన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో రామస్వామి తెల్కపల్లిలో పదవ తరగతి చదువుతున్నాడు. భాస్కరయ్య భార్య 15 ఏళ్ల క్రితమే కుటుంబాన్ని, పిల్లలను విడిచి తల్లిగారింటికి అన్నారం వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. జుల్సాలకు అలవాటుపడ్డ నిందితుడు డబ్బుల కోసం తరుచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడని గ్రామస్థులు తెలిపారు. ఒకే కుటుంబంలో ముగ్గురు హత్యకు గురవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అమెరికాలో టెక్కీ అనుమానాస్పద మృతి

(మొదటి పేజీ తరువాయి)

పెయింగ్ గెస్ట్‌గా ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం తన గది నుంచి ఆయన ఎంతవరకూ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన ఆ ఇంటి యజమాని పోలీసులకు సమాచారమందించాడు. అక్కడికి వెళ్లిన పోలీసులు గది తెలుపులు తెరచి చూడగా, మంచంపై కృష్ణచైతన్య నిర్జీవంగా పడి ఉండడం గమ నించారు. కాగా, కృష్ణచైతన్య మృతదేహాన్ని స్వస్థలానికి పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, అతని మృతదేహాన్ని ఇక్కడికి తరలించే ఏర్పాట్లను మంత్రి హరీష్‌రావు పర్యవేక్షిస్తున్నారని సమాచారం.

పాక్‌కు చైనా డ్రోన్‌లు



(మొదటిపేజీ తరువాయి)

4వేల కిలోమీటర్ల వరకు తీసుకెళ్ళగలవు. వైజడ్-102ఎ, ఎల్ఎస్-6 రకాలకు చెందిన మీనియేచర్ గైడెడ్ బాంబుల్ని కూడా మోసుకుపోగలవు. ఇంతవరకు ఇలాంటి డ్రోన్లను చెంగ్డు ప్రావిన్స్‌లోని ఎయిర్‌క్రాఫ్ట్ పరిశ్రమలో మాత్రమే తయారు చేస్తున్నారన్న సమాచారముంది. 2008లోనే చైనా ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరిచింది. 2011లో వీటిని ప్రదర్శించింది. వీటి ఉత్పత్తిపై చైనా గతంలో స్పష్టంగా ప్రకటించేదికాదు. కొన్ని దేశాల్లో ఇవి వెలుగుచూడడంతో స్వీయ అవసరాలకే ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొంది. వీటిలో ఆరురకాల డ్రోన్లను చైనా అభివృద్ధి పరిచింది. టెరోసార్ 1, టెరోడక్కీ 1, స్కైసాకర్, డబ్ల్యుజె-1, జిజె-1 వింగ్‌లూంగ్ 2 రకాల్ని ఇంతవరకు తయారు చేయగా ఇందులో వింగ్‌లూంగ్ ఆధునిక క్షిపణి ప్రయోగ సామర్థ్యం కలిగిన డ్రోన్. ఇప్పుడు ఈ రకమే పాక్ భూభాగంలో ఉన్నట్లు ఉపగ్రహాలు గుర్తించాయి. ఇది వందకిలోలకు పైగా బరువైన ఆయుధాలు, బాంబుల్ని సునాయాశంగా మోసుకుపోగలదు. భారత్‌లోని ప్రధాన రక్షణ కేంద్రాలన్నీ దీని సామర్థ్య పరిధిలోకొస్తున్నాయి.డ్రోన్ల ఉత్పత్తిలో భారత్ ముందంజలోనే ఉన్నప్పటికీ రక్షణ రంగానికి అవసరమైన డ్రోన్ల నిర్మాణ సాంకేతిక పరిజ్ఞానంలో మాత్రం పెద్దగా ప్రగతి సాధించలేదు. ఇప్పటికీ ఇజ్రాయెల్ నుంచే కొన్నిరకాల సైనిక డ్రోన్లను భారత్ దిగుమతి చేసుకుంటోంది. వింగ్‌లూంగ్ స్థాయిలో సామర్థ్యంగల డ్రోన్లను ఇజ్రాయెల్ కూడా తయారు చేయలేదు. దీంతో ఇప్పుడు అంతకుమించిన ఆయుధ సామర్థ్యంతో కూడిన డ్రోన్ల తయారీపై భారత్ దృష్టిపెట్టక తప్పని పరిస్థితి ఏర్పడింది.

కష్టకాలంలో ఇష్టపడే బడ్జెట్ ఎలా?!

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి వెసులుబాట్లు, వాగ్దానాలు, హామీలు ఉండకపోవచ్చునే సందేహాలకు ఆస్కారమిస్తున్నాయి. ఇప్పటికీ వ్యవసాయంపైనే ఆధారపడుతున్న గ్రామీణ భారతం ప్రకృతి అనుకూలించని కారణంగా ఆశించినంత పంట దిగుబడి లేక అవస్థలు పడుతున్నది. ఉపాధి లేమికి తోడు పండిన పంటకు గిట్టుబాటు ధర లభించక పంటను రోడ్లపైన కుమ్మరిస్తున్న పరిస్థితులు యావత్ భారతాన్ని కట్టికుదిపేస్తున్నాయి. ఇదే విషయం డిసెంబర్‌లో జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో పాలక బీజేపీపై ప్రతికూల ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో గ్రామీణ భారతానికి, సాగు రంగానికి బడ్జెట్‌లో ఏదో ఒకటి చేయాల్సిన అత్యవసర పరిస్థితి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని సవాల్ చేస్తున్నది. నోట్ల రద్దు చేసి ఏడాది దాటిపోయినప్పటికీ అది ఎలాంటి సత్ఫలితాలను ఇవ్వకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఇంటా బయటా విమర్శలను ఇంకా ఎదుర్కొంటూనే ఉంది. కేవలం స్మార్ట్ సిటీల అభివృద్ధి, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయల రూపకల్పనతో గ్రామీణ భారతానికి ఉపాధి అందించబోదని సామాజిక వేత్తలు, ఆర్థిక నిపుణులు ప్రభుత్వం చెవిలో ఇల్లు కట్టుకొని మరీ పోరుతూనే వస్తున్నారు.

ఆర్థిక నేపథ్యం

ఆసియా ఖండంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా పేరొందిన భారత్ ఆర్థిక వృద్ధి 6.5 శాతానికి విస్తరిస్తుందనే భవిష్యవాణి వినిపిస్తున్నది. పాక్షికంగా నోట్ల రద్దు ఫలితం, జీఎస్టీఅమలు పుణ్యమాని ఈనాలుగు సంవత్సరాల కాలంలో ఇదే అత్యంత మందగమనంగా నమోదైంది. ఈ ఫోర్‌కాస్ట్‌ను కేంద్రీయ గణాంకాల కార్యాలయం(సీఎస్ఓ) విడుదల చేసింది. ఆర్థిక వ్యవస్థ కోలుకునే మార్గంలో పయనిస్తున్నదని అది తెలిపింది. ఈ ఫోర్‌కాస్ట్ నిజమైన పక్షంలో మార్చి 31నాటికి ముగిసే ఏడాది ద్వితీయార్థంలో ఆర్థిక వృద్ధి 7 శాతానికి చేరుకుంటుంది.

అన్నీ మంచి శకునములే

2018-19 ఆర్థిక సంవత్సరానికి భారత్ వృద్ధి రేటు 7.3 శాతం ఉండవచ్చని ప్రపంచబ్యాంకు, 7.4 శాతానికి చేరుకుంటుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) పేర్కొన్నాయి. ఇది భారత్‌ను వేగంగా వృద్ధి చెందుతున్న అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెడుతుంది. ఏడాది కాలం లో చైనాను అధిగమించేస్థానానికి భారత్‌ను చేరుస్తుంది.

దడ పుట్టిస్తున్న ద్రవ్యోల్బణం

ప్రపంచబాంకు, ఐఎంఎఫ్ మాటలకు పొంగిపోయే పరిస్థితిలో భారత్ లేదు. మరీ ముఖ్యంగా ఆర్థికపరంగా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆందోళనలు అంతకంతకూ పెరిగిపోతు న్నాయి. మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక ద్రవ్యో ల్బణాన్ని స్థూల దేశీయ ఉత్పత్తి(జీడీపీ)లో 3.2 శాతానికి కట్టడి చేయాలనే తన లక్ష్యానికి గండిపడుతుంటే గుడ్లప్పగించి చూస్తున్నది.

జీఎస్టీ దెబ్బకు ఆస్తులు, వాటాల విక్రయం

జులై ఒకటవ తేదీన జీఎస్టీ అమల్లోకి వచ్చాక పరోక్షపన్ను వసూళ్ళు దారుణంగా పడిపోయాయి. ఆర్థిక రంగంలో కీలక రంగాలకు ఖర్చు చేయడం కోసమని డిసెంబర్‌లో అదనంగా రూ. 50వేల కోట్ల రుణం తీసుకున్నట్టు ప్రకటించాల్సి వచ్చింది. ఆస్తుల విక్రయాలతో అందివచ్చిన ఆకస్మిక



రాబడులతో తదనంతర కాలంలో అదనపు రుణసేకరణను రూ.20 వేల కోట్లకు కుదించుకుంది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.72,500 కోట్ల బడ్జెట్ లక్ష్యాన్ని అధిగమిస్తున్నట్టుగా ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను వదిలించుకోవడం ద్వారా ప్రభుత్వం ఇప్పటికే రూ.91,253 కోట్లు ఆర్జించింది. గత ఏడాది ఆగస్టులో జీఎస్టీ రెవెన్యూ వసూళ్ళు రూ.94,063 కోట్లు ఉండగా డిసెంబర్‌కు వచ్చేసరికి అంటే నవంబర్ మాసానికి అది రూ.80,808 కోట్లకు పడిపోయింది.

ఇ-వే బిల్లుతో నష్టనివారణ

రూ.50 వేలు కన్నా ఎక్కువ విలువ కలిగిన సరకులను ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి తరలించాలంటే ఇ-వే బిల్లు ఉండాలి. వచ్చే నెల ఒకటవ తేదీ నుంచి ఇ-వే బిల్లును రంగంలోకి తీసుకురావడం ద్వారా రెవెన్యూ వసూళ్ల పతనాన్ని నిలువరించాలని ప్రభుత్వం ఆశిస్తున్నది. ఆ క్రమంలోనే ఇ-వే బిల్లు విధానాన్ని అనుకున్న దాని కన్నా రెండు మాసాల ముందే రంగంలోకి దించాలని డిసెంబర్ 16న సమావేశమైన జీఎస్టీ మండలి నిర్ణయించింది.

ప్రత్యక్ష పన్నులతో ప్రభుత్వానికి ఊపిరి

జనవరి 15వ తేదీ వరకు చూసినప్పుడు ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రత్యక్షపన్ను వసూళ్ళు 18.7శాతం వృద్ధితో అంచనాలను అధిగమించాయి. పూర్తి వార్షిక బడ్జెట్‌లో 70.3 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రభుత్వానికి ఊపిరి పోశాయి.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం

సామాన్యుడి అవసరాలు, ఆకాంక్షలు తీర్చేలా ఒక నిర్ణయం తీసుకుంటామే తప్ప వచ్చే బడ్జెట్‌లో ఎలాంటి వరాలు, తాయిలాలు ప్రదర్శించబోమని ఈ నెల 22వ తేదీన జాతీయ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్రమోడీ పరోక్షంగా చెప్పారు. దీంతో వచ్చేది ప్రజాకర్షణ బడ్జెట్ అనే అంచనాలు పటాపంచలైపోయాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్ నుంచి గ్రామీణ ఉపాధి కల్పన కార్యక్రమాలు, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన ఊపందుకోవాలని ఆశిస్తున్నట్టు సెక్యూరిటీస్ సంస్థ ఏంజెల్ బ్రోకింగ్ లిమిటెడ్ ఒక నివేదికలో పేర్కొంది.

కనీస మద్దతు ధర పెంచాలి

ప్రభుత్వం గ్రామీణ ఉపాధి పథకాలకు కేటాయింపులు పెంచాలని ఏక్సిస్ క్యాపిటల్ ఒక నివేదికలో పేర్కొంది. నిర్మాణ పనులు ఊపందుకునేలా స్థోమతకు తగిన గృహాల నిర్మాణానికి రాయితీలను పొడిగించాలని కోరింది. ఈసారి సాగు దిగుబడి తగ్గిన వైనాన్ని గుర్తించి దాన్ని పరిష్కరించడం ప్రభుత్వం ముంగిట ఉన్న కీలకమైన సమస్య. దీని కోసం రుణాల లభ్యతను పెంచడం, మార్కెటింగ్ మౌలిక సదుపాయాల కల్పనలో పెట్టుబడులు ఏ మాత్రం సాయపడవు. సత్వర ఫలితాలు రావాలంటే నేరుగా మార్కెట్‌లోకి జోక్యం చేసుకొని కనీస మద్దతు ధర, పంట సేకరణ పెంపుదల మాత్రమే ఏకైక మార్గం అని ఏక్సిస్ క్యాపిటల్ సూచించింది.

హజారే స్ఫూర్తితో పోరాడతా

- గల్ఫ్ బాధితులకు ప్రత్యేక విభాగం
- పునర్విభజనలో పుట్టపర్తి జిల్లాను ఏర్పాటు చేయాలి
- అనంత పర్యటనలో పవన్ కల్యాణ్

అనంతపురం, ప్రభ న్యూస్: రాష్ట్ర రాజధాని అమరా వతిలో రాయలసీమ ప్రాంతానికి అభివృద్ధిలో సంబంధం లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. తెలంగాణ తరహా భావోద్వేగం రాకుండా కృషి చేయాల్సిన అవసరం ప్రతి రాజ కీయ పార్టీ, రాజకీయ వ్యవస్థపై ఉందని.. ఇదే విషయాన్ని తాను ప్రధానమంత్రితో చెప్పానని, దీనిపై దృష్టి సారించ కపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పా నని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన అనంతపురం నగరంలోని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత స్వగృహానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ గత 30 సంవత్సరాల క్రితం ప్రారంభించిన హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎందుకు ఇంత వరకు పూర్తీ కాలేదని.. ఈ విషయంలో తనకున్న సందేహాలను మంత్రి వద్ద వ్యక్తపరించినట్లు తెలిసింది. హెచ్ఎన్ఎస్ఎస్‌తో పాటు జిల్లాలోని పలు ప్రాజెక్టుల పురోగతి గురించి కూడా ఆరాదీసినట్లు తెలిసింది. అనంతరం తనను కలిసిన పాత్రికేయులతో పవన్ కళ్యాణ్ కాసేపు మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత ఎక్కువ ఇబ్బంది పడింది రాయలసీమ ప్రాంతం, తూర్పు ఆంధ్ర ప్రాంతం. మరీ ముఖ్యంగా అనంత జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందన్నారు.

ఏ విషయంలో కూడా తొందర పడి ప్రకటనలు చేయకుండా బాధ్యతాయుతమైన రాజకీయాలు చేస్తాను. వాస్తవాలు తెలుసుకునేందుకు అందరితో మాట్లాడుతూ.. ఏ పార్టీ వారినైనా కలిసేందుకు నేను సిద్ధంగా ఉన్నానన్నారు. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత ఆయా సమస్యల పై జనసేన పంథా ఏమిటన్నది వెల్లడిస్తామన్నారు. అలాగేశ్రీబాగ్ ఒడంబికల్లో భాగంగా రాయలసీమ హైకోర్టు పెట్టాల్సి ఉంటుంది. దీనిపై మీ స్టాండ్ ఏమిటని ప్రశ్నించగా.. దాని గురించి పూర్తీగా తెలుసుకున్న తర్వాత మాట్లాడుతానని ఓ పాత్రికేయుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కార్యక్రమంలో యువనేత పరిటాల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో గల్ఫ్‌బాధితులకు న్యాయం చేయడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారని, అదే తరహాలో ఆంధ్ర రాష్ట్రంలో సైతం గల్ఫ్ బాధి తులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో పవన్‌కళ్యాణ్ నిర్వహిస్తున్న చలోరో.. చలోరో.. చల్ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు ఆదివారం కదిరి పట్టణం లో కదిరి కరువు సమస్యలపై మహిళలతో ఇష్టాగోష్ఠి కార్య క్రమంలో పాల్గొని మాట్లాడారు. రాయలసీమ జిల్లాల్లో అత్యధికంగా ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లి అక్కడ నానా అగ చాట్లు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి కోసం వెళ్లిన వారు వెట్టిచాకిరితో పాటు బందీలుగా మిగులుతున్నారన్నారు. తాను దుబాయ్ వెళ్లినప్పుడు అక్కడ చాలా మంది వారి పరిస్థితిని తన దృష్టికి తేవడం జరిగిందన్నారు. అంతే కాకుండా ఏజెంట్లు, దళారీల బారిన పడి మోసపోయిన మహిళలు ప్రస్తుతం తన పర్యటనలో సైతం వారి దీనగాథలను చెప్పడంతోనే గల్ఫ్ బాధితులకు రాష్ట్రంలో కూడా ప్రత్యేక విభాగాన్ని రాష్ట్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం జరుగుతోందన్నారు. ఇదే విషయాన్ని త్వరలోనే ప్రభుత్వం దృష్టికి సైతం తీసుకెళ్తానన్నారు. రాష్ట్రంలో ఎన్నో జిల్లాలు ఉన్నా అనంతపురం జిల్లానే తాను దత్తత తీసుకోవడానికి ఎన్నోకారణాలున్నాయన్నారు. అందుకు జిల్లా కరువు పరిస్థితులను తాను తన సన్నిహితుల ద్వారా ఎన్నో సార్లు తెలుసుకొన్నట్లు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా వెనుకబాటు తనానికి అనేక కారణాలు న్నాయన్నారు. ప్రధానంగా ప్రకృతికి అనుకూలించక పోవడంతో



సకాలంలో వర్షాలు కురువకపోవడం శాపంగానే ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ముందంజలో ఉన్న నేటికాలంలో కరువును రూపుమాపే చర్యలను అవలంభించాల్సివుందన్నారు. మనిషి చంద్రమం డలం పైకి వెళ్లడంతో పాటు గ్రహాల పైకి శాటిలైట్లను సైతం ప్రవేశపెడుతున్న విధానం మరువలేనిదన్నారు. త్రికర్ణ శుద్ధిగా మేధస్సును ఉపయోగించి కరువుకు శాశ్విత పరిష్కారం చూపాల్సివుందన్నారు. అనంతపురం జి ల్లా సమస్యల పరిష్కారానికి రాజకీయ నాయకులతో పాటు అధికారులను సైతం భాగస్వామ్యులను చేయాల్సివుం దన్నారు. రాష్ట్రంలోని అనంతపురం,శ్రీకాకుళం జిల్లాల వెనుకబాటు తనాన్ని రూపుమాపే విషయంలో అన్నాహజారే స్ఫూర్తిగా తాను పోరాటం సాగిస్తానన్నారు. ప్రభుత్వాలు సైతం నిధుల లేమిని సాకుగా చూపకూడదని, అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాకు ప్రత్యేక కోణంలో బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాలో వర్షాధార ప్రాజెక్టులకు మాత్రమే అవకాశం ఉందని, శిలాఫలకాలు వేసి పాలకులు వాటిని మరిచారన్నారు. ప్రజలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకొని అటు తర్వాత మరిచిపోవడం తగదన్నారు. అనంతపురం జిల్లా రైతాంగ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని అధికార యంత్రాంగాలను కదిలించడంతో పాటు దేశ ప్రధానికిచ్చే నివేదికలో పొందుపరచనున్నట్లు వెల్లడించారు. రైతు ఆత్మహత్యలతో మహిళల ఆత్మ గౌరవం దెబ్బతినడంతో పాటు వారి జీవన భృతి లేకపోవడంతో అనేక అంశాలు ఉత్పన్నమవుతు న్నాయన్నారు. అనంతపురం జిల్లాలో గ్రామాలకు గ్రామాలే వలసలు వెళ్లిన విధానం కొనసాగుతోందని, అనంతపురం జిల్లా రైతులకు ప్రత్యేక పరిస్థితులున్నాయన్నారు. రైతు కుటుం బాలను ఆదుకోవడానికి నిధులను ప్రత్యేకంగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిధుల విడుదలకై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానన్నారు. జిల్లా ప్రజలం దరూ ఏకతాటిపైకి వచ్చి అనంత కరువును ఎదుర్కోవాల్సి వుందన్నారు. అనంత కరువుపై పోరాడుతూ.. మద్దతివ్వండి అంటూ పవన్‌కళ్యాణ్ మహిళా ఇష్టాగోష్ఠిలో కోరారు.

పుట్టపర్తి జిల్లాకు మద్ధతిస్తా..

కదిరి పట్టణంలో కరవు, మహిళ గోష్ఠి కార్యక్రమం అనంతరం పవన్ కళ్యాణ్ పుట్టపర్తికి పయనమయ్యారు. సాయంత్రం 6.10 గంటలకు ప్రత్యేక వాహన శ్రేణి, బైక్ ర్యాలీ మధ్య పుట్టపర్తి హనుమాన్ సర్కిల్‌కు చేరుకున్న ఆయన మాట్లాడుతూ.. భగవాన్ బాబా ఈ ప్రాంతంలో నడియాడే దేవుడని.. ఆయన మానవాళికి అందించిన సేవలు జిల్లాతో పాటు దేశ, విదేశాలకు ఆదర్శమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల ఏర్పాటు జరిగితే.. పుట్టపర్తి జిల్లాగా ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని ఇందుకు తనతో పాటు తన పార్టీ మద్ధతుగా ఉంటుందన్నారు.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీ గవాక్షం

జీవనగమనాన్ని సూచించే భగవద్గీత

మహాభారతం గురించి తెలియని భారతీయులుండరంటే అతిశయోక్తి కాదు. వ్యాసుడు సంస్కృతంలో రచించిన మహాభారతంలోని భీష్మపర్వంలో 26 నుండి 42 అశ్వాసాల్లో భగవద్గీత నిక్షిప్తమై ఉంది. ఈ భగవద్గీత ప్రపంచంలోని అనేక భాషల్లోకి అనువదించబడింది. ఇది కాలాలకతీతంగా సర్వకాలానికి ఉపయుక్తమైనది. నేటితరం వారు, ముఖ్యంగా యువత దీనిని క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సిన అవసరం చాలా వున్నది. దీన్ని కేవలం ఆధ్యాత్మిక కోణంలోనే చూడాల్సింది కాదు. మానవుడు ఎలా తన నడవడికను తీర్చిదిద్దుకోవాలో ఇది సూచిస్తుంది.

మానవుడు ధర్మబుద్ధితో ఎలా అభివృద్ధి పథంలో పయనించాలో కూడా దీని ద్వారా గ్రహించవచ్చు. ''మహాభారతంలో ఉన్నదే ఇతరత్రా ఉంది. ఇందులో లేనిది ఇంకెక్కడా లేదు'' అని పెద్దలంటారు. దీనిని బట్టి భారతం యొక్క విలువ ఏమిటో అవగతమవుతుంది. అందునా భగవద్గీత నిత్య జీవితానికి అవసరమైన అనేకానేక అంశాలను, విధుల్ని సూచిస్తుంది. ఏది అవసరమైనదో, ఏది కాదో కూడా ఈ భగవద్గీత ద్వారా తెలుసుకోవచ్చు. కురుక్షేత్ర సంగ్రామ సమయంలో యుద్ధం చేయడానికి విముఖుడైన అర్జునుడికి శ్రీకృష్ణుడు కర్తవ్యబోధ చేస్తాడు. శ్రీకృష్ణుడు అర్జునుడికి సందేహ నివృత్తి చేసి అతన్ని యుద్ధానికి సన్నద్ధం చేయడం కనిపిస్తుంది. అయితే ఇది కేవలం యుద్ధం చేయించడానికి మాత్రంగా భావిస్తే పొరబడినట్టే? ఇందులోని కృష్ణుని ప్రబోధం సర్వ మానవులకు దిశానిర్దేశంగా భావించాలి. ఇట్టి భగవద్గీతను విశ్లేషిస్తూ ఇప్పుడు డా॥రామవరపు శరత్‌బాబు శ్రీమద్భగవద్గీతను విశ్లేషించారు. సులభమైన భాషలో సామాన్యులకైనా తేలిగ్గా అర్థమయ్యేలా వారు దీన్ని తీర్చిదిద్దారు. ప్రతి శ్లోకానికి పదవిభాగం, అన్వయం, ప్రతిపదార్థం, తాత్పర్యం, చిత్కళా వాఖ్య వంటివి వివరంగా ఇందులో కనిపిస్తాయి. భగవద్గీతలోని శ్లోకాలకు కేవలం అర్థం తెలుసుకుంటే సరిపోదు. అందులో లోతైన అంతర్గత భావం ఇమిడి ఉంటుంది. అటువంటి అంతర్గత భావాన్ని శరత్‌బాబు తన వ్యాఖ్య ద్వారా వివరించడం ఈ భగవద్గీత ప్రత్యేకతగా చెప్పవచ్చు. ఈ రచయిత విశ్వనాథ సత్యనారాయణ గారి శిష్యులు. వారి వద్ద సంస్కృతంలో మేఘదూతమ్, ప్రతాప రుద్రీయాది కావ్యాలంకార గ్రంథాలు, తెలుగులో మను చరిత్రాది ప్రబంధాలను అభ్యసించారు. అలా సంస్కృతాంధ్ర భాషల్లో శరత్‌బాబు ప్రావీణ్యం సంపాదించారు.

నేటి యువతరానికి మనచరిత్ర, సంస్కృతి, మన జీవన విధానం ఏమిటో తెలియజేయాలనే సంకల్పంతో సులభమైన భాషలో భారతీయ జీవనానికి దర్పణం పట్టే శ్రీమద్రామాయణ సంహిత, శ్రీమన్మహాభారత మంజూష, శ్రీమద్భాగవత భారతి అనే గ్రంథాలను రూపొందించారు. అలానే రఘువంశం, కుమారసంభవం, మేఘదూతం, కిరాతార్జునీయం, శిశుపాల వధ ఇలా అనేక గ్రంథాలను కూర్చి తన ప్రతిభను చాటుకున్నారు. ఇప్పుడు భగవద్గీతను లోతుగా అధ్యయనం చేసి సులభమైన భాషలో విశ్లేషించి మనముందుంచారు.

భగవద్గీతలో 18 అధ్యాయాలుంటాయి. మొత్తం ఏడు వందల శ్లోకాలు గలది భగవద్గీత. ప్రతి శ్లోకం మానవులకు దిశానిర్దేశం చేసేదే. ఈ పదునెనిమిది అధ్యాయాలకూ యోగమనే నామకరణం జరిగింది. వరసగా అర్జున విషాద యోగం, సాంఖ్యయోగం, కర్మయోగం, జ్ఞానకర్మ సన్న్యాస యోగం, కర్మ సన్న్యాసయోగం, ఆత్మ సంయమ యోగం, జ్ఞాన విజ్ఞాన యోగం, అక్షర బ్రహ్మ యోగం, రాజ విద్య రాజ గుహ్య యోగం, విభూతి యోగం, విశ్వరూప సందర్శన యోగం, భక్తి యోగం, క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగం, గుణత్రయ విభాగ యోగం, పురుషోత్తమ యోగం, దైవాసుర సంపద్విభాగ యోగం, శ్రద్ధత్రయ విభాగ యోగం, మోక్షసన్న్యాస యోగంగా నామకరణం చేయడముంటుంది.

రచయిత ఏ అధ్యాయంలో ఏం చెప్పబడిందో ఆ అధ్యాయం ప్రారంభంలో పాఠకుడికి అర్థమయ్యే రీతిలో చెప్పారు. అధ్యాయంలోకి ప్రవేశించే ముందు ఈ వివరణ అవసరమైనదని చెప్పవచ్చు. మొదటి అధ్యాయం ప్రారంభంలో 'యోగం' గురించి వివరించారు రచయిత.

''సంస్కృతంలో ఏ రచనకైనా ఆదిమధ్యాంతాల్లో మంగళా చరణం కావించడం సంప్రదాయం''అని వివరిస్తూ **''మంగళాదీని మంగళ మధ్యాని, మంగళాన్తాని శాస్త్రాణి ప్రథన్తే''** ఇక్కడ మంగళద్యోతకమైన 'ధర్మ' శబ్దంతో గీతారంభం జరిగింది. ఇందులో పదునెనిమిది అధ్యాయాలకూ 'యోగ' మనే నామకరణం జరగడం విశేషం. యోగ శబ్దానికి అనేకార్థాలుంటాయి. వ్యక్తి ఈ జన్మలో ప్రయత్నమేమీ సలుపక చేకూరే శుభఫలితాలనే 'యోగ'మంటారు. 'క్షేమ'మంటే ఉన్నదాని రక్షణ. 'వేఱే ఆలోచనలు లేక ఎప్పుడూ నన్నే చింతించే వాని యోగక్షేమాలు నేను చూసుకుంటానని భగవానుడు గీతలోనే మరో సందర్భంలో చెపుతాడు.

''అనం న్యాశ్చిన్తయన్తోమాంయేజనాః పర్యుపాసతే।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥''

సాధారణంగా సాధనతో మనశ్చాంచల్యాన్ని అరికట్టటమే యోగమని ప్రసిద్ధి.

''యోగ శ్చిత్తవృత్తి నిరోధః'' అని పతంజలి సూత్రం. ఒక దానితో కూడిన యోగం. జ్యోతి శ్శాస్త్రం లో కొన్ని కొన్ని గ్రహాల కూడిక జాతకునికి ప్రత్యేక 'యోగా'లని ప్రాప్తింపచేస్తాయని పేర్కొంటారు. మనస్సును భక్తితో అనుసంధించినప్పుడు ''భక్తి యోగ''మని ధ్యానంతో సంయోగపరిస్తే ''ధ్యాన యోగ''మని కర్మలో సం యోజిస్తే ''కర్మయోగ'' మనీ, ఇత్యాదిగా ఇందులో అధ్యాయాల పేర్లుంటాయి. అంతవరకు బాగానే ఉంది గాని, ప్రథమాధ్యాయమైన అర్జున విషాద యోగమన్నాడు కదా! 'విషాదం' కూడా ఒక యోగమే నా అనే సందేహం కలగవచ్చు. 'యోగ' శబ్ద రూఢ్యార్థంలో కాక యౌగికార్థంలో అర్జునుని మనస్సు విషాదంతో కూడినది. కనుక దీనికి అర్జున విషాదయోగ మనటం అన్వర్థమే. జీవాత్మ పరమాత్మల కూడికే 'యోగం' అంటూ 'యోగ'మనేదాన్ని గూర్చి డాక్టర్ రామవరపు శరత్‌బాబు వివరించారు.

పదునెనిమిది అధ్యాయాలతో ఏడువందల శ్లోకాలతో ఉన్న శ్రీమద్భగవద్గీత శ్రీకృష్ణార్జున సంవాదరూపంలో అద్వైతామృతాన్ని వర్షించేది. కౌరవుల తండ్రి ధృతరాష్ట్ర మహారాజు సంజయున్ని యుద్ధకాంక్షతో 'ధర్మక్షేత్ర'మైన కురుక్షేత్రంలో యుద్ధసన్నద్ధులై కూడిన తన కుమారులు, కౌరవులు, తన తమ్ముని కుమారులు పాండవులూ ఏం చేసేరని అడిగిన ప్రశ్నతో ఈ గ్రంథం ఆరంభమౌతుంది.


''ప్రపంచంలో ఏ జీవీ కర్మ చేయకుండా క్షణమైనా మన లేడు. ఊపిరి పీల్చడం, విడువటం కూడా కర్మే కదా! జీవనోపాధికి ఒక కర్మ చేపట్టక ఎంతటివారికైనా తప్పదు. అయితే ప్రతిఫలాపేక్ష లేకుండా దానంతట అది లభిస్తే లభించవచ్చు. చేసే పనేదైనా నిష్కామ కర్మ అవుతుంది. సాధారణంగా వ్యక్తులు ధనార్జనకై కర్మలాచరిస్తూ ఉంటారు. ఈ ధనార్జనా పిపాస పెరిగిన కొద్దీ యుక్తాయుక్తా విచక్షణ క్షీణించి అకార్యాలకు కూడా సిద్ధం కావటం చూస్తూ ఉంటాం. ఏదో ఒక వృత్తిలో ఉన్నప్పుడు ఆ వేతనం తీసుకుంటూ వృత్తినే ఆరాధనగా భావించి తన నైపుణ్యాన్ని ప్రస్ఫుటపరచటం, తద్వారా సమాజాన్ని ఆరాధనా భావంతో సేవించడం, నిష్కామ కర్మ. అది యజ్ఞాచరణ వంటిదే'' అంటూ వివరిస్తారు. తృతీయాధ్యాయమైన కర్మయోగం ప్రారంభంలో. ఇలా ప్రతి అధ్యాయం ముందు నేటి సమాజానికి అన్వయిస్తూ తెలపటం గ్రంథంలో కనిపిస్తుంది.

ఇక శ్లోకాలలోని పదాలకు అర్థాలనిస్తూ తాత్పర్యం కూడా ఇస్తూ రచయిత చేసే వ్యాఖ్య కూడా నేటి సమాజానికి నూటికి నూరుపాళ్లు ఉపయోగకరమైనవే.

నతుమాం శక్యసే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా।
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్॥

''అయితే నన్ను నీ ఈ చర్మ చక్షువులతో చూడలేవు. నీకు దివ్యదృష్టినిస్తున్నా. నా భవ్యమైన రూపాన్ని చూడు'' అని పై శ్లోకానికి తాత్పర్యాన్నిచ్చారు శరత్‌బాబు. దీనిపై ఆయన చేసిన వ్యాఖ్య ఇలా ఉంటుంది.

''ఒక విధమైన చలన చిత్రాలు చూడటానికే ప్రత్యేకమైన అద్దాలు ఇస్తున్నారు కదా! కనక కరుణాళుడైన శ్రీకృష్ణ పరమాత్మ దివ్యదృష్టినిస్తున్నానన్నాడు. రాయబారిగా వెళ్లి కురు సభలో తన విశ్వరూపాన్ని చూపినప్పుడు సభాసదులకు, అంధుడైన ధృతరాష్ట్రునికి దివ్యదృష్టి ప్రసాదించినట్లే ఇప్పుడర్జునునికీ దివ్యదృష్టి ప్రసాదిస్తున్నాడు. ఆకాశంలో ఉండే గ్రహాల్ని చూడడానికే మనకీనాడు ప్రత్యేకమైన పనిముట్లు అవసరమవుతున్నప్పుడు సాక్షాత్పరమేశ్వరుని దర్శించడానికి ఈ నేత్రాలకెలా సాధ్యపడుతుంది. ప్రతి శ్లోకానికి ఇలాంటి వ్యాఖ్యలు ఎన్నో ఈ గ్రంథంలో కనిపిస్తాయి.



''సంకుచిత దృష్టి కలవారు వివేకహీనులు, విశాల దృక్పథం లేక స్వప్రయోజనసిద్ధికై లోకాపకారానికి సిద్ధపడతారు. క్రూరకర్మల్లో నిమగ్నులై ఉగ్రవాదంతో జగత్సంక్షోభకారులౌతూ ఉంటారు'' అంటూ మరో శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తారు.

''చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః'' అని శ్రీకృష్ణుడు చెప్పిన విషయాన్నే తిరిగి చెప్పటం వల్ల వర్ణ వ్యవస్థ జన్మతః సిద్ధమైందని కాదని, గుణాలు, వారవలంభించే, వృత్తులవల్లే ఏర్పడిందని చెప్పినట్లైంది'' అని మరో శ్లోకానికి వ్యాఖ్య రాశారు. ఇలా ఈ భగవద్గీతలోని శ్లోకాల గురించి వివరణలు, వ్యాఖ్యలు అందరిని ఆకట్టుకొని ఆలోచింప జేస్తాయనటంలో ఎట్టి సందేహంలేదు. ఏ సంకల్పంతో దీన్ని వెలువరించారో ఆ సంకల్పం నూటికి నూరుశాతం నెరవేరుతుందని ఆశించవచ్చు.

- నియోగి
9553097319

అల్లంత దూరాన...అలల హోరింతలు
పిల్లల కేరింతలు...గాలిపటాలతో కవ్వింతలు
అక్కడికి కాస్తంత దూరంగా..
పెరిగిన గడ్డం...తరిగిన జుట్టు
కరిగిన వయస్సు...మరిగిన మనస్సుతో
నిరంతర పరాజయాల ఓ బాటసారి!
అతని కళ్లు నిర్వేదపు గూళ్లు కాదు
జీవనసారం ఇంకిన అనుభవాల బీళ్లు
పిల్లలు కనిపిస్తే గతాన్ని చెక్కుకునే శిల్పి!
ఆ పిల్లల గుంపుల్లో ఉత్సాహపు తుంపర్లు
కొందరి చేతుల్లో పతంగులు..మాంజాలు
ఔను..అక్కడ పతంగుల పండగలాగే ఉంది!
అంతలోనే ఓ పక్కనుంచి ఓ బుడుతడు
చేతిలో పెద్ద కాగితం..చీపురుపుల్లలు..దారం
గాలిపటమనే ఆకాశ విహంగానికి
రూపమిచ్చే పనిలో తలమునకలయ్యాడు!
ఆ ముఖంలో ఓ తపన..అతనిది ఓ తపస్సు
ఈ బాటసారిలో గతం నీడల జాడల తొణికిసలు
మిట్టపల్లాల జీవిత నావలో అలుపెరుగని ప్రయాణం
చదువు..ఉద్యోగం..పెళ్లి..పిల్లాడు...ఆగని చక్రమది
తనకంటూ ఓ కుటుంబం..దానిమీదే మనసు లగ్నం
కొడుకు మీద ఆరాటం..గొప్పవాణ్ని చేయాలన్న తపన
అదుగో ఆ బుడుతడికి పతంగం మీద ఆసక్తిలాంటిదే!
చక్కగా కుదిరిన సారూప్యతల సమాహారం!
పుత్రోత్సాహం నానాటికీ పెరిగిపోతున్న సంబరం
మంచి చదువులే చదివాడు...మంచి ఉద్యోగమొచ్చింది
అక్కడ ఆ బుడుతడి చేతిలో పతంగం ఊపిరి పోసుకుంది
సైజుని బట్టి పొడుగాటి తోక జోడించాడు..మాంజా కట్టాడు
బాటసారి ముఖంలో మళ్లీభూతకాలపు నీడల జాడలు!
గాలిపటానికి తోకని చూడగానే అతనిలో కాస్తంత నవ్వు!
అవును..కొడుక్కి ఓ తోకని జోడిస్తే ఓ పనైపోతుంది!
అలాగూ పిల్లను చూసి పెళ్లి చేసిన స్మృతులవి
అవతల బుడుతడు పతంగం ఆకాశంలోకి వదిలాడు
కదిలే కాలంతో కొడుకూ కదలాల్సి వచ్చింది!



జీవన గాలిపటం

భార్యతో సహా విదేశీ ఉద్యోగానికి పయనం!
పిల్లల భవిష్యత్తుకి పెద్దలు దాసోహమే
సుదూరంలోనే సంబరాన్ని వెతుక్కోవాలి!
పిల్లలున్న తల్లిదండ్రులకు తప్పని తియ్యని శిక్ష!
గాలిపటం ఆకాశంలో ఎగురుతున్నది
చేయి దాటి దూరంగా పైపైకి వెళ్లినా
ఆ పిల్లాడి ముఖంలో ఎంతటి ఆనందం!
బాటసారి గుండెల్లో అంతుచిక్కని జీవన రొద
కొడుకు అందనంత దూరమెళ్లిన వేదనలోనూ
అనిర్వచనీయ ఆనందం..తన్మయత్వం!
అరె..ఇంతలోనే ఆ కుర్రాడు నీరసించాడేం!
అతడి ముఖం పాలిపోయింది..వాలిపోయింది!
గాలిపటం తెగిపోయింది..చెట్టుకి చిక్కుకుపోయింది
చేతిలో మాంజా మిగిలింది..తల లేని మొండెంలా!
ఆ క్షణం..బాటసారి గుండెలోనూ ఓ గునపమే!
ఉన్నట్టుండి ఓరోజు విషాద వర్తమానం
కొడుకు కోడలు యాక్సిడెంట్ లో పోయారు
ప్రపంచమే శూన్యమైన ఒంటరితనం!
అయినా లోకం ఆగదు..మనిషీ ఆగడు!
కాసేపటికి ఆ కుర్రాడు తేరుకున్నాడు
ఇంట్లోకి పరుగులు పెట్టాడు...మళ్లీ వచ్చాడు
పతంగానికి ముడిసరకు తెచ్చాడు
పాత విషాదం మరిచాడు..పనిలో పడ్డాడు
అరె..మళ్లీ బాటసారి మదిలో అదే సారూప్యత!
పరాయి సీమకెళ్లి తాను లాంఛనాలన్నీ ముగించి
తిరిగొచ్చేసరికి ఇద్దరు మిగిలినట్టయింది
బుడతడి చేతిలో కొత్త గాలిపటం మాదిరిగా
బాటసారి బొటనవేలు పట్టుకుని కొడుకు వారసుడు
బాటసారి కళ్లల్లో ఆ కుర్రాడే మిణుకుతున్నాడు
మళ్లీ గాలిపటం తయారైంది...గాల్లోకి లేచింది!
బాటసారి జీవన చక్రం మళ్లీ మొదటికొచ్చింది
కొత్త తరం బీజాన్ని మొక్కగా చేసే బాధ్యత పడింది
మన చేతిలో ఉండదని తెలిసినా పతంగాన్ని ఎగరేస్తాం!
ఎగిరితేనే దానికి అందం...అందరికీ ఆనందం
ఒకసారి అపశ్రుతి జరిగిందని అలసిపోలేము
నిరంతర ప్రయాణంలో అవిశ్రాంత ప్రయత్నాలే
ఇదే జీవన వైచిత్రి..మానవ ప్రవృత్తి!!
గాలిపటం ప్రయాణం కానేకాదు గాలివాటం
జీవనలోతుల్లో అన్వేషిస్తే ఓ మంచి పాఠం!

- వయ్యస్సారెస్
9000013367



నేనొక పందెం కోడిని!


నేనొక కోడిని!
పంతంతో చెలరేగే
పందెం కోడిని!
కాళ్లకు కత్తులతో
నెత్తిన ఎర్రఎర్రని తురాయితో
ఒకనాటి
పల్నాటి సీమను సైతం
యుద్ధరంగంగా మార్చిన
ప్రభుత్వాలనే కూల్చిన
పందెంకోడిని!
నేటి పోటీ ప్రపంచంలోనూ
కోట్లాది రూపాయల్ని కొల్లగొడుతూ
సరదాల సంసారాల్ని జూదాలపాలు జేస్తూ
సంప్రదాయుల పేరుతో
సాహసాలతో బరిలోకి దిగి
ప్రత్యర్థుల కోడిని
చిత్తుచిత్తుగా ఓడించాలని
సివంగిలా దూకే
చిత్రాల కోడిని!
పందెం కోడిని!
చివరకు సరదారాయుళ్ళ
జులాయీ జూదగాళ్ళ 'చికెన్ పకోడీని'!
అందుకే ఆలోచిస్తున్నా!
మరోవిధంగా మారాలని చూస్తున్నా!
పేదవాడి గడియారంగా పేరుమోసి
పెందలాడనే లేచి
''కొక్కోరోకో'' అంటూ కూసి
కోట్లాది జనాల్ని లేపి
పిడికెడు కడుపుకోసం
చిటికెడు గింజల్ని ఆరగించి
గుడిసె మీదనో
గుడిమీదనో వాలి
గొంతెత్తి గూస్తూ
చుట్టూ చూస్తూ
హాయిగా కాలం గడుపక
అనర్థంగా పందెం కోడిగా
మారడం దేనికి?
బరిలోకి దూకి బలికావడం దేనికి?''-
అన్న జ్ఞానోదయం కలుగుతోంది!
నా చిన్న మెదడు వెలుగుతోంది!
కావున కోడిపుంజుగా ఇంకాస్త
సత్తువ పుంజుకొని
కాళ్లకత్తులతో గింజుకొని
జూదగాళ్ళ చేతుల్నే చెండాడేస్త!
మా ప్రాణాలతో చెలగాటమాడుతూ
వినోదంగా వీక్షిస్తున్న
వాళ్ల కళ్లనే
వాడియైన ముక్కుతో పొడిచేస్త!
నా సత్తా చూపిస్తా!
మారిన నా మనోగతాన్ని
మానవ లోకానికి తెలియజేస్త!
నేనొక కోడిని!
కానిక పందెంకోడిని!
సంక్రాంతి భోగిమంటల వేడిని!
వరుస మారిన
పదును దేరిన వాడిని!
'కొక్కోరోకో' కోడిని?!

- డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

శత వసంతాల 'నిర్మలం'

సరిగ్గా వంద సంవత్సరాల క్రితం అంటే 1918 జనవరి 21న అజ్జరపు సావిత్రమ్మ, అజ్జరపు సూర్య నారాయణ దంపతులకు తూ.గో.జిల్లా కొత్తకోట తాలూకా దేవరపల్లి గ్రామంలో రామరాజులంకలో జన్మించిన అజ్జరపు వెంకటరావు ఈతరం పాఠకులకు తెలియకపోవచ్చును. కాని 'నిర్మలం' పేరుతో శ్రీరామ చరిత్ర, శ్రీకృష్ణచరిత్ర, గ్రంథాలను సరళమైన వచనం లో అందించి తెలుగు పాఠక లోకానికి గొప్ప మేలు చేసిన మేటి రచయిత.

''చదివింది అర్థశాస్త్రమైనా తెలుగు భాష పట్ల వారికి గల అభినివేశం వల్ల పై గ్రంథాలను విజయవంతంగా పూర్తిచేయగలుగుతారు. ఆయన చక్కటి వక్త. సామాజిక జీవనం పట్ల వ్యక్తి బాధ్యతల పట్ల లోతైన అవగాహన, నిర్దిష్టమైన అభిప్రాయాలు కలిగిన విశిష్ట వ్యక్తిత్వం కల మహామనీషి ఆయన.


అజ్జరపు వెంకటరావు

వెంకటరావు తొలుత భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లో రెవెన్యూ అధికారిగా ఉద్యోగబాధ్యతలు చేపట్టి, నిజాయితీకి చిరునామాగా నిలిచారు. కాని కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఆ ఉద్యోగానికి ఉద్వాసన పలికి రాజమండ్రిలోని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థలో సూపర్నెంటుగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

ఆరోజుల్లోనే బూర్గుంపాడు తాలూకాలోని పేరంటపల్లి గ్రామంలో 'శ్రీరామకృష్ణమునికాటం' అనే పేరుతో ఆశ్రమాన్ని స్థాపించి అక్కడి గిరిజన తెగలకు సేవచేస్తున్న శ్రీబాలానంద స్వామితో పరిచయం ఏర్పడింది. అది నిర్మలంగారి జీవితాన్నే మలుపుతిప్పింది. వారి మార్గదర్శకత్వంలో అనేక సాంఘిక సేవాకార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ తరపున గిరిజన బాలురకు వసతి సౌకర్యాలు కల్పించి విద్యాబుద్ధులు నేర్పించారు.

1907లో స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసి, 1991లో మరణించేదాకా శేష జీవితమంతా రచనా వ్యాసంగానికే వినియోగించిన కర్మయోగి వెంకటరావు. బాలానంద స్వామి జీవిత విశేషాలు, స్వామి వారి ఆంగ్ల రచనలకు తెలుగు అనువాదాలు, అనేకమైన భక్తిగీతాలు, శ్రీరామచరిత్ర, శ్రీకృష్ణ చరిత, శ్రీరామకృష్ణోపనిషత్తు, భగవద్గీత, సుందరకాండ వంటి గ్రంథాలు రాశారు. సమకాలికులైన లక్ష్మణ యతీంద్రులు, మల్లంపల్లి దశరథయ్య వంటి ప్రముఖుల ప్రశంసలకు పాత్రులైనారు.

ఒక వ్యక్తి తన జీవితకాలంలో రామాయణం మూడు భాగాలుగా భారతం భాగవతాల నుంచి ఏర్చి గూర్చిన శ్రీకృష్ణచరిత్ర తొమ్మిది సంపుటాలుగా రాయడం అరుదైన విషయం. రెండు విభిన్న వ్యక్తిత్వాలకు, జీవన విధానాలకు ప్రతీకలైన ఈ గ్రంథాలను సరళ సుందరంగా పాఠకులకందించి అబ్బురపరిచిన అజ్జరపు వెంకటరావును ఆయన శతజయంతి వేళ సంస్మరించడం, నివాళులర్పించడం, మన కనీసం ధర్మం. మనకు తెలిసిన కథలే అయినా సరళసుందరంగా, పాఠకుల చేత చదివించే విధంగా, ఉత్కంఠ భరితంగా, కొన్ని చోట్ల ఆర్ద్రంగా రచించి, ఆశ్చర్యం కలిగిస్తారు వెంకటరావు. శ్రీకృష్ణ చరిత్ర తొమ్మిది భాగాల్లో ఏడుభాగాలు రచయిత జీవితకాలంలోనే వెలువడినా శ్రీరామచరిత్ర మూడుభాగాలు అముద్రితంగానే ఉండిపోయాయి. రచయిత మరణానంతరం ఇంతకాలానికి వారి కుటుంబ సభ్యులు కలిసి వారి అముద్రిత రచనలను ముద్రించే బృహత్ ప్రయత్నానికి పూనుకోవడం ప్రశంసనీయం, హర్షణీయం.

(శతజయంతి ఉత్సవాల సందర్భంగా)

- తాళ్లపల్లి మురళీధర గౌడు,
9393176558

త్యాగ భరిణె

అడవి బిడ్డల అమరత్వం
జంపన్న ప్రాణత్యాగం వాగై ప్రవహించింది
తల్లీబిడ్డల త్యాగరాశి
వనవాసుల పాలిట ఆశాజ్యోతిగ నిలిచి
చిలకల గుట్టన విడిది చేసింది
కుంకుమ భరిణెగ!!
రెండేళ్ళ కోమాకు
మాఘపున్నమికి
వనదేవతై గద్దె చేరగ



దారులన్నీ ''మేడారం'' తర్లిపోతాయి.
కోరి మొక్కిన ''బెల్లంమొక్కులు''
బంగారమై భక్తులనెత్తి నెక్కగ
తులాదండం నిలువెత్తుగ కూస్తుంది.
కోవెలలేని కోయదేవతలైతేనేమి?!
విగ్రహాలు అభిషేకాలు లేని
అచ్చమైన ఆదివాసీ అర్చనలతో
వనారణ్యాన్ని జనారణ్యం చేస్తాయి.
ఎడ్లబండి నుండి హెలికాప్టరై
ఎగురుతూ...!!
''త్యాగశక్తి''ని ప్రపంచానికి
చాటుతుంది
మన జన జాతర! మేడారం జాతర!!

- అమ్మిన శ్రీనివాసరాజు
7729883223

సాహిత్య వార్తలు



నేడు డా॥గోపీకి జైనీ పురస్కారం

జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి లక్ష్మీనారాయణ జైనీ జాతీయ సాహితీ పురస్కారం-2018ని తొలిసారిగా సుప్రసిద్ధ కవి డా॥ఎన్.గోపి రచించిన జలగీతం కావ్యానికి ఇస్తున్నాం. ఈ కార్యక్రమం నేటి సాయంత్రం ఆరుగంటలకు హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరుగనుంది. ఈ పురస్కారానికిగాను లక్షరూపాయల నగదుతో కవికి సత్కారం ఉంటుంది.

బిక్కి కృష్ణ
జాతీయ ప్రధాన కార్యదర్శి

ప్రభాకర్ జైని
జాతీయ చైర్మన్

జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ హైదరాబాద్

నేను..మీ అంజయ్య పుస్తకావిష్కరణ

అంబట్లరవి రచించిన రజకరత్న డాక్టర్ యం. అంజయ్య జీవిత చరిత్ర' నేను...మీ అంజయ్య' పుస్తకావిష్కరణ సభ 31వతేదీన ఉదయం 10గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్ నందు జరుగుతుంది. ఈ సభకు కె.వి.రమణాచారి అధ్యక్షత వహిస్తారు. గౌరవ అతిథిగా విశ్వయోగి విశ్వంజీ మహరాజ్, ముఖ్యఅతిథులుగా కె.స్వామిగౌడ్, ఎస్.మధుసూదనాచారి, మండలిబుద్ధప్రసాద్, నాయిని నర్సింహారెడ్డి, మరెందరో ప్రముఖులు పాల్గొంటారు.

- హైదరాబాద్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రజకాభివృద్ధి సంస్థలు
9703600047, 9849326711

విద్యుత్ వ్యవస్థల పటిష్టతకు

రూ.16,669 కోట్లు



- మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్‌ల ఆధునికీకరణకు నిధుల వెచ్చింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థల పటిష్టతకు కేంద్రప్రభుత్వం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ16669కోట్లు మంజూరు చేసింది. విద్యుత్ సరఫరా, పంపిణీ రంగాల్లో ఈ నిధులను వినియోగించనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటివరకూ 5658 కోట్లు విడుదలయ్యాయి. దీన దయాల్ ఉద్యోగ గ్రామజ్యోతి యోజన పథకం కింద ఈ నిధులు కేటాయించారు. సమగ్ర విద్యుత్ అభివృద్ధి పథకం (ఐపీడీఎస్) కింద రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలను ఆధునీకరించనున్నారు. కొత్తగా పంపిణీ వ్యవస్థలకోసం 67 పట్టణాల్లో 673 కోట్లు ఖర్చు చేయనున్నారు. 30 పట్టణాల్లో ఐటీ ఆధారిత ప్రాజెక్టుల కోసం 24కోట్లు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఐపీడీఎస్ పథకం అమలుకు రూ. 109 కోట్లు కేటాయించింది. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఎన్ఐటీలో భాగంగా 14 సర్కిల్స్‌లో రూ.655 కోట్లతో వివిధ పనులు చేపట్టనున్నాయి. ఆర్ఏపీడీఆర్పీ పథకం కింద 37 పట్టణాల్లో రూ.147 కోట్లతో విద్యుత్ పంపిణీ వ్యవస్థలను ఆధునీకరించనున్నారు.

స్కాడా పథకం కింద మరో రెండు పట్టణాల్లో ఈ పనులు చేపట్టనున్నారు. ఆర్ఏపడీఆర్పీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.414 కోట్లను గ్రాంటుగా అందచేసింది. దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన కింద ఎంపిక చేసిన పది ప్రాజెక్టుల్లో రూ.462కోట్లు ఖర్చు చేయనుండగా ఇందులో వ్యవస్థల పటిష్టతకు రూ.131.20 కోట్లు, హౌస్ హోల్డ్సకు రూ.308.27కోట్లు, మీటరింగ్‌కు రూ.6.16కోట్లు, ఎస్ఏజీవై కింద రూ.15.36కోట్లు, పీఎంఏ కింద రూ. 2.30 కోట్లు కేటాయించినట్టు అధికారులు వివరించారు.

ఇంకుడు గుంతలు తప్పనిసరి



- 300 చదరపు మీటర్లు స్థలం దాటితే తవ్వాల్సిందే
- భూగర్భ జలాలు కాపాడేందుకు భవనాల వారీగా మున్సిపల్ శాఖ తనిఖీలు
- గ్రేటర్‌లో 100 బృందాల ఏర్పాటు
- 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జలం-జీవం కార్యక్రమం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇక పట్టణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాల (వాటర్ హార్వెస్టింగ్ పిట్స్)ను విధిగా చేపట్టాల్సి ఉంటుంది. దీని కోసం మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తోంది. పట్టణాల్లో రోజురోజుకు పెరిగిపోతున్న జనాభాతో పాటు పెద్దఎత్తున భవనాలు, వాణిజ్య సముదాయాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో భూగర్భ జలాల వినియోగం కూడా అంతకంతకు పెరిగిపోతోంది. దీంతో భవిష్యత్తులో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా.... భూమిపై పడిన ప్రతివర్షపు బొట్టును సద్వినియోగం చేసుకునేందుకుగానూ యుద్ధ ప్రాతిపదికన ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఇటీవలే రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సంబంధిత అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.

రానున్న వర్షకాలంలోగా ఈ నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఇక జీహెచ్ఎంసీ పరిధిలో అయితే ప్రతి 300 చదరపు మీటర్లలో ఇళ్ళ నిర్మాణాలను చేపట్టే భవన యజమానులు విధిగా ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టాలన్న నిబంధనలు కూడా ఉన్నాయి. అయితే ఈ నిబంధనలు సక్రమంగా అమలు జరగడంలేదు. భవన నిర్మాణాల సమయంలో వాటిని ఏర్పాటు చేస్తామని చెప్పి.... తదనంతరం ఇంకుడు గుంతలను పలువురు ఇళ్ళ యజమానులు నిర్మించడం లేదు. దీంతో ఇక ఈ నిబంధనను విధిగా అమలు చేయాలని మున్సిపల్ శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా 2000 సంవత్సరం తరువాత నిర్మించిన (300 చదరపు మీటర్లు) అన్ని భవనాలు, ప్లాట్లను గుర్తించేందుకుగానూ గ్రేటర్ పరిధిలో వంద బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్క బృందంలో టౌన్‌ప్లానింగ్ విభాగం సెక్షన్ ఆఫీసర్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్, ఏసీపీ, సీపీలు, ఒక ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ సభ్యులుగా ఉంటారు.

ఈ బృందాలు ప్రతి వీధిలోనూ పర్యటిస్తూ 2000ల సంవత్సరం తరువాత మూడు వందల చదరపు మీటర్లలో నిర్మించిన కట్టడాలపై సమగ్ర సర్వే చేస్తుంది. ఈ సర్వేను ఏప్రిల్ 15వ తేదీలోగా పూర్తి చేస్తారు. సదరు భవనాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారా? లేదా? అన్న విషయాలను కూడా ప్రత్యేక బృందాలు తెలుసుకుంటాయి. వీటిని ఏర్పాటు చేయని యజమానులు విధిగా నిర్మించాలని నోటీసులు కూడా జారీ చేస్తారు. వీటిని అందుకున్న వారంతా విధంగా ఏప్రిల్, మే మాసంలోగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని పార్కులు, ఖాళీ స్థలాలు, ప్లేగ్రౌండ్‌లు, ఇతర భవనాల్లోనూ ఇంకుడు గుంతల నిర్మాణాలను ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి ప్రారంభించి జూన్ మాసంలోగా వంద శాతం పూర్తి చేయనున్నారు. కాగా ఇప్పటికే నగరంలోని పలు కాలనీ పార్కులు, ప్లేగ్రౌండ్లలో తొలి దశలో మూడువందల ఇంకుడు గుంతలను తవ్వే ప్రక్రియను చేపట్టారు.

ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి జలం-జీవం కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించాలని మున్సిపల్ శాఖ ఇప్పటికే నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఒకటవ తేదీన గ్రేటర్ పరిధిలో పెద్దఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమాలను జీహెచ్ఎంసీ చేపట్టేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. ఈ నిబంధనలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసి పెద్దఎత్తున భూగర్భ జలాలను సంరక్షించనున్నారని తెలుస్తోంది.

భవిష్యత్ కాంగ్రెస్‌దే!

- టీఆర్ఎస్ సర్కార్‌కు పతనం తప్పదు: ఉత్తమ్‌కుమార్



వరంగల్ రూరల్, ప్రభన్యూస్ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అభివృద్ధి పేరుతో వేలాది కోట్ల ప్రజాధనాన్ని వృధా చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పక తప్పదని, అందుకు ఫలితంగా రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం ఖాయమని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం గీసుకొండ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కుటుంబపాలన కొనసాగుతుందని, ప్రజా సమస్యలను పట్టించుకోని ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం వారి స్వలాభమే లక్ష్యంగా ఎంచుకున్నారు. నూతన పథకాల పేరుతో వేలాది కోట్లు పోగుచేసుకుంటున్న కేసీఆర్ పాలనకు ప్రజలు బుద్దిచెప్పే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కాంట్రాక్టర్ పేరుతో అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తు అడ్డదారిన బిల్లులను తీసుకుంటున్నాడని ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేయటంతో పాటు ప్రతినెల మూడువేల భృతి చెల్లిస్తామని ఉత్తమ్ హామీ ఇచ్చారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రఘు ఆధ్వర్యంలో 200 మందితో బైక్ ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 2,000 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, నర్సంపేట నియోజక వర్గ శాసన సభ్యులు దొంతి మాధవ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, ములుగు మాజీ ఎంఎల్ఏ సీతక్క, నర్సంపేట నియోజక వర్గ కార్యదర్శి తక్కెలపెల్లి రవీందర్ రావు, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు కర్నగంటి రఘు, ఆరెపల్లి సర్పంచ్ శ్రీనివాస్, నాయినీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో రాణించాలి

- హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పేపర్ బాయ్‌గా పనిచేసిన అబ్దుల్ కలాం రాష్ట్రపతి అయ్యారు..చాయ్ వాలాగా పనిచేసిన నరేంద్ర మోడి భారత ప్రధాని స్థాయికి ఎదిగారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే అని చాటిన అటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నరసింహారెడ్డి విద్యార్థులకు ఉద్భోధించారు. ఆదివారం రెడ్డి జనసంఘ్ జాతీయ కార్యాలయంలో విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో హోంమంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ పట్టుదల ఉంటే ఏస్థాయికైనా ఎదిగేందుకు అవకాశాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. రెడ్డి సామాజికవర్గంలో ఎంతో మంది ప్రతిభ ఉండి ఆర్థిక స్థోమత లేక చదువుకోలేక పోతున్నారని, అటువంటి వారిని ఆదుకుంటామన్నారు. ప్రపంచ స్థాయిలో మంచి విశ్వవిద్యాలయాన్ని తయారు చేస్తామన్నారు. పేదింటి అమ్మాయిల వివాహాలకు కూడా సాయం చేద్దామన్నారు. వచ్చే ఏడాది ఉపకార వేతనాలు మరింతమందికి అందించేందుకు కృషి చేద్దామని మంత్రి పేర్కొన్నారు.

ఎంపి మల్లారెడ్డి మాట్లాడుతూ రెడ్డి హాస్టల్ నిర్మించేందుకు మందుకు వస్తే తాను ఒక ఎకరా స్థలాన్ని ఉచితంగా అందచేస్తానని పేర్కొన్నారు. రెడ్డిజనసంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక వనరులు, సరైన ప్రోత్సాహం లేక ఎంతో మంది రెడ్డి సామాజిక వర్గంలోని విద్యార్థులు పైచదువులు కొనసాగించలేక పోతున్నారన్నారు. రెడ్డిజన సంఘ్ ఎంతోమంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందచేసి ప్రోత్సహిస్తోందన్నారు. రెడ్డి భవన్‌కు ప్రభుత్వం నుంచి ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయింపచేసేందుకు హోంమంత్రి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇంజనీరింగ్, మెడిసిన్‌తోపాటు ఇతర కోర్సులకు చెందిన 307మంది విద్యార్థులకు రూ.26.48 లక్షల రూపాయలను ఉపకార వేతనాల కింద పంపిణీ చేశారు. రెడ్డి జనసంఘంకు విరాళాలు అందచేసిన మేడ్చెల్ ఎమ్మెల్యే మలిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మాజీమంత్రి కమతం రామిరెడ్డి, వంగాల సంజీవ రెడ్డి, కె.వినీతారెడ్డి, పి.కేశవరెడ్డి, కె.మధుసూధన్ రెడ్డి, మర్రి కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, ఉప్పునూతల ప్రవీణ్ రెడ్డి, ఇ.రత్నాకర్ రెడ్డి తదితర దాతలను ఘనంగా సత్కరించారు. ప్రో.కంచెర్ల దశరథ్ రెడ్డి, తీగలబాలిరెడ్డి, సుకన్యారెడ్డి, స్వరూపారెడ్డి, వీరారెడ్డి తదితర రెడ్డి నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రవాణా సేవలు ఇక డిజిటల్

- ఆర్టీఏ ఎం-వాలెట్‌కు మరిన్ని హంగులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రవాణాశాఖ ప్రవేశపెట్టిన ఎం- వాలెట్‌లో సరికొత్త మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. మరిన్ని సేవలు ఎం-వాలెట్ ద్వారా వాహనదారులకు అందుబాటులోకి రాబోతున్నాయి. వాహనదారులు రవాణా కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండా అన్ని సేవలను ఆన్‌లైన్లో అందించాలనే లక్ష్యం మేరకు ఎం-వాలెట్‌ను ఆధునీకరిస్తున్నారు. ఇప్పటికే అన్ని సేవలను ఆన్‌లైన్‌లో అందచేస్తున్నారు. ఇక మీదట మొబైల్ యాప్ ద్వారా ఆర్టీఏ సేవలు అందించబోతున్నారు. ఈ మేరకు ఎం- వాలెట్‌లో మార్పులు చేర్పులు జరుగుతున్నాయి. ఇక మీదట వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సుకు దరఖాస్తు చేసుకోవడం, ఆన్‌లైన్ స్లాట్‌బుకింగ్ కోసం ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లనవసరం ఉండదు.

మార్చి నుండి ఆధునీకరించబడిన ఎం- వాలెట్ యాప్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పెనాల్టీ పాయింట్స్, ఈ-చలానా వివరాలను ఎం-వాలెట్‌లో ఇప్పటికే అందుబాటులోకి తెచ్చారు. వాహనదారులకు అవసరమైన అన్ని సేవలను ఎం-వాలెట్ ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ ట్రాన్స్ పోర్టు కమిషనర్ సి. రమేష్ తెలిపారు. వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సుల పునరుద్ధరణ, కొత్త లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకొనేందుకు స్లాట్ బుకింగ్‌లు కూడా ఎం వాలెట్ ద్వారా అందుబాటులోకి తేబోతున్నామని వివరించారు. చేతిలో స్మార్టు ఫోన్ ఉంటే ఆర్టీఏ సేవలు పొందడం అత్యంత సులభం కాగలదన్నారు. ఇక మీదట అన్ని సేవలకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం ఎస్ఎంఎస్ ద్వారా దరఖాస్తుదారులకు తెలియచేయడం జరుగుతుందన్నారు.

ఇప్పటి వరకు 20 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. 2016 మార్చి 30న ఎం-వాలెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రతి రోజు సగటున 10,000ల మంది వాహనదారులు ఎం - వాలెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. హైదరాబాద్ గ్రేటర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని వాహనదారులే అత్యధికంగా ఎం - వాలెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఎం - వాలెట్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న సుమారు 20 లక్షలకు పైగా వాహనదారులు 21.47 వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను, 15.35 లక్షల లైసెన్సులను భద్రపర్చుకున్నారు. వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, లైసెన్స్‌ల డిజిటల్ కాపీలను మొబైల్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే వెసులుబాటు ఉండటంతో ఎం - వాలెట్‌లో నిక్షిప్త చేసుకుంటున్నారు. దీంతో వాహనదారులు ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్సు, వాహన బీమా ధృవీకరణ పత్రాలను వెంటబెట్టుకొని తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. వాహన తనిఖీ అధికారులకు ఎం - వాలెట్‌లో నిక్షిప్తం చేసుకున్న డిజిటల్ ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్సు, వాహన బీమా ధృవీకరణ పత్రాలను చూపిస్తే సరిపోతుంది. రాష్ట్రంలో వివిధ సంస్థలు ప్రవేశపెట్టిన యాప్‌లలో అత్యధికంగా డౌన్‌లోడ్ కాబడుతుంది ఎం - వాలెట్ యాప్ మాత్ర మేనని గూగుల్ రేటింగ్ వెల్లడిస్తుంది. ఇప్పటికే ఎం - వాలెట్ అనేక అవార్డులను అందుకుంది. నీతిఆయోగ్ కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లలో ఎం - వాలెట్ అత్యుత్తమమైందని అభినందించింది. తెలంగాణలోని అన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయి.

ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి

- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వెనుకబడిన తరగతుల వారికి చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించడం కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. నేటి నుంచి ప్రారంభం అవుతున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు అధ్యక్షతన అఖిలపక్ష సమావేశాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో బీసీలకు ప్రత్యేకంగా రూ. 50వేల కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించే బిల్లుకు ఈ సమావేశాల్లోనే ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బిజెపి, కమ్యూనిస్టు పార్టీల తోపాటు, ప్రాంతీయ పార్టీలు కూడా జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించే అంశంపై స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇదే అంశంపై రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టడం కోసం 3న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశామన్నారు. రెండో వారంలో బీసీ ప్రజాప్రతినిధులతో చలో ఢిల్లీ కార్యక్రమాన్నిఏర్పాటు చేయనున్నట్టు జాజుల తెలిపారు.

శ్రీవారి ఆలయంలో అరుణ పారాయణం

తిరుమల, ప్రభ న్యూస్: శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉదయం అరుణ పారాయణం ఘనంగా జరిగింది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపును అందుకున్న టీటీడీ ఈ మేరకు విమాన ప్రాకారంలో విమాన వేంకటేశ్వర స్వామి సమక్షంలో సమస్త జీవకోటికి ప్రాణాధారమైన సూర్యభగవానుడికి కృతజ్ఞతలు తెలిపేలా అరుణ పారాయణం చేపట్టింది. అరుణ పాయణం ద్వారా యజ్ఞ ఫలం లభిస్తుందని కృష్ణయజుర్వేదం ద్వారా తెలుస్తోంది.

క్షణికావేశంలోనే శ్రీనివాస్ హత్య

- నల్గొండ ఎస్పీ శ్రీనివాసరావు ప్రకటన



నల్గొండ/హైదరాబాద్, ప్రభ న్యూస్‌బ్యూరో : సంచలనం కలిగించిన నల్గొండ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. మిర్చి బండి దగ్గర ఉల్లిగడ్డ విషయంలో మొదలైన వివాదం చిలికిచిలికి గాలివానగా మారి హత్యకు దారితీసిందని ఎస్పి డి.వి.శ్రీనివాసరావు చెప్పారు. శ్రీనివాస్ హత్యలో ఎటువంటి రాజకీయ కోణం లేదని, కేవలం క్షణికావేశంలోనే జరిగిన ఘర్షణలో అతని అనుచరులే బండరాయితో తలపై మోది హత్య చేశారని వివరించారు. ఈ హత్యలో పదకొండు మంది పాల్గొన్నారని, వీరిలో ఎనిమిది మందిని అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. హత్యకేసును ఛేదించేందుకు ఆరు టీంలను ఏర్పాటు చేసి అన్ని కోణాల్లో పరిశోధనలు చేశామన్నారు. హత్య వివరాలను జిల్లా ఎస్పి మీడియాకు వివరించారు.

పట్టణంలోని ఆల్ఫా జూనియర్ కళాశాల సమీపంలో గల యాదయ్య మిర్చిబండి వద్ద 24వతేదీ బండి యజమాని, రాంబాబుకు మధ్య స్వల్ప వివాదం జరిగింది. దీంతో యాదయ్య విషయాన్ని కౌన్సిలర్ కుమారుడు మెరుగు గోపినాథ్‌కు తెలియజేయడంతో అక్కడికి వచ్చిన గోపి రాంబాబుకు ఫోన్‌చేసి మిర్చిబండి వద్దకు రావాలని కోరగా రాంబాబు, శరత్ అక్కడకు చేరుకున్నారు. అదే సమయంలో మాంద్ర మల్లేష్, చక్రి కూడా అక్కడకు వచ్చారు. అక్కడ గోపి, రాంబాబు మధ్య వాగ్వాదం జరిగింది. రాంబాబు గోపిని తిట్టి చేయి చేసుకున్నాడు. బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను కూడా రాంబాబు తీవ్ర పదజాలంతో దూషించారు. ఆ తర్వాత గోపి విషయాన్ని చైర్‌పర్సన్ భర్త శ్రీనివాస్‌కు వివరించారు. శ్రీనివాస్ ఆయన అనుచరుడు మోహన్‌తో కలిసి గాంధీనగర్ సెంటర్‌కు చేరుకున్నారు. మెరుగు గోపిని శ్రీనివాస్ గట్టిగా నిలదీయడంతో వారి మధ్య మాటా మాటా పెరిగి రాంబాబుపై శ్రీనివాస్ చేయి చేసుకున్నాడు. ఇరువురు నెట్టుకోవడంతో చక్రి అడ్డురాగా ముగ్గురు పక్కనే ఉన్న డ్రైనేజీలో పడిపోయారు. మాంద్ర మల్లేష్ రాయితో శ్రీనివాస్ తలపై కొట్టాడు. మీ అంతు చూస్తానంటూ శ్రీనివాస్ బెదిరించడంతో భయపడిన మల్లేష్, రాంబాబు శ్రీనివాస్ తలపై బండరాళ్ళు వేయడంతో చనిపోయాడని ఎస్పి వెల్లడించారు. ఈ కేసులో నిందితులు చింతకుంట్ల రాంబాబు, మాంద్ర మల్లేష్, అల్వాల శరత్‌రాజు, బాషిపాక దుర్గయ్య, కత్తుల కళ్యాణ్ స్వామాట్ అలియాస్ చక్రి, దమునూరి సతీష్, మాంద్ర మహేష్, మిట్టపల్లి సాయి, మెరుగు గోపి, మాతంగి మోహన్, ప్రసాద్‌గా ఎస్పి వివరించారు. వీరిలో 8 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. మాంద్ర మహేష్, మిట్టపల్లి సాయి, ప్రసాద్‌లు పరారీలో ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ఎస్పితో పాటు అడిషనల్ ఎస్పి పద్మనాభరెడ్డి, తదితర పోలీసు అధికారులు ఉన్నారు.

రాష్ట్రంలో కేసీఆర్ కిరాతక పాలన: ఉత్తమ్

రాష్ట్రంలో కేసీఆర్ పాలన కిరాతకంగా వ్యవహరిస్తుందని, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ భర్త శ్రీనివాస్‌ను ప్రభుత్వమే హత్య చేయించిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆదివారం లక్ష్మీ కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ కుటుంబ సభ్యులను సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డితో పాటు జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి పరామర్శించి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీసీ ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించడంతో పాటు బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

ఈ పాపం కెసిఆర్‌కు తగులుతుంది: విహెచ్

టిఆర్ఎస్‌లో చేరేందుకు నిరాకరించినందువల్లే కాంగ్రెస్ నేత బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను అధికార పార్టీ హత్య చేయించిందని వి. హన్మంతరావు ఆరోపించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ, శ్రీనివాస్‌ను హత్య చేసిన పాపం కెసిఆర్ కుటుంబాన్ని వెంటాడటం ఖాయమన్నారు.

ఆక్టోపస్ కానిస్టేబుల్ మృతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నగర శివార్లలోని ఆదిబట్ల ప్రాంతంలో మాక్ డ్రిల్‌లో గాయపడ్డ ఆక్టోపస్ కానిస్టేబుల్ రమావత్ లఘుపతి నాయక్ అలియాస్ లక్పతి మృతి చెందాడు. ఈ నెల 23 వ తేదీన ఆదిబట్ల ప్రాంతంలో ఆక్టోపస్ పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సు, కారు ఢీకొని ఆయిదుగురు సిబ్బంది గాయపడ్డ విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడ్డ వారందరినీ ఎల్‌బి నగర్‌లోని కామినేని ఆస్పత్రిలో చేర్పించగా, వారిలో లక్పతి అనే కానిస్టేబుల్ ఆదివారం మృతి చెందాడు. ప్రస్తుతం ఆస్పత్రిలో చెన్నకేశవ్ చికిత్స పొందుతున్నాడు. మిగతా ముగ్గురిని డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. మృతుడిది సూర్యాపేట జిల్లా పెద్దవూర మండలం ఎనిమిడతాండ అని, అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారని సమాచారం.

మరణించిన వ్యక్తికి చికిత్స!?

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- ఫర్నిచర్ ధ్వంసం.. రంగంలోకి పోలీసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రైవేటు ఆస్పత్రులు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నాయి. ఠాగూర్ సినిమాలో మాదిరిగా చనిపోయిన వ్యక్తికి ట్రీట్‌మెంట్ చేశారంటూ ఓ ఆస్పత్రి ఎదుట రోగి బంధువులు ఆందోళనకు దిగారు. 10 రోజుల క్రితం నల్లగొండ జిల్లా ఇడుగంటిపాలెంకు చెందిన రాజు క్రికెట్ ఆడుతున్న సందర్భంలో తలకు గాయమమై అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని మలక్‌పేటలోని యశోద ఆస్పత్రికి తరలించారు. రాజుకు బ్రెయిన్ సర్జరీ చేసిన వైద్యులు 10 రోజులుగా అతడిని ఐసీయూలో ఉంచారు. దీనికిగాను రూ. 7 లక్షల బిల్లును వేశారు. రాజు కుటుంబ సభ్యులు శనివారం రాత్రి 7 లక్షలను చెల్లించారు. బిల్లు కట్టిన 10 నిమిషాలకి రాజు చనిపోయాడంటూ ఆస్పత్రి సిబ్బంది చావు కబురును చల్లగా చెప్పారు. పది రోజులుగా చికిత్స జరుగుతున్నట్టుగా చెప్పిన వైద్యులు బిల్లు కట్టగానే రాజు చనిపోయాడని చెప్పడంతో ఆగ్రహంతో ఊగిపోయిన మృతుడి కుటుంబ సభ్యులు ఆస్పత్రి అద్దాలు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. అనంతరం ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఆస్ప త్రిపై చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పోలీసులు యశోద ఆస్పత్రికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. చివరకు పోలీసులు ఆస్పత్రిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

దేశంలో వ్యక్తిపూజలు పెరిగాయి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్



అమరావతి, ఆంధ్రప్రభ: దేశంలో వ్యక్తి పూజలు, ఆరాధనలు చేయరాదని రాజ్యాంగం చెబుతుందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ చెప్పారు. విజయవాడలోని సిద్ధార్థా కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం కంతమనేని రవీంద్ర రావు తృతీయ స్మారకోపన్యా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా 'రాజ్యాంగ ధర్మాసనం, పౌర సమాజం' అనే అంశంపై ఆయన కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగానికి విరుద్ధంగా ఈరోజున వ్యక్తి పూజలు, ఆరాధనలు పెరిగిపోవడం దురదృష్టకరమన్నారు. మెజార్టీ ప్రజల అభిప్రాయమే నిజం, న్యాయం అని ఎల్లవేళలా నమ్మలేమన్నారు. కులం, మతం, ప్రాంతాల పేరిట మనుషులను విభజించడం సరి కాదన్నారు. ఎన్నికల్లో డబ్బు కీలక అంశం కావడం, వారసత్వ రాజకీయాలు, అవినీతి పెరిగిపోయిన నేపథ్యంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. ఈనేపథ్యంలోనే తనను ఒక రాజకీయ పార్టీకి చెందిన వాడిగా కొన్ని మాధ్యమాలు ప్రసారం చేయడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం ప్రకటించారు. తాను పదవీ విరమణ తరువాత ఏప్రభుత్వం దగ్గరికీ వెళ్లి ఏ పదవిని కోరబోనని స్పష్టం చేశారు.

చెట్టును ఢీకొన్న కారు...టెకీల మృతి



చెట్టుకు ఢీకొన్న ఆల్టోకారు. ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

చేవెళ్ల, ప్రభ న్యూస్ : రంగారెడ్డి జిల్లా, చేవెళ్లలో ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్ -బీజాపూర్ జాతీయ రహదారిపై చేవెళ్ల మండలం దాటిన తర్వాత వికారాబాద్ వెళ్లే రోడ్డులో ఈ ఘటన జరిగింది. హైదరాబాద్ నుంచి వికారాబాద్‌లోని అనంతగిరికి ఆల్టో కారులో వెళ్తుండగా కారు అదుపు తప్పి రోడ్డు పక్కన గల మర్రిచెట్టును ఢీకొట్టింది. సీఐ గురువయ్యగౌడ్ వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన కాసేపోగు సుసన్న ప్రవీన్‌కుమార్ (28), మహబూబ్‌నగర్‌కు చెందిన బరిగెల్ల డేవిడ్ (29), నగరంలోని పేట్‌బషీర్‌బాగ్‌కు చెందిన అరుణ్‌గౌండ అర్జున్‌కుమార్ (26), కరీంనగర్ జిల్లా, గుర్మగూడకు చెందిన గుండ్ర శ్రవణ్ (27) హైదరాబాద్ నుంచి వికారాబాద్‌కు ఆల్టో కారు (ఏపీ10ఏక్యూ5922)లో వెళ్తున్నారు. కారు అతివేగంగా నడిపి చేవెళ్ల మండలం మిర్జగూడ స్టేజీ సమీపంలో రోడ్డు ప్రక్కన చెట్టుకు ఢీకొట్టుకున్నారు. ప్రమాదం దాటికి కారు నుజ్జునుజ్జైంది. కారులో ప్రయాణిస్తున్న ప్రవీన్, డేవిడ్, అర్జున్‌లు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా శ్రవణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సీఐ గురువయ్యగౌడ్ పంచనామ నిర్వహించారు. శ్రవణ్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు.

ప్రముఖుల భద్రతపై సమీక్ష

- నల్గొండ ఘటనతో పోలీసులు అప్రమత్తం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ప్రముఖులకు కల్పిస్తున్న భద్రత విషయంలో పునఃసమీక్షించుకోవాలని పోలీసు శాఖ భావిస్తోంది. దాదాపు నాలుగేళ్ళ తర్వాత ఎవరికి ఏ మేరకు భద్రత కల్పించాలన్న అంశంపై క్షుణ్ణంగా పరిశీలించి భద్రతను కల్పించే అంశంపై నిర్ణయం తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. తాజాగా నల్గొండ మునిసిపల్ చైర్‌పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యానంతరం పోలీసు శాఖపైనా, ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలపైనా వెల్లువెత్తుతున్న ఆరోపణలను సీరియస్‌గా తీసుకుంటున్న అధికారులు కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. ఇదే సమయంలో భద్రత విషయంలో వెల్లువెత్తుతున్న విమర్శలపై కూడా దృష్టికేంద్రీకరించారు. రాష్ట్రంలో ఎంత మందికి భద్రత కల్పించారు? ఇందులో ఎంత మందికి భద్రత ఇవ్వాల్సి ఉంది. కొత్తగా ఎవరికైనా భద్రత కల్పించాల్సిన అవసరం ఉందా? ఉంటే కారణాలేమిటి? అనే అంశాలను పరిశీలించాలని నిర్ణయించారు.


సాధారణ భద్రత, భద్రత, వై కేటగిరి, జడ్ కేటగిరిలుగా సెక్యూరిటీని కల్పిస్తున్నారు. గతంలో మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డితో సహా కొంత మందికి భద్రత తగ్గించాలన్న సిఫార్సు మేరకు కొంత మంది సిబ్బందిని కుదించారు. ఆ తర్వాత చాలా మంది భద్రత కావాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. అయితే సిబ్బంది కొరత తదితర కారణాలతో వాటన్నింటినీ పక్కకు పెట్టిన అధికారులు తాజా పరిణామంతో తిరిగి పరిశీలించేందుకు సన్నద్ధం అవుతున్నారు. నల్గొండలో దారుణ హత్యకు గురైన శ్రీనివాస్ తనకు భద్రత కల్పించాలని కొంత కాలంగా పోలీసు శాఖను కోరినా ఫలితం లేకపోయిందని, ఫలితంగా ఆయన హత్యకు గురయ్యాడని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. శ్రీనివాస్ మాదిరిగా ఎంత మంది భద్రత కోరుతూ దరఖాస్తులిచ్చారు. జిల్లాల వారిగా వివరాలను పంపాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ నేతలు చాలామంది గతంలో మాదిరిగా గన్‌మన్‌లను కేటాయించాలని కోరుతున్నారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నేతల భద్రతకు ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. భద్రత విషయంలో ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు.

మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలలోని నేతల విషయంలోనూ కొన్ని జాగ్రత్తలు తీసుకోనున్నారు. ఖమ్మం తదితర జిల్లాలలో మావోయిస్టుల కదలికల తరుణంలో ఏజన్సీ ప్రాంతాలలో బందోబస్తును పటిష్టం చేసిన అధికారులు కొంత మంది నేతలకు సూచనలను కూడా జారీ చేశా రు. ముందస్తు సమాచారం లేకుండా మారుమూల ప్రాంతా లకు వెళ్ళొద్దని, అపరిచితుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచనలు జారీ చేసిన అధికారులు అవసరమైతే బందోబస్తును పెంచుతామని చెప్పారు.




నేడు బీఎస్ఈ మాక్ కమాడిటి డెరివేటివ్ ట్రేడింగ్

న్యూఢిల్లీ: బీఎస్ఈ సోమవారం నాడు కమాడిటి, డెరివేటివ్ సెగ్మెంట్‌లో మాక్ ట్రేడింగ్ నిర్వహించనుంది. ప్రస్తుతం బీఎస్ఈ ఈక్విటీస్, ఈక్విటీ డెరివేటివ్, కరెన్సీ డెరివేటివ్‌ను మాత్రమే నిర్వహిస్తోంది. బీఎస్ఈ ఇప్పటికే తమ ట్రేడర్ సభ్యులకు కమాడిటి డెరివేటివ్ కాంట్రాక్టును ప్రారంభిస్తున్నట్లు సమాచారం అందించింది. ఈ ట్రేడింగ్ బోల్ట్‌ప్లస్‌ఎక్స్ఛేంజీలో నిర్వహిస్తామని, ఇది కొత్త జనరేషన్ ట్రేడింగ్ సిస్టమ్ అని తెలిపింది. ఈ మాక్ ట్రేడింగ్ సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి 7.10 వరకు కొనసాగుతుంది. తర్వాతిరోజు సాయంత్రం 7.10 నుంచి ఉదయం 8.00 గంటల వరకు కొనసాగుతుందని బీఎస్ఈ సర్క్యులర్ పేర్కొంది. గత నెలలో మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి అక్టోబర్‌నుంచి దేశవ్యాప్తంగా ఏకీకృత ఎక్స్ఛేంజీ రూపాంతరం చెందాలని కోరింది. దీంతో స్టాక్‌ఎక్స్ఛేంజీలు కమాడిటీ డెరివేటివ్ ట్రేడింగ్ చేసుకోవడానికి అనుమతి లభిస్తుంది. అయితే దీనికి సంబంధించిన గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. పూర్తి స్థాయిలో గైడ్‌లైన్స్ వచ్చిన తర్వాత కమాడిటి ట్రేడింగ్‌ను ప్రారంభిస్తామని, ఇప్పటికే అన్నీ సిద్ధం చేసుకుని ఉన్నామని బీఎస్ఈ తెలిపింది. దీంతో పాటు వ్యవసాయేతర ఉత్పత్తులు ఉదాహరణకు బులియన్, బేస్‌మెటల్, ముడిచమురు సహ జవాయువును ట్రేడింగ్‌ను మొదలు పెడతామని. దీనికి ఉచితంగా సభ్యత్వం ఇస్తామని తెలిపింది.



సోలార్ రంగాన్ని ఆదుకోండి!

సౌర విద్యుత్‌రంగం ప్రయోజనాలను కాపాడ్డానికి ప్రభుత్వం సోలార్ ప్యానెల్స్, యంత్రాలపై దిగుమతి సుంకాన్ని 70 శాతం వరకు పెంచాలనే ఆలోచనలో ఉంది. ఒక వేళ ప్రభుత్వం సోలార్ ప్యానెల్స్, యంత్రాలపై దిగుమతి సుంకాన్ని పెంచితే మాత్రం ఈ రంగంపై తీవ్రప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం దేశంలోని సౌరవిద్యుత్ కంపెనీలు చైనా నుంచి సోలార్‌ప్యానెల్స్ యంత్రాలను దిగుమతి చేసుకుంటోంది. దిగుమతి సుంకాన్ని పెంచితే మాత్రం ఈ రంగం కుదేలవ్వడం ఖాయమని, ఈ రంగంపై పెట్టిన పెట్టుబడుల్లో 70 శాతం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నవేనని, ఒక వేళ సంకాలు పెంచితే మాత్రం ఈ రుణాలన్నీ మొండిబకాయిలుగా మారి అవకాశం ఉందని చెబుతున్నారు. వచ్చే బడ్జెట్‌లో దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ రంగానికి చెందిన వారు కోరుతున్నారు.



ముంబై : సౌర విద్యుత్ ఉత్పత్తి రంగాన్ని ఆదుకోవాలని ఈ రంగం ప్రభుత్వాన్ని కోరుతోంది. లేదంటే ఈ రంగం భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారుతుందని, వచ్చే బడ్జెట్ 2018-19లో ప్రభుత్వం ఈ రంగానికి కొన్ని రాయితీలు ప్రకటిస్తుందని ఆశిస్తోంది. ప్రస్తుతం ఈ రంగాన్ని రక్షించేందుకు దిగుమతి చేసుకునే సోలార్ విద్యుత్ పరికరాలపై 70 శాతం వరకు పన్ను విధిస్తోంది. ఈ రంగానికి చెందిన నిపుణుల అంచనా ప్రకారం ప్రభుత్వం దిగుమతి చేసుకొనే విద్యుత్ పరికరాలపై సుంకం పెంచినా.. టారిఫ్ ధర రూ.1 వరకు పెరుగుతుందని.. దీంతో ప్రస్తుతం పూర్తి కావస్తున్న ఈ రంగానికి చెందిన ప్రాజెక్టులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని, గిట్టుబాటుకాకపోవడం ఈ రంగంపై పెట్టిన పెట్టుబడులు నిరర్థక ఆస్తులుగా మారే ప్రమాదం ఉందని చెబుతున్నాయి.పరిశ్రమ రంగానికి చెందిన నిపుణుల అంచనా ప్రకారం 3,000 నుంచి 4,000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులపై సుమారు రూ.15వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాయి.. ప్రస్తుతం ఈ పెట్టుబడులు ఇబ్బందుల్లో కూరుకుపోతాయని అంటున్నారు. ముఖ్యంగా సోలార్ ప్రాజెక్టుల్లో 60 శాతం వరకు సోలార్‌సెల్స్, మాడ్యుల్స్ దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది లేదా కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని ఉంటాయన్నారు.ఆకస్మికంగా సోలార్ సెల్స్‌పై పెద్దెత్తున దిగుమతి పన్ను విధిస్తే పలు ప్రాజెక్టులపై తీవ్రప్రభావం చూపుతాయని క్లియర్‌మాక్స్ సోలార్ మేనేజింగ్ డైరెక్టర్ కులదీప్‌జైన్ చెప్పారు. ప్రభుత్వం పన్ను విధిస్తే వివిధ స్థాయిలో ఉన్న ప్రాజెక్టులు స్వల్పకాలంలో దెబ్బతింటాయన్నారు. ఏడాదికి 10,000 మెగావాట్ల సామర్థ్యం కల ప్రాజెక్టులపై సోలార్‌ప్యానెల్‌ను దిగుమతి చేసుకుంటాయని ప్రస్తుతం ప్రభుత్వం పెద్దమొత్తంలో పన్ను విధిస్తే ఈ రంగం కుప్పకూలడం ఖాయమని ఆయన అన్నారు. రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ ప్రకారం 2017లో వేలం వేసిన ప్రాజెక్టులో కంపెనీలు అతి తక్కువ టారిఫ్‌కు బిడ్డింగ్ వేశాయి. ఒక వేళ విద్యుత్ పరికరాలపై ప్రభుత్వం పెద్దెత్తున దిగుమతి సుంకాన్ని పెంచితే ఈ ఈ రంగానికి చెందిన డెవలపర్లు పూర్తి అప్పుల్లో కూరుకుపోతారని అంచనా వేస్తోంది. ప్రభుత్వం దిగుమతి చేసుకునే విద్యుత్ పరికరాలపై 70 శాతం సుంకాన్ని విధిస్తే ప్రాజెక్టు వ్యయం 25 శాతం పెరిగిపోతుంది. దీంతో పాటు విద్యుత్ టారిఫ్‌ను యూనిట్‌కు రూ.3.75కు పెంచాల్సివస్తోంది. గతంలో యూనిట్ రూ.3గా కోట్ చేశాయి. ధర పెరగడంతో డిస్కమ్‌లు సోలార్ లేదా సౌరవిద్యుత్ కొనుగోలు చేయడానికి ఉత్సాహం చూపవు.

గతేడాదితో పోల్చుకుంటే డిస్కమ్‌లు ధర ఎక్కువ చెల్లించాల్సి వస్తుందని క్రిసిల్ రేటింగ్ సీనియర్ డైరెక్టర్ సుబోధ్‌రాయ్ చెప్పారు.సౌరవిద్యుత్‌కు వినియోగించే యంత్రాలు 80 శాతం వరకు చైనా నుంచి దిగుమతి చేసుకుంటాయని, వాటిని తగ్గించాల్సిన అవసరం ఉందని.. అదే సమయంలో ప్రాజెక్టు విలువ పెరగకుండా ప్రభుత్వం చూడాలని సోలార్ సొల్యూషన్ ప్రొవైడర్ ఈస్ట్‌మన్ ఆటో అండ్ పవర్ ఎండీ శేఖర్ సింగాల్ చెప్పారు. సెంట్రల్‌బోర్డు ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ దిగుమతి చేసుకునే సోలార్ ప్యానెల్స్ మోడ్యూల్స్‌పై 7.5 శాతం సుంకాన్ని దీంతో సోలార్‌సెల్‌పై ప్రస్తుతం 30శాతం సుంకం ఉంది. ఇది కాస్తా 50 శాతానికి చేరుతుంది. ప్రభుత్వం దీన్ని 70 శాతం వరకు విధించాలనే ఆలోచనలో ఉంది. ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో దీనిపైదృష్టికేంద్రీకరించి సౌరవిద్యుత్ ఈ రంగాన్ని కాపాడాలని ఆయన కోరారు. రేటింగ్ ఏజెన్సీ ఇక్రా కూడా దిగుమతి చేసుకునే పీవీ మాడ్యూల్స్‌పై స్పష్టత ఇవ్వాలని.. ప్రభుత్వం 2022 నాటికి 175 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో మరింత స్పష్టత ఇవ్వాలని పేర్కొంది. ఈ రంగానికి చెందిన నిపుణులు కూడా ఈ రంగంపై పెట్టుబడులు 70 శాతం వరకు రుణాలు తీసుకొచ్చినవేనని, సుంకం పెంచితే ఇవన్నీ మొండి బకాయిలుగా మారుతాయని అంటున్నారు. తర్వాత ఈ ప్రాజెక్టులు ఆలస్యం కావడమో.. గిట్టుబాటు కాకమూలపడ్డమో జరుగుతాయి . కాబట్టి ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌తో దీనిపై స్పష్టం ఇవ్వాలని ప్రభుత్వానికి ఈ రంగానికి చెందిన నిపుణులు కోరుతున్నారు.

రవాణా వాహనాలపై జీఎస్టీ సింగిల్ రేటు విధించండి

పలు రకాల వాణిజ్య వాహనాలపై జీఎస్టిలో సింగిల్ రేటు పన్ను విధించాలని వాణిజ్యమంత్రిత్వశాఖ కోరుతోంది. దీంతో ఆటోమొబైల్ కంపెనీలపై ప్రమాణాల ఒత్తిడి తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. మల్టీమోడ్ ట్రాన్స్‌పోర్టేషన్ (పలు రకాల రవాణా వాహనాల) విషయానికి వస్తే ఉదాహరణకు రైల్, రోడ్డు, లేదా సముద్ర మార్గాన సరకు డెలివరీ చేసే రవాణాగా చెప్పుకోవచ్చు. ఆటోమొబైల్ రంగానికి ఇండియన్ ఆటోమొబైల్ మాన్యూఫ్యాక్చరర్స్ (సియామ్) ఇటీవలే రవాణామంత్రిత్వశాఖను కలిసి మల్టీమోడల్ జీఎస్టి పన్ను గురించి స్పష్టత ఇవ్వాలని కోరింది. ప్రస్తుతం వాహనాల తయారీ కంపెనీలు, లాజిస్టిక్ సర్వీసెస్ (ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ)లు మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టులో జీఎస్టిలో వివిధ రకాల పన్నులతో ఇబ్బందులుపడుతున్నాయని సియామ్ ఒక ప్రకటనలో తెలిపింది. మల్టీమోడల్‌పై ప్రస్తుతం జీఎస్టిలో స్పష్టత లేదని .. వాహనాల తయారీ కంపెనీలు తాము తయారు చేసిన ఫినిష్డ్ గూడ్స్‌ను సింగిల్ డాక్యుమెంట్‌తో థర్డ్‌పార్టీ లాజిస్టిక్ సర్వీస్ ప్రొవైడర్‌కు ఫ్యాక్టరీ నుంచి నేరుగా సరఫరా చేస్తున్నామని చెబుతున్నారు. ప్రభుత్వ అధికారుల సమాచారం ప్రకారం ప్రస్తుతం జీఎస్టిలో ఉన్న పన్ను నిర్మాణం సంక్లిష్టంగా ఉందని చెబుతున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని రవాణామంత్రిత్వశాఖ పలు రకాలకు చెందిన మల్టీ మోడ్‌ట్రాన్స్‌పోర్టుపై జీఎస్టిలో సింగిల్ రేటుగా ప్రకటించాలని జీఎస్టి కౌన్సిల్‌కు సూచించింది. ప్రస్తుతం జీఎస్టి చట్టం ప్రకారం టాక్స్ కన్సెల్టెంట్‌తో పాటు, పన్ను నిపుణులకు దీనిపై అవగాహన కల్పించాలని సియామ్ కోరుతోంది. పలు రకాల రవాణా వాహనాలపై సింగిల్ టాక్స్‌కై తాము పట్టుపడుతామని అసోసియేన్ పర్కొంది. వీటిని దృష్టిలో ఉంచుకొని వాణిజ్యమంత్రిత్వశాఖప్రత్యేక కార్యదర్శిని నియమించి లావాదేవీ ఖర్చును తగ్గించాలని కోరింది.



పెరిగిన మార్కెట్ క్యాప్ రూ. 92వేల కోట్లు

న్యూఢిల్లీ : బీఎస్ఈలోని టాప్ 10 కంపెనీల్లో తొమ్మిది కంపెనీల మార్కెట్ క్యాప్ గత వారం రూ.97,931.85 కోట్లు పెరిగింది. అత్యధికంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆర్జించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐటీసీ, హిందుస్తాన్ యూనీలీవర్ (హెచ్‌యూఎల్) ఒఎన్‌జీసీలు గురువారంతో ముగిసిన మార్కెట్లో మార్కెట్ క్యాపిటలైజేషన్ పెంచుకున్నాయి. మారుతి సుజుకి మార్కెట్ క్యాప్ ఒక్కటే క్షీణించింది. శుక్రవారం గణతంత్రదినోత్సవం సందర్భంగా మార్కెట్లకు సెలవు. వివరాల్లోకి వెళితే టీసీఎస్ మార్కెట్ క్యాప్ రూ.31,222.03 కోట్లు పెరిగి రూ.5,96,846.16 కోట్లు పెరిగింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.22,295.4 కోట్లతో రూ.6,10,938.21 కోట్లకు, ఒఎన్‌జీసీ రూ.18,800.69 కోట్లతో రూ.2,67,252.12 కోట్లకు. ఐటీసీ రూ.8,533.32 కోట్లతో రూ.3,42,368.98 కోట్లకు, ఇన్ఫోసిస్ రూ.6,016.78 కోట్లతో రూ.2,55,696.44 కోట్లకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రూ.5,316.73 కోట్లతో రూ.5,10,701.65 కోట్లకు, ఎస్‌బీఐ రూ.3,539.14 కోట్లతో రూ.2,70,312.76 కోట్లకు, హెచ్‌యూఎల్ రూ.1,872.27 కోట్లతో రూ.2,80,245.71 కోట్లకు చేరింది. బీఎస్ఈలో టాప్ 10కంపెనీలు ఇలా ఉన్నాయి. టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌యూఎల్, మారుతి, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఒఎన్‌జీసీ, ఇన్ఫోసిస్‌లు ఆక్రమించాయి. గత వారం బీఎస్ఈ 538.86 పాయింట్లు, నిఫ్టీ 174.95 పాయింట్ల లాభపడింది.




ఈవారం మార్కెట్ బడ్జెట్, ఫలితాలు కీలకం

న్యూఢిల్లీ: ఈ వారం స్టాక్ మార్కెట్లకు కీలకం కానున్న అంశాల విషయానికి వస్తే ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థికమంత్రి పార్లమెంటు బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. దీంతో పాటు కార్పొరేట్ క్యూ3 ఫలితాలు కూడా స్టాక్ మార్కెట్లకు కీలకం కానున్నాయి. ఈ వారం ఫలితాలు వెల్లడించే బ్లూచిప్ కంపెనీలు హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. 2019లో జరిగే సాధారణ ఎన్నికల ముందు ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఇదే పూర్తి స్థాయి చివరి బడ్జెట్ అవుతుంది. ఈ వారం ఫలితాలు వెల్లడించే కంపెనీల విషయానికి వస్తే హచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకు, బజాజ్ ఆటో, ఎన్‌టీపీసీ, ఐఓసీ, రిలయన్స్ కమ్యూనికేషన్స్, టెక్ మహీంద్రాలున్నాయి. మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం ఇన్వెస్టర్లు రెండు కీలకాంశాలపై దృష్టి పెడతారని ఒక ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది. రెండో క్యాపిటల్ మార్కెట్ (స్టాక్) మార్కెట్‌లపై ఎంత మొత్తంలో పన్నుల భారం మోపుతుందని చూస్తారని చెబుతున్నారు. విశ్లేషకులు మాత్రం ప్రభుత్వం వచ్చే ఏడాది ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆర్థిక క్రమిశక్షణను పాటిస్తూనే మౌలికరంగంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పెద్దెత్తున వ్యయం చేసే అవకాశాలున్నయని చెబుతున్నారు.



త్వరలో రోడ్లపైకి ఫ్లెక్సీ ఇంజిన్ బైక్‌లు




న్యూఢిల్లీ : త్వరలో రెండు అతి పెద్ద బైక్ తయారీకంపెనీలు ఎలక్ట్రిక్, ఫ్లెక్సీ ఇంజిన్ మోటార్‌సైకిళ్ల భారత్ మార్కెట్లో పరిచయం చేయనున్నారని కేంద్రమంత్రి అరుణ్‌గడ్కరీ చెప్పారు. ఫ్లెక్సీ ఫ్యూయెల్ లేదా డ్యూయెల్ ఫ్యూయెల్ వాహనాల విషయానికి వస్తే పెట్రోల్‌తో పాటు ఎథినాల్‌తో నడుస్తాయి. ప్రభుత్వం వాహనాల ద్వారా వెదజల్లే కాలుష్యాన్ని అరికట్టడానికి ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు ప్రత్యామ్నాయ ఇంధనం ఎథినాల్‌ను తీసుకురా వాలనే ఆలోచనలో ఉన్నట్లు రవాణా, నౌకాశాఖమంత్రి నితిన్‌గడ్కరీ ఆలోచిస్తు న్నారు. దీంతో పాటు ప్రస్తుతం పెట్రోల్, డిజెల్‌కు ప్రత్యామ్నయంగా ఎథినాల్ ఉత్పత్తిని పెంచాలని గట్టిగా కోరుతున్నారు.ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీలు ఈ నెలాఖరులోగా ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు ఫ్లెక్సీఇంజిన్ మోటార్ సైకిల్‌ను అది పెట్రోల్‌తో పాటు ఎథినాల్‌తో నడిచేవిధంగా తీసుకువస్తామని నితిన్ గడ్కరీకి హామీఇచ్చాయి. ఈ రెండు బైక్‌లు త్వరలోనే మార్కెట్లో వస్తాయని గడ్కరీ చెప్పారు. ఈ బైక్‌లు 100 శాతం పెట్రోల్, 100 శాతం ఎథినాల్‌తో నడుస్తాయని గడ్కరీ పేర్కొన్నారు. వ్యవసాయరంగంతో ప్రస్తుతం వినియోగిస్తున్న సంప్రదాయ ఇంధనం స్థానంలో ఎథినాల్ వినియోగాన్ని ప్రోత్సహిస్తామన్నారు. ముడిచమురు దిగుమతి బిల్లు రూ.7 లక్షల కోట్ల వరకు అవుతోందని, ఎథినాల్ వినియోగం ద్వారా రూ.2 లక్షల వరకు దీనిపైఆదా చేస్తే ఆ మొత్తాన్ని వ్యవసాయరంగంపై వినియోగించుకోవచ్చునన్నారు. ప్రభుత్వం ఎథినాల్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి కొత్త విధానలు తీసుకువస్తుందన్నారు. గోధుమ, వరి తౌడు నుంచి వెదరుతో పాటు ఎథినాల్‌ను ఉత్పత్తి చేయవచ్చునని వివరించారు. టన్ను వరితౌడు నుంచి 280 లీటర్ల ఎథినాల్‌ఉత్పత్తి చేవచ్చునని, దీని ద్వారా కొత్తపరిశ్రమలను స్థాపించవచ్చు.. వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చు. దిగుమతి బిల్లు తగ్గించుకోవచ్చునని ఆయన వివరించారు. అమెరికా, బ్రెజిట్, కెనెడాలలో మెర్సిడెజ్, బీఎండబ్ల్యు, ఫోర్డ్ టయోటాలు ఫ్లెక్సీ ఇంజిన్‌లతో వాహనాలు నడుపుతారని, అలాంటి ఆటోమొబైల్ కంపెనీలు ఇక్కడ ఎందుకు వాటిని తయారు చేయరని ఆయన ప్రశ్నించారు.

ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను రాయితీలు

కేంద్రప్రభుత్వం ఎలక్ట్రిక్‌వాహనాలను ప్రోత్సహించడానికి బడ్జెట్లో పన్ను రాయితీలు ప్రకటించే అవకాశాలున్నాయని విశ్వసనీయవర్గాల సమాచారం. జీఎస్టిలో పన్ను రేట్లు తగ్గించడంతో పాటు ప్రభుత్వం వాహనాలను కొనుగోలు చేసే వారికి పన్ను రాయితీలు ఇవ్వాలని ఆలోచిస్తున్నట్లు చెబుతున్నారు. 2030 నాటికి ప్రజారవాణాను వందశాతం ఎలక్ట్రిక్ వాహనాల కింద, వ్యక్తిగత వాహనాలను 40 శాతం వరకు తీసుకురావాలనే ఆలోచనలో ఉంది. ఆర్థికమంత్రి ఫిబ్రవరి 1, 2018న ప్రవేశపెట్టే బడ్జెట్లో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై పన్ను లబ్ధిని ప్రకటించేఅవకాశాలున్నాయని, దీనిపై ప్రభుత్వం పెద్దెత్తున మేధోమధనం చేసిందని పరిశ్రమవర్గాలు తెలిపాయి. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం జీఎస్టిలో ఎలక్ట్రిక్ వాహనాల పన్నును 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయని, అలాగే ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే వారికి ఆదాయపు పన్ను రాయితీ మినహాయింపు ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. బడ్జెట్‌లో ఆదాయపు పన్ను లబ్ధిని ప్రకటిస్తే... జీఎస్టి మండలి సమావేశంలో పన్ను రేటును నిర్ణయిస్తారు. కాగా దేశవ్యాప్తంగా చూస్తే ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య వాణిజ్య, వ్యక్తిగత వాహనాలు ఒక శాతం కంటే తక్కువ ఉన్నాయి. 2016-17లో 1.76 కోట్ల ద్విచక్ర వాహనాలు అమ్ముడుపోయాయి. ప్యాసింజర్ వాహనాల 30.4 లక్షల వరకు ఉన్నాయి. ఈ వారం ప్రారంభంలో విద్యుత్, పునరుత్పాదక ఇంధన మంత్రి ఆర్‌కె సింగ్ ఎలక్ట్రిక్ కార్లపై పన్ను రాయితీలుకల్పించాలని కోరారు.



విలీనాలు టేకోవర్‌లు రూ.6వేల కోట్ల డాలర్లు



న్యూఢిల్లీ :గతేడాది 2017లో కార్పొరేట్ ఇండియా మొత్తం విలీనాలు, టేకోవర్‌లు (ప్రైవేట్ ఈక్విటీ)లు కలిపి మొత్తం 6050 కోట్ల బిలియన్ డాలర్ల వరకు జరిగాయి. ఈ ఏడాది కూడా మార్కెట్లు అనుకూలంగా ఉండటంతో ఈ ఏడాది కూడా మరిన్ని విలీనాలు, టేకోవర్‌లు జరిగే అవకాశాలున్నాయని గ్రాంట్ థ్రోన్‌టన్ ఇండియా ఎల్‌ఎల్‌పీ భాగస్వామి ప్రశాంత్ మెహ్రా ఒక నివేదికలో పేర్కొన్నారు. నివేదికలో ప్రకారం మొత్తం 1485 లావాదేవీల ద్వారా 5785 కోట్ల విలీనాలు, టేకోవర్‌లు జరిగాయి. పెద్ద కంపెనీలు తమ అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి నిరుపయోగంగా పడిన ఉన్న ఆస్తులనువిక్రయించుకున్నాయి. కొన్ని కంపెనీల బ్యాలెన్స్‌షీట్లు బలంగా ఉండటంతో కంపెనీలను టేకోవర్ చేసి మార్కెట్లో వాటా పెంచుకోవడంతో పాటు పోటీ ఇవ్వాలని టేకోవర్‌లు చేశాయని ప్రశాంత్ మెహ్రా చెప్పారు. గతేడాది విలీనాలు టేకోవర్‌ల విషయానికి వస్తే 400 ఒప్పందాలు సుమారు 4000 కోట్ల డాలర్ల వరకు జరిగాయి. టెలికం రంగంలో అత్యధికంగా ఎంఅండ్‌ఎలు జరిగాయి. మొత్తం ఆరు ఒప్పందాలు 100 మిలియన్ డాలర్ల వరకు ఉంటాయని ఇవన్నీ కలుపుకుంటే 2500 కోట్ల డాలర్లకు చేరుతాయని తెలిపింది. మొత్తం ఎంఅండ్‌ఎలో 60శాతం వాటా టెలికంరంగం ఆక్రమించింది. కీలకమైన బ్యాంకింగ్, ఫ్మారా రంగాలు కలిపితే మొత్తం ఒప్పందాల్లో 14 శాతం ఆక్రమించాయి. టెక్ సెక్టార్ విషయానికి వస్తే స్టార్టప్‌లు ఐటీఅండ్ ఐటీఈఎస్ రంగాల్లో 40 శాతం వ్యాల్యూమ్స్ పెరిగాయి.

గత ఏడాది ప్రైవేట్ ఈక్విటీ రికార్డు స్థాయికి చేరాయి... 2016తో పోల్చుకుంటే 45 శాతం పెరిగాయి. 736 లావాదేవీలపై 2030కోట్ల డాలర్ల వరకు జరిగాయి. ఏడాది ప్రాతిపదికన చూస్తే గతంలో ఎన్నడూలేని విధంగా 2016లో పీఈ లావాదేవీలు బాగా పుంజుకున్నాయి. రాజకీయ స్థిరత్వం, ప్రభుత్వం పెద్దెత్తున ఆర్థిక సంస్కరణలకు పెద్దపీట వేయడం, ఈ ఏడాది కూడా సూక్ష్మ ఆర్థిక వ్యవస్థ జోరందుకునే అవకాశాలున్నందు వల్ల ఈ ఏడాదికూడా విలీనాలు, టేకోవర్‌లు పుంజుకునే అవకాశాలున్నాయని మెహ్రా నివేదికలో పేర్కొన్నారు.

12బ్యాంకుల పనితీరుపై సమీక్ష

న్యూఢిల్లీ : ఆర్థికమంత్రిత్వశాఖ త్వరలోనే ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల చీఫ్‌లతో సమావేశమై.. ఆ బ్యాంకుల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తుందని అధికారవర్గాల తెలిజేశాయి. రిజర్వు బ్యాంకు కొత్త ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ (పీసీఏ) సంస్కరణల్లో భాగంగా బ్యాంకులను సరిదిద్దే చర్యలను తీసుకోవాలని ఆర్థికమంత్రిత్వశాఖకు ఆర్‌బీఐ సూచించింది. ఇప్పటి వరకు ఆర్‌బీఐ మొత్తం 12 ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకులను పీసీఏ కింద గుర్తించింది. ఈ బ్యాంకులు ఆర్‌బీఐ విధించి పలు కొలమానాలను పాటించడంలో బాగా వెనుబడ్డాయని, దీంతో మొండిబకాయిలు బాగా పెరిగిపోవడం, మూలధనం నిల్వాలు బాగా తగ్గిపోవడం, ఆస్తులపై ఆదాయం తక్కువగా రావడం తదితర అంశా లని అధికారులు తెలియజేశారు. ఈ బ్యాంకులతో ఆర్థికమంత్రిత్వశాఖ సమావేశమై దిద్దుబాటు చర్యలు చేపడుతుంది. కాగా ఈ బ్యాంకులకు మూలధనం విషయానికి వస్తే ప్రభుత్వం మూలధనం సమకూరుస్తుందని, అయితే ఈ బ్యాంకులు తమ పనితీరును మెరుగు పర్చుకోవాల్సి ఉంటుందని, ముఖ్యంగా మొండి బకాయిల వసూళ్లలో కొంత పురోగతి చూపించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మెరుగైన పనితీరును కనబరిస్తేవారికి మరింత మూలధనం సమకూర్చుతారు. పీసీఏకింది ప్రభుత్వం 12 బ్యాంకులకు రూ.52,311 కోట్ల మూలధనం సమకూరుస్తామని ప్రకటించింది. వాటిలో బలమైన బ్యాంకులకు మార్చి 31, 2018 నాటికి రూ.35,828 కోట్ల వరకు కేటాయిస్తామని వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం ఐడిబీఐకి అత్యధికంగా రూ.10,610 కోట్లు, బ్యాంకు ఆఫ్ ఇండియాకు రూ.9,323కోట్లు, యూకోబ్యాంకు రూ.6,507 కోట్ల వరకు సమకూరుస్తుంది. వీటితో పాటు సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు రూ.5,158 కోట్లు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకుకు రూ.4,694 కోట్లు, ఒరియంటల్‌బ్యాంకు ఆఫ్ కామర్స్ రూ.3,571 కోట్లు, దేనాబ్యాంకుకు రూ.3.045 కోట్లు, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్రకు రూ.3,17 కోట్లు, యూనైటెడ్ బ్యాంకు ఆఫ్ ఇండయాకు రూ.2,634 కోట్లు, కార్పొరేషన్ బ్యాంకుకు రూ.2,187కోట్లు, అలహాబాద్ బ్యాంకుకు రూ.1500 కోట్ల వరకు ప్రభుత్వం మూలధనం సమకూరుస్తుంది. బ్యాంకుల పనితీరును మెరుగుపర్చేందుకు ఆర్‌బీఐ మొత్తం మూడు ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంది. వాటిలో బ్యాంకు మూలధనం, ఆస్తుల నాణ్యత, బ్యాంకుల లాభం.. దీని ప్రాతిపదికన ఏ బ్యాంకు బలహీనంగా ఉందో గుర్తించిన దానిపై ప్రత్యేక నిఘా పెట్టి వాటిని గాడిలో పెట్టడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది.



వైద్య పరికరాలపై దిగుమతి సుంకం పెంపు

న్యూఢిల్లీ : దేశీయ వైద్యపరికరాల కంపెనీలను బలోపేతం చేయడానికి కేంద్రప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వైద్య పరికరాలపై దిగుమతి సుంకం పెంచాలనే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. దీంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మేకిన్ ఇండియాను కార్యక్రమానికి చేయూతనిచ్చినట్లవుతుంది. ఈ రంగానికి చెందిన ప్రతినిధులు బడ్జెట్‌ముందుస్తు సంప్రదింపుల్లో భాగంగా దిగుమతి చేసుకునే వైద్య పరికరాలపై సుంకాన్ని 5-15 శాతానికి పెంచాలని వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వైద్యపరికరాలపై 0-7.5 శాతం వరకు పన్ను విధిస్తున్నారు. ప్రభుత్వం మూడు సంవత్సరాల క్రితం పతిష్టాత్మకంగా ప్రారంభించినా మేకిన్ ఇండియాలో వైద్య పరికరాల తయారీ రంగంలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని స్పష్టం చేసింది. ఫార్మారంగంలో భారత్ అంతర్జాతీయంగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. కానీ వైద్యపరికరాల రంగంలో అలాంటి పురోగతి కనిపించడంలేదని వాపోయింది. వైద్యపరికరాల తయారీరంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం విదేశీ పెట్టుబడులను ఆటోమెటిక్‌రూట్లో 100 శాతం అనుమతిస్తోంది.



ధాన్యం నిల్వలకు
నెదర్లాండ్ టెక్నాలజీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో విత్తన ఆహార ధాన్యాల నిల్వలపై సహకారం అందచేసేందుకు నెదార్లాండ్ ముందుకు వచ్చింది. ఆదివారం తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధృవీకరణ సంస్థ కార్యాలయంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సి. పార్ధసారధితో నెదర్లాండ్ ప్రతినిధి బృందం సమావేశమయ్యింది. విత్తన, ఆహార ధాన్యాల నిల్వలపై సహకారం అందచేసేందుకు ఈ బృందం తన సంసిద్ధతను వ్యక్తం చేసింది. విత్తనంలో నాణ్యతను కాపాడుకోవటం, ఆహార గింజల్లో ఆస్పర్ జిల్లస్ అనే శిలీంధ్రం ఉత్పత్తి చేసే అఫ్లోటోక్సిన్ అనే రసాయనం లేకుండా చేయటంపై టెక్నాలజీ అందచేస్తామని తెలిపింది. విత్తన నాణ్యత కాపాడు కోవటం అంటే విత్తనాన్ని ఉత్పత్తి చేసినట్టే. శిలీంధ్రాల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లతో విత్తనాల నాణ్యత చెడిపోకుండా ఈ టెక్నాలజీ ఉపకరిస్తుంది. మొక్కజొన్న, వేరుశనగ, తదితర ఆహారపంటల ఉత్పత్తులు, విత్తనాలు శిలీంధ్ర తెగుళ్ల బారిన పడితే వాటి ద్వారా మునుషులు, పశువుల్లో కూడా కాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకుతాయని నెదర్లాండ్ ప్రతినిధి బృందం పేర్కొంది. వ్యవసాయ కార్యదర్శి పార్ధసారథి మాట్లాడుతూ విత్తన నాణ్యత, పరిరక్షణకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటోందన్నారు. వనపర్తిలో అఫ్లోటోక్సిన్ రహిత వేరుశనగ విత్తన నిలువకై ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రయోగశాలకు నిధులు కూడా మంజూరు చేసినట్టు తెలిపారు. ప్రపంచ విత్తన భాండాగారంగా అవతరించనున్న తెలంగాణ రాష్ట్రానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. నెదర్లాండ్ బృందం సహకారంతో త్వరలోనే సీడ్ పోస్ట్ ఇన్వెస్ట్ టెక్నాలజీపై హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో విల్లియం, పెరెల్గ్ హ్యారిన్, ఎస్.ఆర్.ఎన్. రెడ్డి, సుదర్శన్, ప్రదీప్ తదితర అధికారులు పాల్గొన్నారు.

చంద్రుడి రంగు మారదు
బిర్లాసైన్స్ సెంటర్ డాక్టర్ బీజీ సిద్ధార్థ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ నెల 31వ తేదీన వచ్చే సంపూర్ణ చంద్ర గ్రహణంతోఎలాంటి అనర్థాలు...అరిష్టాలు లేవని ప్రముఖ బిర్లా సైన్ సెంటర్ డాక్టర్ బీజీ. సిద్ధార్థ్ స్పష్టం చేశారు. ఈ గ్రహణం వల్ల చంద్రుడు రంగు మారుతుందని జరుగుతున్న ప్రచారంలోనూ ఎలాంటి నిజం లేదన్నారు. ఆదివారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ, గ్రహణం వల్ల ఎలాంటి రాశుల వారికి ఇబ్బందులు కూడా లేవన్నారు. ప్రతి నెలా రెండవ పౌర్ణమి వచ్చినట్లుగా 31వ తేదీన కూడా పౌర్ణమి వచ్చిందన్నారు. అయితే గ్రహణాల రోజున భూమి, సూర్యుడు, చంద్రుడుల మధ్య ఉంటే దూరం కొన్ని సందర్భాల్లో హెచ్చు తగ్గులు సంభవిస్తుంటాయన్నారు. అవి కదులుతుండడం వల్ల దూరాల మధ్య వ్యత్యాసం ఏర్పడి గ్రహణాల రోజున సూర్యుడు, చంద్ర కిరణాల్లో తేడాలు కనిపిస్తుంటాయని ఆయన తెలిపారు. 150 సంవత్సరాల తరువాత వస్తున్న అరుదైన చంద్రగ్రహణమే అయినప్పటికీ దీనివల్ల ప్రజలకు ఎలాంటి ఆనారోగ్య సమస్యలు కూడా తలెత్తవని అన్నారు. కేవలం ప్రజల్లో ఉన్న మూడనమ్మకాలను దృష్టిలో పెట్టుకుని కొందరు పనిగట్టుకుని చేస్తున్న ప్రచారం మాత్రమేనని అన్నారు. ఈ చంద్రగ్రహణాన్ని కూడా ప్రజలు నిర్భయంతరంగా చూడవచ్చునని అన్నారు. బిర్లా సైన్స్ సెంటర్‌లో గ్రహణం చూసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భూమి ఛాయ చంద్రుడుపై పడుతున్న కారణంగా డార్క్‌గా కనబడుతుందన్నారు. అలాగే భూమి తాలుకు వాయువుండలంలోని కొన్ని కిరణాలు కూడా చంద్రబింబంపై పడుతుంటాయన్నారు. సాయంత్రం 6.45 గంటల నుంచి గ్రహణం మొదలై గంటసేపు ఉంటుందన్నారు.

రైల్వే ఉద్యోగుల విదేశీ యాత్ర

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సుమారు వంద మంది రైల్వే ఉద్యోగులు సింగపూర్, మలేషియా దేశాల విహార యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమంలో భాగంగా విహార యాత్రను ఏర్పాటు చేశారు. నాన్ గెజిటెడ్ సిబ్బందికి ఈ అవకాశం కల్పించారు. సింగపూర్, మలేషియాలో ఈ బృందం వారం రోజుల పాటు పర్యటించనుంది. సిబ్బంది లబ్ధి పథకం (ఎస్‌బిఎఫ్) నిధుల నుండి ఉద్యోగుల పర్యటన ఖర్చులను భరించడం జరుగుతుంది. ఈ పర్యటనకు ఎంపికైన ఉద్యోగులకు 75 శాతం వ్యయం రైల్వే భరిస్తుండగా 25 శాతం వ్యయాన్ని యాత్రకు ఎంపికైన ఉద్యోగి భరించవలసి ఉంటుంది. కార్మిక , ఉగ్యోగ సంఘాల నేతలు రైల్ నిలయం ఎదుట సిబ్బంది విదేశీ విహార యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ప్రత్యేక బస్సుల్లో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న రైల్వే సిబ్బంది అక్కడి నుండి విమానంలో సింగపూర్ బయలుదేరి వెళారు. విదేశీ యాత్రకు ఎంపిక కాబడిన వారిలో కింది స్థాయి ఉద్యోగులు, ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నవారే అత్యధికంగా ఉన్నారు. అన్ని డివిజన్లు, వర్క్‌షాప్‌లు, ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్నవారిని స్లాట్ పద్ధతిలో ఎంపిక చేయడం జరిగింది. సింగపూర్, మలేషియాలోని ముఖ్యమైన యూనివర్సల్ స్టూడియోలు, నైట్ సఫారీ తదితర ప్రాంతాలు దర్శించనున్నారు. సింగపూర్, మలేషియాలో అత్యాధునిక వసతి, భోజన, రవాణా సౌకర్యాలను కల్పించడం జరిగింది. ఈ బృందం ఫిబ్రవరి 3వ తేదీ వరకు విహార యాత్ర చేయనుంది.

'పల్స్ పోలియో' సక్సెస్ చేయండి
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్

హైదరాబాద్ , ఆంధ్రప్రభ : పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని, దీనివల్ల రాష్ట్రం పోలియో రహిత రాష్ట్రంగా మార్చ వచ్చని ఆ దిశగా అధికారులు, ప్రజలు సహకరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్‌నగర్‌లో జరిగిన పల్స్‌ఫోలియో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటివిడత కార్యక్రమంలో భాగంగా చుక్కలను 0-5 సంవత్సరాల లోపు పిల్లలకు చుక్కలను వేయించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన సూచించారు. దీనికోసం అధి కారులు, సిబ్బంది అందరూ సమష్టిగా కృషి చేసి ఈ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతికుమారి, కమిషనర్ కరుణ వాకాటి, హెదరాబాద్ డీఎంహెచ్‌ఓ కె.పద్మజ, ఎన్‌హెచ్‌ఎం ఇన్‌చార్జీ శ్రీనివాస రావు, డీఎంహెచ్‌ఓ డెమో రాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ పలువురు చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలను వేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 36,55,204 మంది పిల్లలకు..

రాష్ట్రవ్యాప్తంగా 36,55,204 మంది పిల్లలకు పోలి యో చుక్కలను వేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా 22,768 పోలియో కేంద్రాల ద్వారా 95,500 మంది సిబ్బంది ఈకార్యక్రమంలో పాల్గొంటు న్నారు. ప్రయాణాల్లో ఉన్న వారి కోసం 737 ట్రాన్సిట్ కేంద్రాల ద్వారా అన్ని బస్టాండ్లలో, రైల్వేస్టేషన్‌లలో మరియు ప్రధాన కూడళ్లలో ఈ పోలియో చుక్కలను వేయ నున్నారు. వీరితో పాటు 787 మొబైల్ టీం, 2,280 రూట్ సూపర్‌వైజర్స్, 8,711 మంది ఎఎన్ఎంలు, 27,045 ఆశా వర్కర్లు, 32,082 అంగన్‌వాడీ వర్కర్లు పనిచేస్తున్నారు. రెండో విడత పల్స్‌పోలియో మార్చి 11వ తేదీన ఉంటుం దని అధికారులు తెలిపారు.

వరంగల్‌లో డిప్యూటీ సీఎం కడియం

వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని డిప్యూ టీ సీఎం కడియం శ్రీహరి ప్రారంభించగా, యాదాద్రి జిల్లాలో ప్రభుత్వ విప్ గొంగడి సునీత యాదగిరిగుట్ట పంచాయతీ కార్యాలయంలో చిన్నారులకు పోలియో చుక్కలను వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యాదగిరిగుట్ట మండలంలో మొత్తం 48 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేయాలని తెలంఆణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టిపిటిఎఫ్) డిమాండ్ చేసింది. ప్రభుత్వం ప్రవేశపెడతామని చెప్పిన కేజీ టు పీజీ ఉచిత నాణ్యమైన విద్యను అమలు చేయాలని ఆదివారం జరిగిన సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి కొండల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో ఏపిటిఎఫ్ మాజీ అధ్యక్షులు నర్సిరెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి వి మనోహరరాజు, కె వేణుగోపాల్, నారాయణమ్మ, తిరుపతిరెడ్డి, నాగమణి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని నేతలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడం కోసమే కులాల పేరుతో గురుకులాలను ప్రారంభిస్తున్నారని విమర్శించారు. కులాల పేరుతో గురుకులాలను ప్రారంభించడం కాకుండా ప్రతి ప్రభుత్వ పాఠశాలను గురుకులంగా మార్చాలని డిమాండ్ చేశారు.

కొత్త పంచాయతీలపై కసరత్తు

- బేసి సంఖ్యలోనే వార్డులు
- సర్పంచ్ ఎన్నికపై జాగ్రత్తలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్రామీణ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చివేసే దిశగా ప్రభుత్వం రూపొందిస్తున్న నూతన పంచాయతీరాజ్ వ్యవస్థపై కసరత్తులు కొనసాగు తున్నాయి. శివారు గ్రామాలు, తండాలను ఇప్పుడున్న గ్రా మ పంచాయతీల పరిధి నుంచి వేరు చేసి, కొత్త పంచాయ తీలుగా ఏర్పాటు చేసే ప్రక్రియ చివరిదశకు చేరుకుంది. కొత్తగా ఏర్పాటు కానున్న గ్రామ పంచాయతీలను జనాభా ఆధారంగానే ఏర్పాటు చేస్తున్నారు. అయితే వీటిలో వార్డు లు సరి సంఖ్యలో కాకుండా బేసి సంఖ్యలో మాత్రమే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో ఐదు వందల జనాభా, ఆలోపు ఉన్న శివారు గ్రామాలు, తండాల ను కూడా గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు జనాభాను ప్రామాణికంగా తీసు కుని వీటిని ప్రస్తుత పంచాయతీల పరిధి నుంచి విడదీస్తు న్నారు. కొత్తగా ఏర్పాటు కాబోయే గ్రామ పంచాయతీల్లో ఎన్ని వార్డులు ఉండాలన్న అంశంపై ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు స్పష్టత ఇచ్చింది. ఐదు వందల జనాభా వరకూ ఉన్న శివారు గ్రామాలు, తండాలను ఏడు వార్డుల కింద విభజించి నూతన గ్రామపంచాయతీలకింద ప్రతి పాదనలు సిద్దం చేస్తున్నారు. అదే విధంగా 500నుంచి 1500వరకూ జనాభా ఉన్న గ్రామాలను 9,11,13 వార్డుల కింద విభజించి ప్రతిపాదనలు సిద్దం చేస్తున్నారు.

జానాభాను ప్రామాణికంగా తీసుకుని వార్డుల విభజన చేపట్టారు. నూతనంగా రూపొందిస్తున్న పంచాయతీరాజ్ ముసాయిదా ప్రతిపాదనలో గ్రామ పంచాయతీ ఎన్నికల విధానం కూడా ప్రధానాంశాల్లో ఒకటిగా ఉంది. గ్రామ సర్పంచి పదవికి ఇప్పటివరకూ గ్రామ పరిధిలోని ఓటర్లే నేరుగా ఎన్నుకునే విధానం అమల్లో ఉంది. ఈ విధానాన్ని సవరించి వార్డులకు జరిగే ఎన్నికల్లో వార్డు సభ్యులుగా ఎంపికైన వారిలో ఒకరిని గ్రామ సర్పంచుగా వార్డు సభ్యు లే నేరుగా ఎంపిక చేసుకునేలా కొత్త పంచాయరాజ్ బిల్లులో ఒక ప్రతిపాదన కూడా ఉంది. అయితే ఈ అంశంపై ఇప్పటి వరకూ ఏవిధమైన తుది నిర్ణయం తీసుకోలేదు. కొత్తగా ఏర్పాటు కానున్న గ్రామ పంచాయతీల ఏర్పాటులో వార్డు సభ్యులు సరి సంఖ్యలో ఉంటే వారిలో ఒకరిని ఎంపిక చేసుకోవటం క్లిష్టతరంగా మారే అవకాశాలు లేకపోలేదు. ఒక గ్రామ పంచాయతీలో పది మంది వార్డు సభ్యులు ఉంటే సర్పంచి ఎన్నికకు పోటీలో ఉన్న వారికి చేరో 5 వార్డుసభ్యుల ఓట్లు లభిస్తే అపుడు సర్పంచి ఎంపికకు లాటరీ, లేదా టాస్ పద్దతిని ఆశ్రయించటం అనివార్యం కానుంది. ఈ పరిస్తితిని ముందే ఊహించిన ప్రభుత్వం కొత్త పంచాయతీల ప్రతిపాదన దశలోనే తగిన జాగ్రత్తలు చేపట్టింది. కొత్త పంచాయతీల ఏర్పాటు సందర్భంగానే వార్డులను, జనాభాను బట్టి 5,7, 9,11, 13, క్రమంలో బేసి సంఖ్యలోనే ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం. వార్డు ఏర్పాటుకు ఎంత జనాభా ఉండాలి, ఎంత మంది ఓటర్లు ఉండాలి అన్నది గ్రామ మొత్తం జనాభాను ఆధారంగా తీసుకుని వార్డుల ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం.

కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుకు సంబంధించి గ్రామ జనాభా, భౌగోళిక సరిహద్దులు తదితర అంశాలతో కూడిన సమగ్ర సమాచారంతో ప్రతిపాదనలు ఈనెల 25నాటికే ప్రభుత్వానికి అందచేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కలెక్టర్ల కు ఆదేశాలు ఇచ్చారు. అయితే కొత్త పంచాయతీల ఏర్పా టుకు సంబంధించిన మరికొంత సమయం కావాలని అధికారులు కోరటంతో ఈ గడువును ఈ నెల 31 వరకూ పొడిగించారు. ఈ నేపథ్యంలో మండల స్థాయిలో రెవె న్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు ప్రతిపాదనలపై చేస్తున్న కసరత్తులు చివరిదశకు చేరుకున్నాయి.

బ్యాలెట్ పత్రాల తరహాలో
చెక్‌ల ముద్రణ

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడి సాయంపై దిశా నిర్దేశం చేయాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, రైతులను అప్పుల ఊబిలోంచి బయటకు తీసుకురావడంతో పాటు ఆత్మహత్యల నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెట్టుబడి సాయాన్ని మే నెల నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో అవసరమైన నిధులు బడ్జెట్‌లో కేటాయించేందుకు కసరత్తు చేస్తోంది.

భూరికార్డుల ప్రక్షాళనలో అంతిమంగా తేలిన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 70 లక్షలకు పైగా రైతులు ఒక కోటి 42 లక్షలకు పైగా ఎకరాల భూమిని సాగుచేస్తున్నట్లు తేలింది. ఒక్కో ఎకరాకు ఏడాదిలో రెండు విడతలుగా రూ.8 వేల రూపాయల చొప్పున రైతులకు సాయం అందజేస్తే రూ.11 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని.. ఇందులో కేవలం సాగుకు యోగ్యమైన భూములకే పెట్టుబడి సాయాన్ని అందించాలని మంత్రివర్గ ఉపసంఘం సీఎంకి అందజేసిన నివేదికలో కోరింది.

రాష్ట్రంలో మార్చి 11వ తేదీన రైతులకు, భూ యజమానులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణి చేయనుంది. రైతులకిచ్చే పాస్ పుస్తకంపై ముద్రించే కోడ్‌ను రైతులకిచ్చే వ్యవసాయ పెట్టుబడి చెక్‌పై కూడా ముద్రించాలని దీంతో అక్రమాలకు, అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉంటుందని, పంపిణి విధానం కూడా సులభతరంగా జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రెవెన్యూశాఖ నుంచి సమాచారం తీసుకుని ప్రభుత్వ లీడ్ బ్యాంక్‌గా ఉన్న భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ)కి చెక్కులు సిద్ధం చేసే బాధ్యత అప్పగించే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. ఒకేసారి 70 లక్షలకు పైగా చెక్కులను ముద్రించాల్సి ఉండగా.. ఇందుకు సమయం పడుతుందని, అందుకే సమాచారాన్ని త్వరితగతిన అందజేస్తే బ్యాంకు అధికారులు చెక్కులను సిద్ధంచేసి గడువు తేదీలోగా అందజేయడానికి ఆస్కారం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. చెక్కుల ముద్రణ, పంపిణికి సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికలకు అనుసరించే విధానాన్నే అవలంబించాలని ప్రభుత్వం భావిస్తోంది. బ్యాలెట్ పత్రాల తరహాలో చెక్కులు ముద్రించి ఎక్కడ ముద్రణ జరుగుతుందో అక్కడి నుంచే గ్రామంలో ఎంతమంది రైతులు ఉన్నారు.. వారి పేర్లేమిటి? ఒక్కో రైతు ఎన్ని ఎకరాలు సేద్యం చేస్తున్నారు? ఆ వివరాలు తెలుసుకుని నేరుగా ఆ గ్రామానికే బ్యాలెట్ పత్రాల పెట్టెను పంపించినట్లు చెక్కుల పెట్టెను సిద్ధం చేసి మండల, జిల్లా, గ్రామీణ ప్రాంతాలవారీగా పంపాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గ్రామ రైతు సమన్వయ సమితులు చెక్కుల పంపిణి బాధ్యత తమ భుజస్కంధాలపై వేసుకోవాలని ఏ ఒక్క రైతుకు సాయం అందలేదన్న ఫిర్యాదు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందిస్తోంది. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో మండలాల వారీగా రైతు సమన్వయ సమితులు ఏర్పాటైనా అక్కడక్కడా రాజకీయ కారణాలతో ఈ ప్రక్రియ ఇంకా ముగియలేదు. వచ్చే వారం పదిరోజుల్లో ఖాళీగా ఉన్న మండలాలను గుర్తించి, అక్కడ రైతు సమన్వయ సమితులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేలా సంబంధిత జిల్లా అధికారులకు ఆదేశాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లోపు జిల్లా సమన్వయ సమితులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. రైతు సమన్వయ సమితి రాష్ట్ర సమాఖ్య ఏర్పాటును అసెంబ్లీ సమావేశాల తర్వాతే నియమించాలని, ఈ లోపు రాష్ట్రస్థాయి కమిటీలో ఎవరెవరిని ఎంపిక చేయాలో ఆ కసరత్తు పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లా సమన్వయ సమితులుఏర్పాటు పూర్తయ్యాక సీఎం కేసీఆర్ జిల్లా విభజనకు పూర్వం ఉన్న ఉమ్మడి జిల్లాలలో నాలుగైదు జిల్లాలను ఎంపిక చేసుకుని స్థానికంగా సమావేశాలు ఏర్పాటుచేసి రైతులతో సమావేశాలు నిర్వహించి వాటికి హాజరు కావాలని నిర్ణయించారు. జిల్లా స్థాయిలో సమావేశాలకు హాజరయ్యాక రాష్ట్రస్థాయిలో హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో కనీసం 20 లక్షల మంది రైతులతో భారీ బహిరంగ సభను నిర్వహించాలని, ఈ సభ ఎన్నికల ప్రచార సభను తలపించే విధంగా ఉండాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం.

రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యం

- కేంద్రంపై ఒత్తిడికి టీఆర్ఎస్ నిర్ణయం
- నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రప్రయోజనాలే లక్ష్యంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని టిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నిర్ణయించింది. అవసరమైతే నిలదీసి నిరసనలకూ దిగాలని.. రాష్ట్ర హక్కులు సాధించే విషయంలో రాజీలేకుండా వ్యవవహరించేందుకు వ్యూహాన్ని సిద్దం చేసుకుంది. ఇప్పటికే రాజ్యసభలో అనుసరించే వ్యూహంపై కె.కేశవరావు నేతృత్వంలో ఆయన నివాసంలో సమావేశం జరగ్గా, లోక్‌సభలో అనుసరించేవ్యూహంపై లోక్‌సభాపక్షనేత జితేందర్‌రెడ్డి నేతృత్వంలో ఎంపీలు సమావేశమై సమిష్టి ఒత్తిడికి నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు ఇప్పటికే తగిన హోం వర్క్ చేసిన ఎంపీలు సోమవారం నుండి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో గళాన్ని వినిపించనున్నారు.తెలంగాణకు ఎయిమ్స్ కేటాయించాలని దాదాపు నాలుగేళ్ళుగా కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నా, ప్రతి సెషన్‌లో కోరుతున్నా.. ఫలితం లేదని ఎంపీలు చెబుతున్నారు. మరోసారి ఎయిమ్స్ కోసం పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు పట్టుబట్టనున్నారు. కేంద్రప్రభుత్వం 41రకాల పథకాలను అమలుచేస్తుండగా, రాష్ట్రానికి రావాల్సిన వాటా బకాయిలను కేంద్రం పూర్తిగా చెల్లించడంలేదు. ఇంకా రూ.5వేలకోట్లకు పైగా పథకాలకు సంబంధించిన బకాయిలు పెండింగ్ ఉన్నట్లు ఎంపీలు చెబుతున్నారు. పంటలకు గిట్టుబాటు ధరలపై చేసిన విజ్ఞప్తులకూ ఫలితం ఉండడం లేదని ఈ క్రమంలో ఈసారి గట్టి ఒత్తిడికి పార్టీ నిర్ణయించిందని నేతలు చెబుతున్నారు. ఇక ప్రధానమంత్రి సడక్‌యోజన, ఉపాధి హామీ పథకాల విషయంలోనూ రాష్ట్రానికి అన్యాయమే జరిగిందన్న అభిప్రాయాన్ని టిఆర్ఎస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్‌సిటీతో పాటు ఇతర పట్టణీకరణ పథకాల్లోనూ అదే ధోరణి వ్యక్తమైందని.. పునర్విభజన చట్టంలో పేర్కొన్నట్లు తెలంగాణలోని ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా కూడా లభించలేదని.. ఈ అంశాలన్నీ కేంద్రం రాష్ట్రంపై చిన్నచూపు చూస్తుందన్న అభిప్రాయానికి మద్దతు పలుకుతున్నాయని టిఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఎయిమ్స్‌తో పాటు రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల సమస్యలపై పక్కా ప్రణాళికతో పార్లమెంట్‌లో ఒత్తిడితేవాలని, కేంద్రమంత్రులను కూడా కలిసి సమస్యల పరిష్కారానికి ఒత్తిడి తీసుకురావాలని నేతలు నిర్ణయించారు. ఇంతకాలం కేంద్రానికి పూర్తిగా సహకరించిన టిఆర్ఎస్ ఎంపీలు.. ఈసారి సమస్యలపై బలమైన వాణిని వినిపించేందుకు సమాయత్తమయ్యారు.

ఘనంగా సూర్య ఆరాధన



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : అందరి బంధువైన ప్రాణకోటికి శక్తినిచ్చే సూర్యుడి ఆరాధనను కుల మతాలకు అతీతంగా ఢిల్లీలో ఘనంగా నిర్వహించామని ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. సూర్యునికి నమస్కరించడం, యోగాభ్యాసం వల్ల మనషికి నూతనో త్తేజం, శక్తి వస్తుందని అన్నారు. ఏపీ భవన్ ప్రాంగణంలో ఆదివారం ఉదయం నిర్వహించిన సూర్యారాధన కార్య క్రమంలో సూర్య నమస్కారాలు, సూర్య స్తోత్రం, ఆరట్యం, యోగా మొదలైన కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వ హించారు. ఆంధ్రప్రదేశ్‌ను ఉషోదయ రాష్ట్రంగా నిలపాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆశయాలకు అను గుణంగా పని చేస్తున్నామని ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. సూర్య శక్తిని ఒడిసిపట్టి రాష్ట్రమంతా నిరంతరం వెలుగులు నింపాలనే తలంపుతో సౌర విద్యుశ్చక్తి ప్రాజెక్టుల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నదని ఆయన చెప్పారు. ఆదిత్యుణ్ని ఆరాధించేందుకు, మానవ శక్తిని ద్విగుణీకృతం చేసుకునేందుకు కృతజ్ఞతాపూర్వకంగా ప్రతి ఏటా రథసప్తమి అనంతరం వచ్చే ఆదివారం రోజున సూర్యారాధన నిర్వహిస్తు న్నామని ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. ఎంతో భక్తి శ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఢిల్లీ నలుమూలల నుంచి జనం తరలి రావడం సంతోషకర పరిణామమని చెప్పారు. ఉల్లాసభరిత వాతావరణంలో జరిగిన ఈ ఆరాధనలో ఏపీ భవన్ ఓఎస్డీ మెట్టా రామారావు, డిప్యూటీ కమిషనర్ సూర్యనారాయణ, పీఏవో వెంకట్రామిరెడ్డి, భవన్‌అధికారులు, సిబ్బంది, ఢిల్లీలోని తెలుగు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధార్ గుర్తింపు మాత్రమే..
యూఐడీఏఐ సీఈఓ

న్యూఢిల్లీ: ఆధార్ ఒక గుర్తింపు మాత్రమేనని, వ్యక్తుల వివరాలను అధ్యయనం చేసి అంచనావేసే ఉపకరణం కాదని భారత వినూత్న గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) యూఐడీఏఐ సీఈఓ భూషణ్ పాండే స్పష్టం చేశారు. ఆదివారం ట్విటర్ లైవ్ చాట్‌లో ప్రజలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. కనీస సమాచారం, బయోమెట్రిక్స్ ప్రాతిపదికగా రూపొందిన ఆధార్ అనుచితమైనది ఏమీ కాదని తెలిపారు. ఆధార్ రూపకల్పనకు, ఒక వ్యక్తిని ధృవీకరించడానికి వేలిముద్ర, ఐరిస్, ఫోటో సరిపోతుంది. డీఎన్ఏ లాంటివి తీసుకోవాలనే ప్రణాళికలు మా వద్ద లేవు అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

యూఐడీఏఐ ఒక పోల్చి చూసే సర్వీసు

మీరు బ్యాంకుకు మీ ఆధార్ నంబర్ ఇచ్చినప్పుడు మీ బ్యాంక్ ఖాతా గురించి యూఐడీఏఐకు తెలియదు. బ్యాంక్ మీ ఆధార్ నంబరు, వేలిముద్రను మాకు ఇస్తుంది. యూఐడీఏఐ ఒక పోల్చిచూసే సర్వీసు. సరిపోయిందా లేదా అని మాత్రమే అది చెబుతుంది. ప్రభుత్వం ఈ విధానం ద్వారా పౌరులకు సంబంధించిన ఎలాంటి సమాచారం పొందలేదని భూషణ్ పాండే తేల్చి చెప్పారు.

ఆధార్ నంబరుతో బ్యాంకు ఖాతాలు స్తంభించిపోవు

బ్యాంకు ఖాతాలు పౌరుల ఆస్తులని మరో ప్రశ్నకు సమాధానంగా యూఐడీఏఐ సీఈఓ తెలిపారు. ఆధార్ నంబరుతో వాటి అనుసంధానం వల్ల ప్రభుత్వం ఏదో ఒక రోజు అలాంటి ఖాతాలను స్తంభింపజేస్తుందనే భయాందోళనలు ఉత్పన్నం కావని చెప్పారు. వర్చువల్ ఐడీ ప్రవేశం, పరిమిత ఇకేవీసీ వల్ల డేటా లీకు కాదని తెలిపారు. గోప్యతా విధానాన్ని బలోపేతం చేసేందుకే అవి ఉన్నాయని చెప్పారు.


పాక్ దాడిలో మహిళ మృతి

కాశ్మీర్: గత జనవరి 22న పాకిస్థాన్ జరిపిన దాడుల్లో తీవ్రంగా గాయపడిన 35ఏళ్ల మహిళ ఆసుపత్రిలో మరణించింది. జనవరి 18నుంచి 22వరకు పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణరేఖ వెంబడి జరిపిన ఆకస్మిక దాడుల్లో 6మంది భద్రతా సిబ్బంది, ఏడుగురు పౌరులు మరణించగా మరో 70మంది గాయపడ్డారు. జనవరి 18నుంచి సరిహద్దు దాడుల కారణంగా మరణాల సంఖ్య పెరిగింది. జమ్మూలోని కానాచక్కు ప్రాంతానికి చెందిన బివ్లాదేవి జనవరి 22న పాక్ దాడుల్లో తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం ఆమెను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్య చికిత్స అందిస్తున్నారు. కాగా ఆమె ఆదివారం ఆసుపత్రిలో మృతి చెందిందని, పోస్టుమార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని మృతురాలి బంధువులకు అప్పగించామని పోలీసులు తెలిపారు. జనవరి 22నుంచి పాకిస్థాన్ వైపునుంచి కాల్పుల విరమణ ఉల్లంఘన లేనప్పటికీ జనవరి 24న రాజౌరిలోని నౌషెరా సెక్టార్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పాకిస్థాన్ కాలుపులకు ఉపయోగించిన రెండు మోర్టార్ షెల్స్ లభించాయని, జనవరి 26న చిన్న ఆయుధాలతో కాలుపులకు పాల్పడిందని రక్షణశాఖ అధికారులు తెలిపారు. పాక్ కాలుపుల దృష్ట్యా ముందుస్తు చర్యల్లో భాగంగా నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సుమారు 300 పాఠశాలలను గత వారం మూసివేశామని అధికారులు తెలిపారు.

ముగ్గురు మావోయిస్టు కొరియర్ల అరెస్టు

- ఒక తుపాకి, 9 బుల్లెట్లు స్వాధీనం
- డీఎస్పీ నరేష్ కుమార్ వెల్లడి





కొత్తగూడ, ప్రభ న్యూస్ : గంగారం బస్టాండ్ ఆవరణలో అనుమానస్పదంగా అటుఇటు తిరుగుతుండగా ముగ్గురు మావోయిస్టు కోరియర్లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు డిఎస్పి నరేష్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశంలో మావోయిస్టు కోరియర్ల అరెస్టును చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం నర్సిగుడం గ్రామానికి చెందిన ఈసం నాగేశ్వర్ రావు, గంగారం గ్రామానికి చెందిన పర్శిక వీరస్వామి, కారెపల్లి మండలం టేరపల్లి గ్రామానికి చెందిన వేమనూరి అశోక్ లు పందెం గ్రామంలోని జోగురామయ్య వద్ద ఉన్న రివాల్వర్ ను, రూపాయలు 50వేలకు కొనుక్కొని భద్రాచలం అడువుల్లో ఉన్న యాప నారాయణ అలియాస్ హరిభూషన్ కు అందచేసేందుకు వెల్తుండగా తమకు అందిన పక్కా సమాచారం మేరకు వెళ్ళి తనిఖీలు చేయగా రివాల్వర్, తొమ్మిది బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరికి సహకరించిన బైరబోయిన లింగస్వామి, జోగు రామయ్యాలు పరారీలో ఉన్నట్లు తెలిపారు.


ప్రజలు అక్రమ ఆయుధాలు కలిగిఉన్న వారు ప్రలోభాలకు గురిచేస్తే మోసపోవద్దని వారికి ఆశ్రయం కలిగించ వద్దని అన్నారు. అక్రమ ఆయుధాలు కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సిఐ రమేష్ నాయక్, ఎస్సై సతీష్, బాలక్రిష్ణ, ఏఎస్సై బాబురావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం విదేశీ ప్రతినిధి బృంద సభ్యుల వివరాలివ్వండి : సీఐసీ



న్యూఢిల్లీ: ప్రధాని విదేశీ పర్యటనలో మోడీతో పాటు ఆయాదేశాలకు వెళ్లిన ప్రతినిధి బృందంలోని సభ్యుల పేర్లను బహిర్గతం చేయాలని కేంద్ర సమాచార కమిషనర్ ఆర్‌కే మాథూర్ ప్రధానమంత్రి కార్యాలయాన్ని ఆదేశించారు. ప్రభుత్వానికి సంబంధం లెకుండా వెళ్లిన వ్యక్తుల జాబితాను బహిర్గతం చేయాలని స.హ చట్టం కింద రెండు పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో సీఐసీ పీఎంవో స్పందించింది. ప్రధానితో పాటు విదేశాలకు వెళ్లిన ప్రతినిధి బృందంలోని ప్రైవేటు వ్యక్తుల పేర్లు బహిర్గతం చేయాలని నీరజ్ శర్మ, ఆయుబ్ అలీ స.హ చట్టం కింద వేర్వేరుగా దరఖాస్తులు చేసుకున్నారు. సమాధానం రాలేదు. శర్మ గతేడాది జూలైలో ఆర్టీఐకి దరఖాస్తు చేసుకున్నాడు. అలీ మాత్రం ప్రధాని మోడీ నివాసం, ఆఫీస్‌కు ప్రతీ నెలనెలా చేస్తున్న ఖర్చుల వివరాలు ఇవ్వాలని 2016 ఏప్రిల్ లో పీఎంవోను కోరారు. భద్రతా కారణాల రీత్యా ప్రధాని విదేశీ పర్యటనల్లో ఆయనతోపాటు వెళ్లిన ప్రతినిధి బృంద సభ్యుల పేర్లు ఇవ్వలేమని .. ఇందుకు ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(ఎ)ను మినహాయింపుగా చూపిస్తూ శర్మకు పీఎంవో బదులిచ్చింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు సంబంధించి వివరాలు ఉన్నాయని శర్మ తెలపడంతో వివరాలివ్వాలని మాథూర్ పీఎంవోను ఆదేశించారు.

జీతాలు వదులుకుందాం.. అసమానతలు తొలగిద్దాం



న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నికయ్యే ఎంపీలు తమ వేతనాలను వదులుకుని దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలవాలని స్పీకర్ సుమిత్రా మహజన్‌కు లేఖ రాశారు. లోక్‌సభ సభ్యులు వేతనాలు వదులుకోవడాన్ని ఉద్యమంగా ప్రారంభిసే దేశ ఆర్థిక ప్రయోజనాలకు అండగా నిలిచిన వారౌతారని అన్నారు. దేశంలో అసమానతలు పెరిగిపోవడం ప్రజాస్వామ్యానికి హానికరమని ఆందోళన వ్యక్తం చేసిన తన లేఖలో కొన్ని కీలకాంశాలను వెల్లడించారు.. రోజురోజుకూ భారత్ లో అసమానతలు పెరిగిపోతున్నాయి. ఎంపీలకు చెల్లించే జీతబత్యాలు నెలకు 50 వేలు కాగా.. నియోజక వర్గ భత్యాల కింద నెలకు 45వేలు ఇస్తున్నారు. ఇతర అలవెన్సులతో కలిపి నెలకు ప్రతీ ఎంపీకి రెండు లక్షల 70వేల రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే లోక్‌సభలోని ఎంపీల్లో కోటి రూపాయలకు పైగా ఆదాయమున్నవారు 2009లో 319 మంది ఉండగా..ప్రస్తుతం 449 మందికి చేరారు. 132 మంది లోక్‌సభ సభ్యులు తమ ఆస్తుల విలువ రూ.10 కోట్లు ఉంటుందని ప్రభుత్వానికి సమర్పించిన వివరాల్లో వెల్లడించారు. ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం 16వ లోక్‌సభ ఎంపీల సరాసరి ఆస్తుల విలువ రూ.14 కోట్ల 61 లక్షల రూపాయలుగా ఉంది. ఈనేపథ్యంలో వరుణ్ గాంధీ ఎంపీలు తమ వేతనాలను వదులుకునేలా స్వచ్ఛంద నిర్ణయం తీసుకోవాలని లేఖలో స్పష్టం చేశారు.

సైబర్ నేరాలకు చెక్!

న్యూఢిల్లీ: సైబర్ నేరాల నియంత్రణకు దేశంలో అత్యున్నత సమన్వయ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్ర హోంశాఖ కసరత్తు చేస్తోంది. ప్రతీ జిల్లాలోనూ ఇలాంటి వ్యవస్థ స్థాపించాలని రాష్ట్రాలను కోరింది. ఆర్థిక నేరాలు, మత పరమైన, అశ్లీల సమాచారం వ్యాప్తి వంటి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయిలో కూడా పటిష్ట వ్యవస్థ ఉంటే బాగుంటుందని రాష్ట్రాలను తెలియజేసింది. దేశంలో సైబర్ నేరాల పరిష్కారానికి అత్యున్నత సమన్వయ కేంద్రాన్ని న్యూఢిల్లీలో ఏర్పాటు చేయనున్నట్లు హోంశాఖ అధికారులు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా సైబర్ నేరాలకు సంబందించిన అంశాలకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో ఎప్పటికప్పుడు సమన్వయం కలిగి ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. భారత చట్టాలకు వ్యతిరేకంగా నడుస్తున్న వెబ్‌సైట్లను బ్లాక్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దేశవ్యాప్తంగా సైబర్ నేరాల నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు చేస్తే అక్రమార్కుల ఆటలకు చెక్ పెట్టవచ్చనితెలిపారు.

కమ్యూనికేషన్ హబ్‌కు సన్నాహాలు

న్యూఢిల్లీ : సోషల్ మీడియా కమ్యూనికేషన్ హబ్ ఏర్పాటుకు ఇన్‌ఫర్మేషన్, బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. జిల్లాలోని వార్తలను ట్యాబ్‌లో పెట్టడానికి, ప్రభుత్వ పథకాలపై ఫీడ్‌బ్యాక్ కోసం ఈ హబ్ ఎంతగానో తోడ్పడుతుందని ఆ శాఖ అభిప్రాయపడింది. స్థానికంగా మీడియా ప్రతినిధులను సమకూర్చుకుని అక్కడి ప్రభుత్వపరమైన పరిస్థితులు, వార్తలను ప్రత్యక్షంగా చూసి, విని అందించేలా చూస్తున్నట్టు సంబంధిత అధికారులు వివరించారు. దీంతో పాటు ప్రభుత్వ పథకాల నిర్వహణ, లొసుగులు, అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకుంటారు. ఆ ప్రాంతంలోని వార్తలపై మీడియా ప్రతినిధులు దృష్టి సారిస్తుంటారు. ఫీడ్‌బ్యాక్ అభిప్రాయాలను విశ్లేషించడానికి కేంద్ర ప్రభుత్వ అధికారులను సైతం నియమిస్తారు. వీరు ఆ ప్రాంతంలోని వార్తలు, రుమార్లను గుర్తిస్తారు. మంత్రిత్వ శాఖ కింద ఉన్న బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్), పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ (పీఎస్‌యూ)లు సంబంధిత సాఫ్ట్‌వేర్ సప్లై కోసం టెండర్ కూడా వేసినట్టు అధికారులు తెలిపారు. హిందీ, ఉర్దూ, తెలుగు, మలయాళం, కన్నడ, బెంగాళీ, పంజాబీ, తమిళ్, ఇంగ్లీష్ భాషల్లో ఈ హబ్ కొనసాగుతుందని మంత్రిత్వ శాఖ అధికారులు వివరించారు.



అవినీతిపై సమరం

● కటకటాల వెనుక ముగ్గురు మాజీ సీఎంలు ● దేవుడి నుంచి తప్పించుకోలేరు :మోడీ

న్యూఢిల్లీ: అవినీతి, నల్ల ధనం పై ప్రభుత్వం సాగిస్తున్న సమ రం లో చేరాలని భారతీయ యువతకు ప్రధాని నరేంద్ర మోడీ పిలు పునిచ్చారు. ఆదివారమిక్కడ ఎన్ సీసీ ర్యాలీలో మాట్లాడుతూ కొన్ని సందర్భాల్లో అవినీతి నిర్మూలనపై పెద్ద పెద్ద మాటలు విన పడు తున్నప్పుడు, అతిపెద్ద అవి నీతిపరులు స్వేచ్ఛగా తిరు గుతు న్న ప్పుడు ఒక విధమైన నిరాశ కలుగుతుందని ప్రధాని అన్నారు. కానీ నేడు ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు జైలులో మగ్గుతున్న ఒక దశ గుండా మీరు సాగుతున్నారని తెలిపారు. పశుగ్రాసం కుంభకోణం కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రులు లాలూ ప్రసాద్ యాదవ్, జగన్నాథ్ మిశ్రా, అవినీతి కేసులో హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఓంప్రకాశ్ చౌతాలా జైలు శిక్ష అనుభవిస్తున్న సంగతి విదితమే.

అవినీతిపై పోరు.. యువతకు భవిత

దేవుడు లేడని ఎవరన్నారు? దేవుడి చేతుల్లో న్యాయం ఉండదని ఎవరన్నారు? ఇప్పుడు ఏ ఒక్కరూ తప్పించుకోలేరు అని ప్రధాని స్పష్టం చేశారు. అవినీతి పట్ల కేవలం ఆగ్రహం, అసహ్యం చూపితే పని అవుతుందా? మనం ఒక సుదీర్ఘమైన సమరం సాగించాలి. ఆ పోరాటం ఆగిపోరాదు. అవినీతి, నల్లధనంపై ఈ పోరాటం యువత భవిష్యత్తును తీర్చిదిద్దుతుంది. ఇది నా యువత భవిష్యత్తును తీర్చిదిద్దిన పక్షంలో అప్పుడిక అది నా దేశ భవిష్యత్తును రూపొందిస్తుంది అని మోడీ భావోద్వేగంగా అన్నారు.

ఆధార్ దేశాభివృద్ధికి గొప్ప బలం

ఈ రోజుల్లో మీరు ఆధార్ గురించి వింటూ వస్తున్నారు. ఆధార్ భారత్ అభివృద్ధికి గొప్ప బలాన్ని జోడిస్తుందని నేను చెబుతున్నాను. గతంలో ఏవైతే తప్పుడు చేతుల్లోకి వెళ్ళాయో ఇప్పుడవి అసలైన లబ్ధిదారులకు చేరుతున్నాయి అని ప్రధాని తెలిపారు.

డిజిటల్ లావాదేవీలు అనివార్యం

డిజిటల్ లావాదేవీలను ప్రస్తావిస్తూ.. నా ప్రియ మిత్రులారా, కొంత ఆశించి నేనిక్కడకు వచ్చాను. లేదు.. లేదు..ఓట్లు లేదా రాజకీయాలు అడగడానికి రాలేదు. నేను చేసే విజ్ఞప్తి ఒకటే.. దయచేసి భీమ్ యాప్ ద్వారా డిజిటల్ లావాదేవీలను మరింతగా చేయండి. ఆ వేదికపైకి ఇతరులను తీసుకురండి. ఇది పారదర్శకత, జవాబుదారీతనం వైపునకు మన వేస్తున్న ఒక అడుగు అని నరేంద్ర మోడీ అన్నారు.



'పద్మా'ల ఎంపికలో పారదర్శకత
సామాన్యులే విజేతలయ్యారు

మన్‌కీ బాత్‌లో ప్రధానిమోడీ

న్యూఢిల్లీ: పద్మ పురస్కార గ్రహీతల ఎంపిక ప్రక్రియను తమ ప్రభుత్వం మార్చిందని ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం తెలిపారు. పేరు, ప్రతిష్ఠలు ప్రాతిపదికన కాకుండా చేసిన పని కారణంగా ఎంపిక చేపట్టడంతో ప్రస్తుతం సామాన్యులు సైతం గౌరవించబడుతున్నారని ప్రధాని చెప్పారు. ఈ ఏడాది తొలి మన్‌కీ బాత్ కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ పెద్ద నగరాల్లో ఉండనివారు, దినపత్రికలు, టీవీల్లో కనిపించనివారు పురస్కారాలను స్వీకరించనున్నారని తెలిపారు. ఆన్‌లైన్‌లో నామినేషన్ ప్రక్రియ పారదర్శకతకు దారితీసింది. ఈ పురస్కారాలకు ఎంపిక ప్రక్రియ రూపాంతరం చెందిందని అని చెప్పారు. ఎలాంటి సిఫారసు లేకుండానే ప్రజలు విజేతలయ్యారని ప్రధాని తెలిపారు. విజేతలను మీరు చూసిన పక్షంలో సమాజంలో అలాంటి వారు ఉంటున్నందుకు, అంతేకాక ఎలాంటి సిఫారసు లేకుండా వారు ఈ గుర్తింపు పొందుతున్నందుకు మీరు గర్విస్తారు అని మోడీ తెలిపారు. పద్మపురస్కారాలకు ఎంపికైన వారిని పాఠశాలలు, కళాశాలలకు ఆహ్వానించాలని, తద్వారా వారి అనుభవాల నుంచి స్ఫూర్తి పొందాలని ప్రధాని సూచించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ విజేతలు లక్ష్మి కుట్టి, అరవింద్ గుప్తాలను ఆయన ప్రస్తావించారు. దేశ రాజధానిలో గణతంత్ర వేడుకలకు తొలిసారిగా 10 మంది దేశాధినేతలు అతిథులుగా హాజరైన వైనాన్ని వెల్లడించడంతో మోడీ తన ప్రసంగానికి శ్రీకారం చుట్టారు. మహిళా శక్తిని కొనియాడారు. ఫిబ్రవరి ఒకటవ తేదీన వ్యోమగామి కల్పనా చావ్లా వర్ధంతిని ప్రస్తావించారు. ఒక కుమార్తె, 10 మంది కుమారులతో సమానమని తెలిపే శ్లోకాన్ని ఉటంకించడం ద్వారా అన్ని రంగాల్లో మహిళలు సాధిస్తున్న విజయాలను ప్రస్తుతించారు. కేంద్ర రక్షణ శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఫైటర్ విమానం సుఖోయ్ 30లో ప్రయాణించిన వైనాన్ని ప్రస్తావించారు. అసాధారణ విజయాన్ని సాధించిన అసాధారణ మహిళలతో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సమావేశం ప్రధాని ప్రసంగంలో చోటు చేసుకుంది. రిపబ్లిక్ డే పరేడ్‌లో మహిళలతో కూడిన బీఎస్ఎఫ్ బైకర్ దళం దేశ, విదేశాలకు చెందిన అతిథులను అబ్బురపరిచిందని ప్రధాని తెలిపారు. ముంబాయి, మాతుంగ రైల్వే స్టేషన్‌ను మొత్తం మహిళలే నిర్వహిస్తున్న వైనాన్ని ప్రస్తావించారు. భారతీయ నాగరికత సామర్థ్యం, గుణాలు, స్వీయ దిద్దుబాటును ప్రస్తుతించారు. వరకట్నం, బాల్య వివాహానికి వ్యతిరేకంగా బీహార్‌లో ప్రపంచంలోనే అతి పొడవైన 13,000 కి.మీ.ల మానవ హారాన్ని ప్రధాని ప్రస్తావించారు. ఈ నెల 30న జాతిపిత వర్ధంతి సందర్భంగా మహాత్మాగాంధీని మోడీ స్మరించుకున్నారు. ఆయన చూపిన శాంతి, అహింసా మార్గం అందరికీ వర్తిస్తుందని తెలిపారు. ఆరోగ్య రంగం గురించి ప్రస్తావిస్తూ ప్రభుత్వానికి చెందిన జన ఔషధి కేంద్రాల వద్ద మార్కెట్ రేట్ల కన్నా 50 నుంచి 90 శాతం తక్కువ ధరకు ఔషధాలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమంలో వేర్వేరు దేశాల్లో ప్రజాప్రతినిధులుగా ఎంపికైన భారత సంతతికి చెందిన వారి భాగస్వామ్యాన్ని ప్రధాని పేర్కొన్నారు. అలాంటి వారు నివసిస్తున్న దేశాలకు సేవలందిస్తూనే భారత్‌తో దృఢమైన బంధాన్ని కొనసాగిస్తున్నారని కొని యాడారు. ఐరోపాలో వేర్వేరు దేశాల్లో వేర్వేరు రంగాల్లో కీలకమైన పాత్ర పోషిస్తున్న భారతీయులతో రూపొందించిన ఒక క్యాలెండర్‌ను ఐరోపా యూనియన్ తనకు పంపించిందని ప్రధాని తెలిపారు.

భారత నారీలతో కలిసి పనిచేస్తా

● బాలికల విద్యకు కృషి చేయాలి ● భారత్, పాక్‌లో ఒకేరకమైన సమస్యలు: మలాల

దావోస్ : పాకిస్థాన్‌కు చెందిన సామాజిక కార్యకర్త మలాలా యూసుఫ్జాయి తన మనసులో భారత్‌పై ఉన్న మక్కువను బయటపెట్టింది. భారతీయుల నుండి తనకు ఎంతో సహాయ సహకారాలు అందాయని, అక్కడి అమ్మాయిలతో కలిసి పనిచేయాలని ఉందని మనసులో మాట బయటపెట్టింది. భారత్‌దేశాన్ని కూడా సందర్శించాలని ఉందని వివరించింది. పాకిస్తాన్‌లో విద్యపై తాలిబన్లతో పోరాడిన ధైర్యశాలి బాలికగా ఆమెకు ప్రపంచవ్యాప్తంగా పేరుంది. దీనికిగాను ఆమె నోబెల్ శాంతి బహుమతి పొందింది. బాలికలకు కూడా విద్య అవసరమనే నినాదాన్ని పాకిస్థాన్‌లో ఎలుగెత్తి చాటింది. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు అంటే చాలా ఇష్టమని, ఎప్పటికీ గౌరవిస్తుంటానని చెప్పారు. ఇండియాలో ఆడే సినిమాలు అన్న, నాటికలు అన్న ఎంతో ఆసక్తి ఉంటుందని వివరించారు. భారత్ నుండి తాను చాలా నేర్చుకోవాల్సి ఉందని మాలాలా చెప్పుకొచ్చింది. జనవరి 22 నుండి 26 వరకు దావోస్‌లో నిర్వహించిన వరల్డ్ ఎకనామిక్ సదస్సుకు మాలాలా కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ప్రపంచ వ్యాప్తంగా బడా పెట్టుబడిదారులు, కంపెనీ సీఈఓలతో ఆమె మాట్లాడారు. బాలికలకు విద్య నేర్పించే విషయమై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా వారిని ఆమె కోరింది. ఆమె మాలాలా ఫౌండేషన్‌ను సైతం ఏర్పాటు చేసి ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న నిధులతో బాలికలకు విద్యను అందించడంలో కృషి చేస్తున్నారు. గుల్మాకీ నెట్‌వర్క్ పేరుతో ఆమె ఓ బ్లాగ్‌ను కూడా ఏర్పాటు చేసింది. భారత్‌లో కూడా చాలా మంది ఫాలో అవుతున్నారని వివరించారు. కింది స్థాయి ప్రజలతో నేరుగా వెళ్లి మాట్లాడితే సమస్య ఏంటో లోతుగా అర్థం అవుతుందని, అలాంటి సమయంలో సమస్యను వెంటనే పరిష్కరించే వీలుంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. దావోస్ సదస్సులో మొదటి సారి పాల్గొనడంతో ఆమె ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేసింది. పాకిస్తాన్, భారత్‌లో ఒకే రకమైన సమస్యలు ఉన్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. నేను ఆపత్కాలంలో ఉన్నప్పుడు భారత్ నాకు వెన్నుదన్నుగా నిలిచిందని, ఎప్పటికీ భారతీయుల సహాయాన్ని మరువబోనని ఆమె చెప్పుకొచ్చింది. ఎన్నో ఉత్తరాలు కూడా భారత్ నుండి వచ్చినట్టు వివరించారు. అందులో ఒక అమ్మాయి భారత్‌కు నేను ప్రధాని కావాలని కోరుకుంటున్నాను అని, ఒకవేళ అలా అయితే పాకిస్తాన్, భారత్ మధ్య ఎలాంటి గొడవకుల తావివ్వకుండా శాంతి సామరస్యంగా సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పుకొచ్చిందని గుర్తు చేశారు. ఆమె రాసిన ఉత్తరంలోని ప్రతీ మాట నా హృదయాన్ని తాకిందని తెలిపారు. అమ్మాయిలు కేవలం చదువులోనే కాకుండా రాజకీయ రంగంలో కూడా ముందుండాలని కోరుకున్నట్టు చెప్పారు. ఒకవేళ్ల అమ్మాయిలు ప్రధాని, రాష్ట్రపతి పదవులుగా అధిరోహిస్తే మాత్రం పరిస్థితిలో చాలా మార్పు వస్తుందని అన్నారు. భారత్‌లోని ఛానల్స్ ద్వారా హిందీ నేర్చుకున్నానని, అదేవిధంగా సినిమాలు కూడా చూసినట్టు చెప్పారు. ప్రతీ భారతీయుడి నుండి సంస్కృతి సంప్రదాయాలతో పాటు విలువలు నేర్చుకోవచ్చని మాలాలా అభిప్రాయపడ్డారు. భారత్, పాకిస్థాన్‌లోని అమ్మాయిలను చూస్తే ఇప్పటికీ బాధ వేస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. భారత్, పాకిస్థాన్ అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా అమ్మాయిలకు ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. దేశ భవిష్యత్తు బాలికలపైనే ఆధారపడి ఉందనే విషయాన్ని ఇరు దేశాలు మరిచిపోవద్దని హితవు పలికారు. ఎప్పుడైతే బాలికలకు మంచి విలువలతో కూడిన విద్యను అందిస్తారో అప్పుడే వారి భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుందని అన్నారు.



ప్రాణం తీసిన ఎంఆర్ఐ మిషన్

ముంబై: ఎంఆర్ఐ మెషిన్‌లో చిక్కుకుని యువకుడు మృతి చెందిన సంఘటన ముంబైలో జరిగింది. ముంబైలో బివిఆర్ చారిటబుల్ ఆసుపత్రిలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. రాజేశ్ మురు తల్లి నాయర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. తల్లిని చూసేందుకు రాజేశ్ శనివారం సాయంత్రం ఆసుపత్రికి వెళ్లాడు. ఆ సమయంలో వార్డుబోయ్ విఠల్‌చవాన్ ఆక్సిజన్ సిలిండరును ఎంఆర్ఐ గదికి తీసుకురావాలిసిందిగా రాజేశ్‌ను కోరాడు. కాగా సిలిండరుతో లోపలికి వెళ్లిన రాజేశ్‌ను స్కానింగ్‌రూమ్‌లో ఉన్న ఎంఆర్ఐ మిషన్ ఆయస్కాంతశక్తి ఒక్క ఉదుటున అతడిని లాగేసింది. మిషన్‌లో చిక్కుకుపోయిన రాజేశ్ అక్కడికి అక్కడే మృతి చెందాడు. డాక్టర్ సిద్దార్థ్ షా, వార్డుబోయ్ విఠల్‌చవాన్‌పై 304ఏ సెక్షన్‌కింద కేసు నమోదు చేశారు.పోస్టుమార్టం నిమిత్తం జేజే ఆసుపత్రికి తర లించారు. ఈ సంఘటనపై సమా చారం తెలుసుకున్న మహారాష్ట్రసీఎం దేవేంద్ర ఫడ్నవిస్ మృతుని రూ.5లక్షలు నష్టపరిహారం ప్రకటించారు.

జీపు బోల్తా ఏడుగురు మృతి


ఘజియాబాద్: పొగమంచు ధాటికి పోలీస్ జీప్ చెరువులో పడి పోవటంతో ఏడుగురు మృతి చెందిన ఘటన ఘజియాబాద్‌లో జరిగింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు పోలీసులు సైతం మృతి చెందారు. పొగమంచు రహదారిని కమ్మేయటంతో రహదారి పరిసరాలను గుర్తించలేని డ్రైవరు వాహనాన్ని రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి పోనివ్వటంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. 24వ నెంబర్ జాతీయ రహదారి, దాస్నావద్ద దట్టమైన పొగమంచు కారణంగా ఈ ఘటన జరి గిందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాజేశ్ పాండే మాట్లాడుతూ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ శర్మ, కానిస్టేబుల్ దేవేందర్ యాదవ్ ఓ కేసు నిమిత్తం విచారణకు వెళ్లి తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. జీపు మొత్తం నీటిలో మునిగి పోవటంతో ఇద్దరు పోలీసులు సహా మొత్తం ఏడుగురు తమ ప్రాణాలు కోల్పో యారన్నారు. మరణించినవారిలో మధ్య వయస్కురాలైన మహిళ, ఆమె కుమార్తె ఉన్నారన్నారు.వివరాలు తెలియాలసి ఉందని పోలీస్ అధికారి రాజేశ్ పాండే తెలిపారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేపై భూఆక్రమణ కేసు

ఛత్తీస్‌గఢ్: కోర్టు ఆదేశాల మేరకు ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అతని అనుచరులు నలుగురిపై భూఆక్రమణ కేసు నమోదైంది. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బ జిల్లాలో చైయా గ్రామంలో ఓ గిరిజనుడి భూమి ఆక్రమించుకున్నారని ఆరోపణలు రావటంతో ఈ కేసు నమోదైంది. కోర్బ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే జైసింగ్ అగర్వాల్ అతని అనుచరులు నలుగురు తన 0.45హెక్టార్ భూమిని ఆక్రమించుకున్నారని దుక్లాల్ కన్వర్ అనే గిరిజనుడు స్థానిక కోర్టులో పిటీషన్ వేశాడు. షెడ్యూల్ కుల మరియు షెడ్యూల్ తెగల అట్రాసిటీ నివారణ చట్టం కింద ప్రత్యేక న్యాయమూర్తి ఈకేసును విచారించారు. ప్రత్యేక జడ్జి యోగేష్ పార్కి జనవరి 15న కోర్బలోని ఎజెకె పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ఆక్రమణదారుల ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే జైసింగ్ (48), సురేంద్ర జైస్వాల్ (52), భోలా సోనీ (38), విజయ్‌సింగ్ (48), దర్శన్ మణిక్పురి(45)పై కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌ఓ మాండవీ ధ్రువీకరించారు. కేసు నమోదు చేశామని అయితే ఎవరినీ అరెస్టు చేయలేదని ఆయన వెల్లడించారు.

వలసదారులకు ట్రంప్ భరోసా!

అమెరికా అధ్యక్షుడి ప్రసంగంపై అంచనాలు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం రాత్రి యూనియన్ కాంగ్రెస్‌నుద్దేశించి మాట్లాడనున్నారు. ప్రధానంగా ఆయన ఆర్థిక వ్యవస్థ, వలసదారులు, పన్ను విధానంలో సంస్కరణల విషయమై ప్రసంగించే అవకాశం ఉందని పలువురు రాజకీయ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. అమెరికా ప్రజల్లో తనను తాను నిలదొక్కుకోవడానికి ఇదో మంచి అవకాశం అని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ది స్టడీ డైవర్సిటీ, డెమోక్రసీ డైరెక్టర్, పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ అల్విన్ బి టిల్లర్ట్ చెప్పుకొచ్చారు. అమెరికాలోని రాజకీయంతో పాటు అభివృద్ధిపై లోతుగా అధ్యయం చేశానని, దీంతో పాటు జాతి, జాతి రాజకీయాలు, మీడియాపై దృష్టి సారించానని టిల్లర్ట్ చెప్పుకొచ్చారు. గత కొద్ది వారాలుగా వలస వాదులపై అమెరికా వ్యాప్తంగా కాకుండా ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని, అందుకే దీనికి సంబంధించిన ఏదో అంశంపై మంగళవారం ట్రంప్ తన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో పాటు మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణం విషయంపై సెనేట్‌లో చర్చ జరుగుతోందని వివరించారు. నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ జైమే డోమినిగ్యూజ్ మాట్లాడారు. ట్రంప్ ప్రసంగంలో వలసదారుల విషయమై ప్రధానం ఉంటుందని ఆయన అన్నారు. డ్రీమర్స్‌కు ఊరట కల్పించే విధంగా కూడా ఏదో ఒక నిర్ణయం తీసుకుంటారని డోమినిగ్యూజ్ అన్నారు. మౌలిక సదుపాయాలు, పథకాలు, స్పీచ్ కొనసాగుతుందని ఆశిస్తున్నట్టు విద్యావేత్త, ప్రొఫెసర్ జోసెఫ్ స్పోఫర్ తెలిపారు.

ప్రపంచాన్ని చుట్టి వస్తున్న
భారత్ నావికాదళ మహిళలు

లండన్ : భారతదేశ నావికా దళంలోని మహిళా సిబ్బంది చరిత్ర సృష్టించారు. సాహస యాత్రలో భాగంగా భూగోళాన్ని చుట్టిరావడానికి నిర్ణయించుకున్నారు. ఈ బృందం ప్రస్తుతం బ్రిటీష్ సముద్ర భూభాగంలోని ఫాక్లాండ్ దీవుల రాజధాని స్టాన్లీ పోర్ట్‌కు చేరుకున్నారు. ఆరుగురు ఇండియన్ నావల్ సెయిలింగ్ వెస్సెల్ మహిళా బృందం సెప్టెంబర్ 10 ఈ సాహస యాత్రను ప్రారంభించారు. దీన్ని గోవా నుండి మొదలుపెట్టగా, 8 నెలల్లో భూగోళాన్ని చుట్టి రావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గోవా నుండి సుమారు 15వేల నాటికల్ మైళ్లు దూరం ప్రయాణించారు. ఈక్వేటర్, కేప్లివాయిన్, కేప్‌వార్న్ దాటుకుని ముందుకు వెళ్తున్నారు. ఈ బృందానికి లెఫ్టినెంట్ కమాండర్ వర్టికా జోషి వ్యవహరిస్తున్నారు. ఆమె వెంట లెఫ్టినెంట్ కమాండర్లు ప్రతిభ జాంవాల్, పి.స్వాతీ, లెఫ్టినెంట్లు ఎస్ విజయ దేవి, బి. ఐశ్వర్య, పాయల్ గుప్తా ఉన్నారు. ప్రకృతి ఎంతో అందంగా ఉంటుందని, దాన్ని సమయం ఉన్నప్పుడు ఆస్వాదించాలని లెఫ్టినెంట్ ఐశ్వర్య చెప్పారు. తన గ్రూపునకు సంబంధించిన అనుభవాలను ఆన్‌లైన్ బ్లాగుల ద్వారా ప్రపంచానికి తెలియజేస్తున్నది. వీరు ప్రయాణిస్తున్న నౌకను మేక్‌ఇన్ ఇండియాలో భాగంగా భారతీయ నావికా దళం తయారు చేసింది. 56 అడుగుల ఉండి, దీని ఐఎన్ఎస్‌వీటీ తరనీస్‌గా నామకరణం చేశారు. పసిఫిక్‌సముద్రాన్ని దాటుతున్న సమయంలో బలమైన గాలులు వీచాయని, వాతావరణం కూడా అసాధారణంగా ఉందని చెప్పుకొచ్చారు. పసిపిక్‌సముద్రాన్ని దాటడానికి సుమారు 41 రోజులు పట్టిందని వివరించారు. వాళ్ల సాహస యాత్రను రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ జెండా ఊపి ప్రారంభించినట్టు తెలిపారు. ఫిబ్రవరి 4కు సౌతాఫ్రికాలోని కేప్‌టౌన్‌కు చేరుకునేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. అక్టోబర్‌లో ఫ్రైమెంటల్, ఆస్ట్రేలియాలో ఉండగా, నవంబర్‌లో న్యూజిలాండ్, ప్రస్తుతం స్టాన్లీ పోర్టులో ఉన్నారు.



భిక్షాటన ఉద్యోగమేనా?

● నిరుద్యోగ వృద్ధికి భారత్ సాక్షి ● దిక్కుతోచని స్థితిలో సర్కార్ :చిదంబరం



న్యూఢిల్లీ: పకోడాలు అమ్మడం కూడా ఒక రకమైన ఉపాధియేనంటూ వ్యాఖ్యలు చేసిన ప్రధాని నరేంద్ర మోడీపై మాజీ ఆర్థిక మంత్రి, కాంగ్రెస్ నేత పి.చిదంబరం ఆదివారం మండిపడ్డారు. ఈ మేరకు వరుస ట్వీట్‌లు చేశారు. ఆఖరికి పకోడాలు అమ్మడం కూడా ఒక ఉద్యోగమని ప్రధాని అన్నారు. అలా చూసినప్పుడు గత్యంతరం లేని పరిస్థితుల్లో భిక్షాటనాన్ని జీవికగా చేసుకున్న పేదలు, దివ్యాంగులను ఉద్యోగులుగా లెక్కిద్దాం. వాస్తవానికి భారత్ గత మూడేళ్ళుగా నిరుద్యోగ వృద్ధికి సాక్షిగా నిలిచింది. ఉద్యోగాలు ఎలా సృష్టించాలో తెలీక ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో ఉందని చిదంబరం విమర్శించారు.

మోడీ ఇటీవల ఒకటీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో.. పకోడాలు అమ్ముకునే ఒక వ్యక్తి రోజుకు రూ.200 సంపాదించుకుంటుంటే దాన్ని ఉపాధిగా పరిగణించాలా వద్దా అని అన్నారు.

రూ.43 వేలతో ఉద్యోగ కల్పన అసాధ్యం

ఒక ఉద్యోగం అనేది కచ్చితమైనది, క్రమంతప్పకుండా ఉండేది, సహేతుకంగా భద్రమైనది. అలాంటి ఎన్ని ఉద్యోగాలను కల్పించిందీ మేం తెలుసుకోవాలనుకుంటున్నాం అని ఆయన నిలదీశారు. ముద్ర బ్యాంకు ద్వారా సగటును పొందే రూ.43,000 రుణంతో కనీసం ఒక కొత్త ఉద్యోగాన్ని సృష్టించవచ్చని చెప్పుకొచ్చారు. అంతే పెట్టుబడితో కొత్త ఉద్యోగాన్ని సృష్టించిన ఒక వ్యక్తిని నాకు చూపించండి అని చిదంబరం సవాల్ చేశారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్ఆర్ఈజీఏ) కార్మికులను కూడా ఉద్యోగులుగా లెక్కించాలని మరో మంత్రి ఆశించారని కాంగ్రెస్ సీనియర్ నేత వ్యాఖ్యానించారు. ఆ విధంగా చూస్తే వారు 100 రోజులకు ఉద్యోగులు, మిగిలిన 265 రోజులకు నిరుద్యోగులు అని ఆయన అన్నారు. వాస్తవానికి ప్రయివేట్ పెట్టుబడి, ప్రయివేట్ వినియోగం, ఎగుమతులు, రుణ గిరాకీలో వేగవంతమైన పెంపుదల ద్వారా వాస్తవిక ఉద్యోగ కల్పన ప్రతిబింబిస్తుంది. అది ఇంతవరకు జరగలేదు అని మాజీ కేంద్ర మంత్రి ట్వీట్ చేశారు.

70 లక్షల ఉద్యోగాల గాలి బుడగకు చిల్లు

2017-18 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 70 లక్షల ఉద్యోగాలంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీల గాలి బుడగకు ఇద్దరు విద్యావంతులు చిల్లుపెట్టారని అని మాజీ ఆర్థిక మంత్రి తెలిపారు. గతేడాది జులైలో భవిష్య నిధిలో 4 కోట్ల 62 లక్షలుగా ఉన్న సభ్యుల సంఖ్య సెప్టెంబర్ నాటికి 4 కోట్ల 38 లక్షలకు పడిపోయిందనే వార్తలు వచ్చాయని ఆయన చెప్పారు. ఉద్యోగాలపై చర్చ వచ్చినప్పుడు ఉద్యోగానికి, స్వయంఉపాధికి మధ్య వ్యత్యాసం చూపడం అత్యంత కీలకమని చిదంబరం సూచించారు.



తల్లులకు పూల మాల సమర్పిస్తున్న డిప్యూటీ సీఎం కడియం



గద్దెల ప్రాంగణంలో భక్తజనసందోహం



మొక్కులు చెల్లిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

మేడారంలో కడియం మొక్కులు

- తల్లుల చెంతకు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు

భూపాలపల్లి, ప్రభన్యూస్: మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతరకు కుటుంబ సభ్యులతో ఆదివారం తరలి వచ్చి తల్లులకు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయతో పాటు ఎంపీలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, బాల్క సుమన్ , సీతారాం నాయక్, పసునూటి దయాకర్, డిబి. పాటిల్, గుత్తా సుకేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆరూరి రమేష్, చల్లా ధర్మా రెడ్డి, శంకర్ నాయక్, కొండా సురేఖ, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస రెడ్డి, కొండా మురళీధర్ రావు, జెడ్పీ చైర్మన్ గద్దల పద్మ, మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణి , కన్నెబోయిన రాజయ్య యాదవ్ ,ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్, సహోదర్ రెడ్డి తదితరులు సమ్మక్క - సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు వీఐపీలు ఒకేసారి తల్లులను దర్శించు కోవడంతో సమ్మక్క - సారలమ్మ గద్దెల ప్రాంగణం సందడిగా మారింది. కొద్దిసేపు భక్తులు ఇబ్బంది పడ్డారు. అంతక ు ముందు జంపన్న వాగును సంద ర్శించి అక్కడ ఏర్పాట్లను డిప్యూటీ సీఎం శ్రీహరితో పాటు ఎంపీలు, ఎమ్మెల్యే పరిశీలించారు.





పార్టీ నేతలకు డిప్యూటీ సీఎం విందు

టీఆర్ ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లతో పాటు పార్టీ ముఖ్యమైన నాయకులకు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి మేడారంలో విందు ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎం తన మొక్కును తీర్చుకునే క్రమంలో ఆహ్వానం మేరకు తరలివచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులను పేరు పేరున పలకరించారు.

జాతర ఏర్పాట్ల పై భక్తులతో ఆరా..

మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర ఏర్పాట్లపై భక్తులతో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ముచ్చటించారు. జాతరకు వచ్చిన పలువురు భక్తులతో తెలంగాణ ఏర్పడిన తర్వాత జాతరలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఏలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. గత జారతకు రూ,160 కోట్లు, ఈ జాతరకు రూ.80 కోట్లు కేటాయించి భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జాతరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 20 లక్షల మంది భక్తులను తరలించడానికి 4,200 బస్సులను తెలంగాణ ఆర్టీసీ సంస్థ ద్వారా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ సారి జాతరకు కోటి 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారని శ్రీహరి అన్నారు. జాతరలో గతం కంటే మెరుగైన వసతులు సమకూర్చడం జరిగిందన్నారు. పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా విస్తృత సేవలు అందిస్తున్నారన్నారు. జాతరకు వచ్చిన భక్తులను పలువురిని పలుకరిస్తూ వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

పోలీసుశాఖ ప్రతిష్ఠ పెంచేలా పనిచేయండి

అధికారులు, సిబ్బందికి భూపాలపల్లి ఎస్పీ ఆదేశాలు

భూపాలపల్లి, ప్రభన్యూస్ : ప్రతిష్టాత్మక మేడారం మహాజాతరలో పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసుశాఖ ప్రతిష్ట పెంచే విధంగా పనిచేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ ఆర్.భాస్కరన్ అన్నారు. ఆదివారం భూపాలపల్లిలోని అంబేద్కర్ స్టేడియంలో రాష్ట్రవ్యాప్తంగా మేడారం బందోబస్తు కోసం తరలివచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఎస్పీ భాస్కరన్ మాట్లాడారు. పోలీసు అధికారులు సిబ్బంది, భక్తుల పట్ల దురుసుగా వ్యవహరించరాదని, అమ్మవార్ల సేవలో భక్తులు, భక్తుల సేవలో పోలీసులు అనే భావనతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. ప్రతి పోలీసు కానిస్టేబుల్‌స్థాయి నుంచి పోలీసు ఉన్నతాధికారి వరకు అంకితభావంతో పనిచేసి, జాతరను విజయవంతం చేయాలని ఎస్పీ భాస్కరన్ పిలుపునిచ్చారు. మహాజాతరలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించా లన్నారు. జాతరలో గద్దెల వద్ద ట్రాఫిక్‌లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని, అలాగే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు.

మేడారం జాతరకు మన రాష్ట్రం నుంచే కాక, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, మహ రాష్ట్రలతో పాటు వివిధ రాష్ట్రాల నుండి భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ప్రతిక్షణం భక్తుల భద్రతే ధ్యేయంగా పనిచేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీసు కమీషనరేట్ అడిషనల్ డీఎస్పీ మురళీధర్, శిక్షణ ఐపీఎస్ సాయిచైతన్య, రాష్ట్రపరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మేడారం జాతరకు జాతీయ హోదా తెస్తాం

మేడారం/ ఏటూర్‌నాగారం, ప్రభన్యూస్ : ఆసియా ఖండంలోని అతిపెద్దదైన గిరిజన మహా జాతరకు జాతీయ హోదా కల్పించాలని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని తెలంగాణ ఏంపీల బృందం స్పష్టం చేశారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం మహా జాతరకు తరలివచ్చి వనదేవతలను దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ..

కేంద్రానికి లేఖ రాశాం : సీతారాంనాయక్



దక్షిణ భారతదేశంలోని గిరిజన కుంభమేళాను తలపించే మేడారం మహాజాతరను జాతీయ పండుగగా గుర్తించాలని ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వానికి లేఖ సమర్పించడం జరిగిందని మేడారం మహా జాతర మహనీయతను తెలుసుకుని పార్లమెంట్‌లో ప్రస్తావించడం కోసం తెలంగాణ ఎంపీల బృందం మేడారాన్ని సందర్శించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వంలో జరిగిందని తెలిపారు.

భక్తులకు సకల సౌకర్యాలు



గిరిజన సంస్కృతి , సంప్రదాయ బద్ధంగా జరిగే మేడారం మహా జాతరకు హాజరయ్యే కోట్లాది మంది భక్తులకు తెలంగాణ ప్రభుత్వం రూ. 80కోట్లు మంజూరు చేసి సకల సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో మేడారం మహా జాతరకు జాతీయ హోదా సాధించి తీరుతామన్నారు.

మహా జాతర ఓ అద్భుతం



ఎన్నో యేళ్ళుగా తెలంగాణ ప్రాంతంలో జరుగు తున్న మేడారం మహా జాతర ఓ అద్భుతమని ,ఈ జాతర నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడమే కాకుండా పార్లమెంట్ సమా వేశాల్లో కేంద్రం పై ఒత్తిడి తీసుకువచ్చి మహా జాతరకు జాతీయ హోదా తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. తల్లుల దర్శనంతో తరించామని అన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తాం



దక్షిణ భారత దేశంలోనే అతి పెద్ద గిరిజన జాతరైన మేడారం మహా జాతర అభివృద్ధికి కృష చేస్తామని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మూడు సంవత్సరాల కాలంలో తెలంగాణ ప్రభుత్వం రెండు జాతరలకు రూ.240 కోట్లు మంజూరు చేసి భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైనటువంటి గిరిజన మ్యూజియం నిర్మాణం మేడారం ప్రాంగణంలో నిర్మించడమే కాకుండా నలుమూలల నుండి వచ్చే రహదారులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

తల్లుల దర్శనంతో తరించా



గిరిజనుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క -సార లమ్మలైన వనదేవతలను దర్శనంతో తరించుకు పోయా నని నల్గొండ ఎంపీ గుత్తా సుకేందర్ రెడ్డి అన్నారు. ఆది వారం అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం మాట్లా డుతూ కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తున్న ఎంపీల బృందం మహాజాతర విషయాలు జరుగబోయే పార్ల మెంట్ సమావేశంలో ప్రస్తావించి జాతీయ హోదా కోసం కృషి చేస్తామన్నారు. అదే విధంగా గిరిజన సాంప్రదాయ బద్దంగా జరిగే మహా జాతర అభివృద్దిలో భాగంగా మేడారాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం కోసం రూ.2.25 లక్షల వ్యయంతో టూరిజం శాఖ ఆధ్వ ర్యంలో హరితా హోటల్ నిర్మించడం జరిగింద న్నారు. అంచెలం చలుగా మేడారాన్ని అభివృద్ది దిశగా తీర్చిదిద్ద డానికి తెలంగాణ ముఖ్యమంత్రి సార ధ్యంలో కృషి చేయడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌక ర్యాలు కలుగకుండా ఇప్పటికే అధికా రులతో సమీక్షా ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు.

త్రిపుల్ తలాఖ్‌ను అడ్డుకోవద్దు

- సమావేశాలకు సహకరించండి
- అఖిల పక్షసమావేశంలో కేంద్రం విజ్ఞప్తి
- ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి
- బడ్జెట్‌లో కేటాయింపులు పెంచండి
- కేంద్రానికి వివిధ పార్టీల సూచనలు



- నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు
- పేద, రైతు ఆకర్షణ బడ్జెట్‌కు కేంద్రం మొగ్గు
- ఎన్డీఏ ప్రభుత్వానికిదే చివరి పూర్తిస్థాయి బడ్జెట్
- రెండు విడతలుగా బడ్జెట్ సమావేశాలు
- మొదటి విడత నేటి నుంచి ఫిబ్రవరి 9వ తేదీవరకు
- రెండో విడత మార్చి 5 నుంచి ఏప్రిల్ 6వ తేదీవరకు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కీలక బడ్జెట్ సమావేశాలు ప్రారంభ మవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, లోక్‌సభ స్పీకర్ విడి విడిగా ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశాలు వాడివేడిగా జరి గాయి. సమావేశాలు సజావుగా సాగేలా సహకరించాలని కేంద్రం అన్ని పార్టీ లనూ కోరింది. అదే సమ యంలో ఇప్ప టికే పార్లమెం టులో ప్రవే శపెట్టి, లోక్ సభలో పాస్ చేసిన త్రిపుల్ తలాఖ్ బిల్లును ఎట్టి పరిస్థి తుల్లోనూ రాజ్యసభలో కూడా పాస్ చేయించాలన్న కృత నిశ్చయాన్ని కేంద్రం వెలిబుచ్చింది. ఈ క్రమంలో ప్రతిపక్ష, తటస్థ, మిత్రపక్షాల మధ్య ఏకాభిప్రాయం తెచ్చే ప్రయత్నం కూడా చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశానికి, కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, రాజ్‌నాథ్ సింగ్, అనంత్ కుమార్ సహా ప్రతిపక్షాలు, మిత్రపక్షాల నేతలు హాజరయ్యారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్ కుమార్, చర్చలు ఫలప్రదంగా సాగాయని వెల్లడించారు. త్రిపుల్ తలాఖ్ బిల్లు పాస్ చేయడం కోసం ఏం చేసేందుకైనా కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగేందుక ు అన్ని రాజకీయ పార్టీలను సహకరించాల్సిందిగా ప్రధాని కోరారని కూడా అనంత్ కుమార్ చెప్పారు.

త్రిపుల్ తలాఖ్ బిల్లుతో పాటు ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించే బిల్లును కూడా ఈ సమావేశాల్లోనే పాస్ చేయిం చాలని కేంద్రం భావిస్తోంది. అయితే ప్రతిపక్షాలు కీలక ప్రజా సమస్యలపై చర్చకు పట్టుబడతామని తెలిపాయి. ప్రతిపక్ష పార్టీల నుంచి అఖిలపక్ష సమావేశానికి హాజరైనవారిలో మల్లికార్జున ఖర్గే (కాంగ్రెస్), ములాయం సింగ్ యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), డి. రాజా (సీపీఐ), కనిమొళి (డీఎంకే), డెరెక్ ఓబ్రెయిన్ మరియు సుదీప్ బంధోపాధ్యాయ (తృణమూల్ కాంగ్రెస్), తారిఖ్ అన్వర్ (ఎన్సీపీ)తో పాటు తెలుగుదేశం పార్టీ నుంచి సుజనా చౌదరి, తోట నరసింహం, వైకాపా నుంచి మేకపాటి రాజమోహన్ రెడ్డి, విజయసాయి రెడ్డి, టీఆర్ఎస్ నుంచి ఏపీ జితేందర్ రెడ్డి ఉన్నారు.

చేతల ప్రభుత్వం కాదు, మాటల ప్రభుత్వం

బీజేపీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన తెరాస

ప్రధాని అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశానికి హాజరైన టీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ జితేందర్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంత ృప్తి వ్యక్తం చేశారు. కేవలం హామీలు, మాటలకే పరిమితమైందని, వాటిని అమలు చేయడంలో ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వ తీరు ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు అర్థమైందని, ఇప్పటికైనా హామీలను అమలు చేయకపోతే ప్రజలే తగినరీతిలో బుద్ధి చెబుతారని జితేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. త్వరలో ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధుల కేటాయింపులో న్యాయం చేయడమే ఎజెండా అని తేల్చి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇంతకాలం హామీలతోనే సరిపెట్టిందని, రాష్ట్రానికి కేంద్రం నుంచి సుమారు రూ. 5,000 కోట్ల బకాయి నిధులు రావాల్సి ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంతోనే తమ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు ప్రభుత్వ పథకాలను విజయవంతంగా నడిపిస్తున్నారని అన్నారు. కేంద్ర నిధులు రాకపోయినా, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

ఈ బడ్జెట్‌లో విభజన చట్టంలోని హామీలకు పెద్దపీట వేస్తారని ఆశిస్తున్నామని జితేందర్ రెడ్డి అన్నారు. హైకోర్టు, బయ్యారం స్టీల్ ప్లాంట్, హార్టీ కల్చర్ యూనివర్సిటీ, ఎయిమ్స్ నిధులపై ప్రకటన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము కేంద్ర ప్రభుత్వానికి అంశాలవారిగా మద్ధతిస్తున్నా, కేంద్రం మాత్రం తమ రాష్ట్రంపై శీతకన్ను వేసిందని ఆరోపించారు. ఈ బడ్జెట్‌లోనైనా న్యాయం చేయకపోతే ప్రజలే బుద్ధిచెబుతారని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటికే తెలంగాణలో బీజేపీకి మనుగడ లేదని వ్యాఖ్యానించారు.



విభజన హామీలు, ప్యాకేజికి చట్టబద్ధతే లక్ష్యం

2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న బడ్జెట్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన కారణంగా జరిగిన నష్టాలను పూడ్చడానికి తగినరీతిలో నిధుల కేటాయింపులు ఉండాలని తెలుగుదేశం పార్టీ కేంద్రాన్ని కోరింది. తెలుగుదేశం పార్టీ తరపున ఈ సమావేశానికి హాజరైన లోక్‌సభ ఫ్లోర్ లీడర్ తోట నరసింహం, విభజన హామీలు సహా రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన ఇతర అంశాల గురించి చర్చించడానికి సమావేశాల్లో సమయం కేటాయించాలని పీఎం మోడీని కోరినట్టు వివరిం చారు. ప్రత్యేక హోదాకు బదులుగా అంటూ కేంద్రం ప్రకటించిన ప్యాకేజి కూడా అమలుకావడం లేదని, అందుకే ప్యాకేజికి చట్ట బద్ధత ఉండాలని తాము డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. పోల వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్రం త్వరితగతిన నిధులు అం దించాలని అఖిలపక్ష సమావేశంలో కోరినట్టు తెలిపారు. విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సీట్లను పెంచాలని కూడా కేంద్రానికి



గుర్తుచేశారు. ఎన్డీయే కూటమిలో భాగస్వామిగా, బీజేపీకి మిత్రపక్షంగా ఉంటున్న తెలుగుదేశం కేంద్రాన్ని అన్ని విషయాల్లోనూ సహకారం అందిస్తోందని తోట నరసింహం అన్నారు. ఈ సమావేశాల్లో కూడా ప్రజా ప్రయోజనాల బిల్లులన్నింటికీ తమ మద్ధతు కొనసాగిస్తామని, తమ పార్టీ అధినేత ఈ మేరకు ఆదేశాలు కూడా జారీ చేశారని ఆయన ప్రత్యేక హోదాపై పునరాలోచించండి

విభజన హామీలు అమలు చేయండి


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించే విషయాన్ని పునరాలోచించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అఖిలపక్ష సమా ేశంలో ప్రధానిని కోరింది. సమావేశం అనంత రం ఆ పార్టీ రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదాతో పాటు అనేక ప్రజా సమస్యలను ప్రస్తావించినట్టు తెలిపారు. రైతులకు కల్పిస్తున్న కనీస మద్ధతు ధరను గత ఏడాది కంటే పెంచాలని, ప్రతియేటా ఈ పెంపు కనీసం 20 శాతం ఉండాలని డిమాండ్ చేసినట్టు చెప్పారు. అలాగే ప్రాంతాలవారిగా కనీస మద్ధతు ధర కల్పించాలని కోరామని అన్నారు. విభజన తర్వాత ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ పూర్తిగా వ్యవసాయాధార రాష్ట్రంగా మిగిలిం దని గుర్తుచేస్తూ, రాష్ట్రంలో పారిశ్రామికాభి వృద్ధికి ఊతమిచ్చే చర్యలు చేపట్టాలని తాము ప్రధాన మంత్రిని కోరినట్టు విజయసాయి రెడ్డి వెల్లడించారు. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయడం సహా, దుగరాజపట్నం పోర్టు, విశాఖలో పెట్రో కెమికల్స్ కాంప్లెక్స్, గిరిజన విశ్వవిద్యాలయం, సెంట్రల్ యూనివర్సిటీ వంటి సంస్థలను త్వరగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విభజన హామీలన్నీ ఎన్నికల లోపు అమలు చేయాలని మోడీకి గుర్తుచేసినట్టు సాయిరెడ్డి తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు 2014 అంచనాలకు తగ్గట్టు నిధులను మొత్తం నిధులన్నీ కేంద్రం సమకూర్చాలని వైకాపా కోరింది.

రాష్ట్రసమస్యలతో పాటు దేశవ్యాప్తంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కూడా తమ పార్టీ తరపున విజ్ఞప్తిగా విజయసాయి రెడ్డి తెలియజేశారు. తాము చేసిన విజ్ఞప్తులు, సూచనలను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్ క ుమార్ నమోదు చేసుకున్నారని విజయసాయి రెడ్డి అన్నారు. పార్టీ ఫిరాయింపులను నిరోధించే చట్టం ఉన్నప్పటికీ, అందులోని లొసుగులను ఆధారం చేసుకుని ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకోవడం లేదని, ఈ నేపథ్యంలో చట్టంలోని లోపాలను సరిదిద్దుతూ సవరణలు చేపట్టాలన్న తమ డిమాండ్‌ను మరోసారి కేంద్రానికి గుర్తు చేశామని వైకాపా ఎంపీ తెలిపారు. బడ్జెట్‌కు సంబంధించి ఆర్థిక సర్వే పరిశీలించిన తర్వాత ఒక అంచనాకు వస్తామని, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక లోటు విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అవగాహన లేదని విజయసాయి రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడే విషయంలో వైకాపా రాజీపడే ప్రసక్తే లేదని ఆయన పునరుద్ఘాటించారు.



తాయిలాలు వడ్డింపులు ఎంతెంత?

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంటుకు సమర్పించనున్న 2018-19 వార్షిక బడ్జెట్‌పై దేశంలో వివిధ రంగాల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. బ్యాంకింగ్ రంగం నుంచి పౌరవిమానయాన రంగం వరకూ అన్ని వర్గాల వారూ కొత్త బడ్జెట్‌లో వడ్డింపులు, రాయితీలు ఏయే మేరకు ఉంటాయోనని ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.



రిటైల్



భారతీయ మార్కెట్‌లో రిటైల్ రంగానికి మంచి అవకాశాలు ఉన్నాయి. డిమాండ్ ఉంది. పెట్టుబడులు పెంచేందుకు అవకాశాలు ఉన్నాయి. పెట్టుబడుల్లో కొత్తదారులకు అవకాశాలు ఉన్నాయి. డిజిటల్ సాంకేతికతను ఉపయోగించుకోవడానికి, ఈ కామర్స్‌ని ఉపయోగించుకోవడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

సవాళ్ళు: సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం, సరఫరా వ్యవస్థ వృద్ధి కాకపోవడంతో ఖర్చులు పెరుగుతున్నాయి. అసమర్థతత బయటపడుతోంది. రియల్ ఎస్టేట్ రేట్లు పెరిగిపోవడంతో లాభాలకు గండి పడుతోంది.
- పెద్ద కరెన్సీ రద్దు ప్రభావం విక్రయాలపై స్పష్టంగా ఉంది.
- జీఎస్‌టీపై సానుకూలత ఉన్నా, ప్రస్తుతం ఉన్న స్టాక్‌లపై రుణాలపైనా, లాభాలకు సంబంధించిన నిబంధనలపైనా స్పష్టత లేకపోవడం.
- జీఎస్‌టీ రేట్లలో పదేపదే మార్పులు చేయడం వల్ల బదిలీలకు దెబ్బ తగిలింది. కొన్ని కేసుల్లో ఎక్కువ ధరలు పడ్డాయి.
- నైపుణ్యం కలిగిన కార్మికులు, ఉద్యోగుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. యాజమాన్య, నిర్వహణ స్థాయిల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోంది.
- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐల) విధానంలో పెక్కు సడలింపులు జరిగినప్పటికీ, రెగ్యులేటరీ సంస్థలు ఎక్కువగా ఉండటం వల్ల నిర్ణయాలు మందకొడిగా జరుగుతున్నాయి.
- రిటైల్ రంగంలో నూరు శాతం ఎఫ్‌డీఐలను అనుమతించడం వల్ల కిరాణ దుకాణాల యజమానులు తమ బతుకుతెరువు దెబ్బతింటుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

ఆశిస్తున్నవి: మౌలిక సదుపాయాలు వృద్ధి కావాలి. గ్రామాలపై దృష్టి కేంద్రీకరించాలి.
- వినియోగదారులు ఎక్కువగా ఉపయోగించే వస్తువులపై జీఎస్‌టీ రేట్లు తగ్గించాలి. బదిలీ రుణం, యాంటీ ప్రాఫిటీరింగ్‌పై స్పష్టత ఇవ్వాలి. ధరలు తగ్గేందుకు అవకాశం ఉంటుంది.
- 2018 బడ్జెట్‌లో ఆదాయం పన్ను రాయితీలు ఉండాలి. ముఖ్యంగా, ఉపాధిని పెంచే రంగాల్లో ఇవి తప్పనిసరిగా ఉండాలి.
- నైపుణ్యం కలిగిన వారు తగినంత మంది లేనందున ప్రైవేటు సంస్థలలో పనిచేసే వారికి శిక్షణిచ్చే కార్యక్రమాలు ప్రవేశపెట్టాలి.
- సులభతర వాణిజ్యానికి తీసుకునే చర్యలపై స్పష్టత ఇవ్వాలి. ముఖ్యంగా, రిటర్న్‌లు దాఖలు చేయానికి గడువు మొదలైన అంశాలపై స్పష్టత ఉండాలి. సకాలంలో రిటర్న్‌లు దాఖలు చేయని వారికి జరిమానా నిబంధనలను సడలించాలి.
- చిన్న వర్తకులు, విదేశీ పెట్టుబడిదారులకూ మధ్య సాంకేతిక, వనరుల సంయుక్త వినియోగంపై ఒప్పందాలు స్పష్టంగా ఉండాలి.
- జీఎస్‌టీ నిబంధనలు స్పష్టంగా ఉండాలి. ముఖ్యంగా ఐటీ, మౌలిక సదుపాయాల రంగానికి సంబంధించి జీఎస్‌టీ నిబంధనలు స్పష్టంగా ఉండాలి.

ఆరోగ్య రక్షణ



డిజిటల్, ఆధునిక సాంకేతిక ప్రమాణాల ద్వారా ఆరోగ్య రక్షణలో భారత్ తన లక్ష్యాలను సాధించగలదు. ఇందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు జరగాలి. ఇందుకు సంబంధించిన కార్యక్రమాలపై గట్టి నిఘా, పర్యవేక్షణ ఉండాలి. ఆరోగ్య రక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాలను సమన్వయ పర్చాలి.

సవాళ్ళు: 2017-18లో ఆరోగ్య రక్షణపై మన దేశం జీడీపీలో 0.1 శాతం మాత్రమే ఖర్చు చేసింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఆరోగ్య రక్షణపై 7 నుంచి 12 శాతం ఖర్చు చేస్తున్నారు.
- పౌష్టికాహార లోపం, వాయు కాలుష్యం, కలుషిత జలాలు, పారిశుద్ధ్యం పట్ల సరైన అవగాహన లేకపోవడంతో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.
- జాతీయ పౌష్టికాహార మిషన్‌కు మరిన్ని నిధులు కేటాయించాలి.
- వైద్య సౌకర్యాలు అందుబాటులో సామాన్యులు భరించగల స్థాయిలో ఉండాలి. వైద్య పరికరాల ధరలపై అదుపు ఉండాలి.
- ఆరోగ్య బీమా పథకాలు తక్కువ స్థాయిలో అమలు అవుతున్నాయి.

ఆశిస్తున్నవి: ఆరోగ్య రక్షణ, సేవలను జీఎస్‌టీ నుంచి మినహాయించాలి.
- విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పరికరాలపై సుంకాలు తగ్గించాలి.
- పన్ను పరిధిలోకి రాని మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ. 50,000లకు పెంచాలి.
- మెడికల్ ఇన్స్యూరెన్స్ పాలసీటరమ్‌ని ఏడాదిగా పరిగణించాలి.
- హెల్త్ ఇన్స్యూరెన్స్ పథకాలకు ఆదాయం పన్ను చట్టంలోని 80డి కింద మినహాయింపులు ఇవ్వాలి. సాధారణ పౌరులకు రూ. 40,000లు, వృద్ధులకు రూ. 50వేల వరకూ అనుమతి ఇవ్వాలి.
- హెల్త్ చెక్‌అప్‌లపై పన్ను మినహాయింపు ఇవ్వాలి

వినియోగ, పారిశ్రామిక ఉత్పత్తులు




పన్ను చెల్లింపుదారులకు అనుకూలమైన విధానం, పారదర్శక జీఎస్‌టీ విధానం ఉండాలి. మౌలిక సదుపాయాలు, గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యాలపై దృష్టిని కేంద్రీకరించాలి.

సవాళ్ళు: వినియోగ వస్తువులను ఉత్పత్తి చేసే కంపెనీలపై జీఎస్‌టీ ప్రభావం వల్ల సరఫరాలు అంతంత మాత్రంగా ఉన్నాయి.
- వినియోగదారుల నుంచి గిరాకీ ఆశించిన స్థాయిలో పెరగడం లేదు.
- తయారీ రంగం మందకొడిగా సాగుతోంది.

ఆశిస్తున్నదేమిటి ?: జీఎస్‌టీ వల్ల ఒనగూరిన ఫలితాలను వినియోగదారులకు బదిలీ చేయాలి. దాంతో డిమాండ్ పెరుగుతుంది.
- వ్యవసాయ ఉత్పత్తుల సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేయాలి. ధరల ఒడిదుడుకులను తట్టుకునేట్టు ఉండాలి.
- లాభాలు దండుకునే వారిపై నిఘా ఉండాలి.
- మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెరిగేట్టు చూడాలి.
- సరఫరా వ్యయాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

లైఫ్ సైన్సెస్



ప్రభుత్వం అమలుజేస్తున్న సానుకూల విధానాల వల్ల స్వదేశీ ప్రైవేట్ ఫార్మా కంపెనీలు జనరిక్ మందుల సంస్థలు సురక్షితమైన, తక్కువ ధరకు లభించే మందులను తయారుచేస్తున్నాయి.

సవాళ్ళు: స్థానిక ఆవిష్కరణలను నిరుత్సాహ పరుస్తున్నారు.
- మధుమేహం, గుండె జబ్బుల వారికి పన్ను రాయితీలు ఇవ్వాలి.
- పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించాలి. జనరిక్ ఔషధాలను తయారుచేయడాన్ని ప్రోత్సహించాలి.
- ఔషధ పరిశ్రమ రంగంలో భారతీయ సంస్థలకు ప్రోత్సాహం ఇవ్వాలి.

ఆశిస్తున్నదేమిటి ?: విదేశాల నుంచి వచ్చే పేటెంట్ రాయల్టీలకు రాయితీతో కూడిన పన్ను రేట్లు ఉండాలి.
- ఈ రాయితీలను నోహౌకి, కాపీరైట్‌లకు, ట్రేడ్ మార్క్‌లకు వర్తింపజేయాలి.
- పేటెంట్‌ల రక్షణ, మార్కెటింగ్‌లపై అయ్యే ఖర్చుల్లో ముదరా ఇవ్వాలి.
- వైద్యులకు చెల్లింపులపై అయ్యే ఖర్చులపై పన్ను రాయితీ ఇవ్వాలి.

పబ్లిక్ ఫైనాన్స్



ఆర్థిక స్థిరీకరణపై 2018 బడ్జెట్ దృష్టిని కేంద్రీకరించవచ్చు. వృద్ధికి అవసరమైన నిధులు విడుదల చేయవచ్చు.

సవాళ్ళు: ద్రవ్య లోటును 3 శాతానికి తగ్గించాలి. రెవిన్యూ లోటును 1.6 శాతానికి తగ్గించాలి.

ఆశిస్తున్నవి: నిబంధనల ప్రాతిపదికగా ఆర్థిక విధానాన్ని పర్యవేక్షించేందుకు ఒక మండలిని ఏర్పాటు చేయాలి.
- పన్నుల సంస్కరణల కమిషన్ చేసిన సూచనల మేరకు వ్యవస్థల్లో మార్పులు, పన్ను చెల్లింపుదారులకు అందించే సేవల్లో మెరుగుదల ఉండేట్టు చూడాలి. ఇందుకోసం కమ్యూనికేషన్ టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి.
- వనరులను సమీకరించేందుకు, పాలనను మెరుగుపర్చేందుకు శ్రద్ధ తీసుకోవాలి. వాటాల విక్రయం ద్వారా వనరులను సమీకరించుకోవాలి.

ఈ- కామర్స్



దేశంలో ఈ కామర్స్ మార్కెట్ 2018లో 40 బిలియన్ డాలర్లకు చేరవచ్చని అంచనా. అత్యుత్తమ విధానం, ఆర్థిక మద్దతు, ముఖ్యంగా, జీఎస్‌టీ ప్రభావం ఈ రంగంలో వృద్ధిని నిర్ధారించనుంది.

సవాళ్ళు: వినియోగదారుల్లో అధికసంఖ్యాకులు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి ఇప్పటికీ డిజిటల్ లావాదేవీలు అందుబాటులోకి రాలేదు.
- ఈ కామర్స్‌కి రవాణా ఖాతా 2 నుంచి 10 శాతం అవుతుంది.
- ఈ రంగానికి సంబంధించి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానం ఇంకా రూపుదిద్దుకుంటోంది.
- ఈ కామర్స్ ఏ విధంగా ఉండాలి, దాని పరిధులు ఏమిటి అనే అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ కామర్స్ లావాదేవీలకు సంబంధించి ముఖ్యంగా, విదేశీ సంస్థలతో లావాదేవీలకు సంబంధించి ఇంకా స్పష్టత ఏర్పడలేదు.
- వస్తు, సేవా పన్ను ప్రవేశపెట్టిన తర్వాత అదనపు అవసరాలను గుర్తుచేస్తోంది.
- స్టాక్‌ల బదిలీలపై అదనపు జీఎస్‌టీ వల్ల పని నడిపించేందుకు అవసరమైన మూల నిధి అంతంత మాత్రంగా ఉంది.
- పన్ను చెల్లింపుదారులను చిక్కులు, లాంఛనాలతో కూడిన తతంగాల నుంచి విముక్తం చేయడానికి రూపొందించిన సమీకృత పథకం ఈ కామర్స్‌కు అందుబాటులో లేదు.
- క్యాష్ బ్యాంక్ పథకాలు, గిఫ్ట్ కూపన్లు, ఓచర్లపై పన్నుల విధానానికి సంబందించి స్పష్టత లేదు.
- జీఎస్‌టీతో వచ్చే ఆదాయం వినియోగదారులకు చేరేట్టు చూడాలని చట్టం నిర్దేశిస్తున్నప్పటికీ, అనుసరించాల్సిన విధానంపై స్పష్టత రాలేదు.

ఆశిస్తున్నవి:
- నగదు రహిత లావాదేవీలకు ప్రోత్సాహకాలు
- టైర్లపై జీఎస్‌టీని తగ్గించి రవాణా వ్యయం తగ్గేట్టు చూడటం.
- కిరాణా దుకాణాలు, విదేశీ వాణిజ్య సంస్థల మధ్య సాంకేతిక, వనరుల ప్రోత్సాహక ఒప్పందాలు తేల్చాలి.
- ఈ కామర్స్ లావాదేవీలను ఏ విధంగా జీఎస్‌టీ కింద పరిగణిస్తారో స్పష్టత ఇవ్వాలి.

విమానయానం



దేశంలో విమానయానం చేసే ప్రయాణికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. 2017 ఆర్థికసంవత్సరంలో వారి సంఖ్య 104 మిలియన్లకు పెరిగింది. అంతకుముందు సంవత్సరం కంటే అది 22శాతం ఎక్కువ. ఈ పెరుగుదల వల్ల ప్రస్తుత విమానాశ్రయాలపై ఒత్తిడి పెరుగుతోంది.

సవాళ్ళు: దేశంలో 40 పెద్ద విమానాశ్రయాలు ఉన్నాయి. దశాబ్ద కాలంలో వీటి సామర్థ్యం మరింత పెరగవచ్చు. ముంబై, చెన్నై విమానాశ్రయాలైతే చెప్పనవసరం లేదు.
- విమానాశ్రయాల్లో భద్రత, వసతులు పెంచేందుకు తీసుకునే చర్యలపై ప్రణాళికలేవీ లేవు. సేవల్లో నాణ్యతను పెంచేందుకు చర్యలేమిటో స్పష్టత లేదు.

ఆశిస్తున్నవి: - విమానాశ్రయాల సామర్థ్యాన్ని పదిహేనేళ్ళ వ్యవధిలో మూడు లక్షల కోట్లతో పెంచాలి.
- విమానాల ఇంధనం టర్బైన్ పై వ్యాట్‌ని ఒక శాతం తగ్గించాలి.
- ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో విమానాశ్రయాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు రంగానికి అప్పగించాలి. ఎయిర్ స్ట్రిప్‌లు, విమానాశ్రయాల అభివృద్ధి పనులను ప్రైవేటురంగానికి అప్పగించాలి.
- సాంకేతిక, సేవారంగాల సిబ్బంది నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
- అంతరిక్ష విమాన రంగ విడిభాగాల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
- మరిన్ని దేశాలకు ఈ వీసాల ప్రోత్సాహకాలను పెంచాలి.
- ఇంధన సామర్థ్య విమానాశ్రయాలను ప్రోత్సహించాలి.
- విమానాశ్రయాల నిర్వహణ, సర్వీసుల నిర్వహణకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పద్దతి అమలు చేయాలి.
- పౌర సేవలకు డ్రోన్‌ల వినియోగానికి మార్గదర్శకాలను ఖరారు చేయాలి.

అంతరిక్ష వైమానికం, రక్షణ



రక్షణ రంగానికి సంబంధించి ప్రపంచంలో ఎక్కువ ఖర్చు చేస్తున్న దేశాల్లో భారత్ ఐదవది. 2016లో 55.9 బిలియన్ డాలర్లను ఖర్చు చేయడం జరిగింది. ప్రపంచంలోని అన్ని దేశాల్లో రక్షణావసరాలకు దిగుమతులు చేసుకునే దేశాల్లో అతి పెద్దది.

సవాళ్ళు: దేశంలో రక్షణ పరికాలు, యంత్రాల్లో 15 శాతం అలంకార ప్రాయమైనవి. 50 శాతమే వాడుకలో ఉన్నాయి.
- రక్షణ శాఖ ఆయుధాల సేకరణకు అనుసరించే ప్రక్రియ కాలహరణంతో కూడినది.
- తయారీ రంగం వృద్ధికాకపోవడం వల్లే దిగుమతులపై ఎక్కువ ఆధారపడాల్సి వస్తోంది.
- విదేశీ రక్షణోత్పత్తి కంపెనీలు సంయుక్త రంగంలో ఈక్విటీ పెట్టుబడులకు ముందుకు వస్తాయి.

ఆశిస్తున్నదేమిటి ?: పరికరాల తయారీలో అంతర్జాతీయంగా వివిధ దేశాల సంస్థల భాగస్వామ్యం కోసం వంద శాతం ఎఫ్‌డీఐలను అనుమతించాలి. సాంకేతిక పరిజ్ఞానం బదిలీని వేగిర పర్చడానికి ఇది అత్యవసరం.
- విదేశీ కంపెనీలతో సాంకేతిక బదిలీ విషయమై ఒప్పందాలు చేసుకునే ప్రైవేటు సంస్థలకు పన్ను మినహాయింపు ఇవ్వాలి.
- నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రోత్సాహం ఇవ్వాలి. పన్నుల హేతుబద్ధీకరణ చేయాలి.
- పరిశోధన అభివృద్ధి రంగాల్లో చేసే ఖర్చుకు పన్ను మినహాయింపు ఇవ్వాలి.
- కొత్త ప్లాంటుల్లో పెట్టుబడులకు లేదా యంత్రాలకు పదిహేను శాతం పన్ను తగ్గించాలి.
- రక్షణోత్పత్తుల సేకరణ వ్యయం తగ్గేందుకు మినహాయింపులు ఇవ్వాలి. జిఎస్‌టిని తగ్గించాలి.
- రక్షణోత్పత్తుల రంగానికి మౌలిక సదుపాయ హోదా ఇవ్వాలి. వివిధ రాయితీలు పొందేందుకు, టాక్స్ హాలీడే సౌకర్యం పొందేందుకు ఇది ఉపయోగపడుతుంది.

రవాణా రంగం




భారతదేశం వృద్ధికి ముఖ్యమైన రంగాల్లో రవాణా రంగం ఒకటి. ప్రాంతీయ ఎయిర్ లైన్ కనెక్టివిటీపై దృష్టిసారించాలి. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలి.

సవాళ్ళు: వచ్చే ఐదేళ్ళలో ఏడు లక్షల కోట్ల వ్యయంతో 88,677 కిలోమీటర్ల మేర రోడ్లను విస్తరింపజేయాలని కేంద్రం సంకల్పించింది.
- దేశంలోని పెక్కు నగరాల్లో ప్రజారవాణా వ్యవస్థ పటిష్టంగా లేకపోవడం వల్ల ప్రైవేటు వాహనాల సంఖ్య పెరుగుతోంది.

ఆశిస్తున్నదేమిటి ?: మౌలిక సదుపాయాల కంపెనీలు నిర్మాణ సమయంలో కాకుండా, సర్వీసుల నిర్వహణలో వచ్చే ఆదాయంపైనే పన్నులు వేయాలని కోరుతున్నాయి.
- ఎక్కువ వేగం గల రైలు మార్గాలు నిర్మించాలి.
- భారతీయ రైల్వేలు దేశంలో రైల్వేస్టేషన్లను అభివృద్ధి పర్చాలి.
- రేవులు, టోల్, ఇంధన రిటైల్ అవుట్ లెట్‌ల వద్ద చెల్లింపులు సక్రమంగా జరిగేట్టు తగిన వ్యవస్థలు ఉండాలి.
- ప్రజారవాణాను ప్రోత్సహించాలి.
- జాతీయ పట్టణ రవాణానిధిని ఏర్పాటు చేయాలి.
- 2030 నాటికి వాహనాల విద్యుద్దీకరణ వంద శాతం జరిగేట్టు చర్యలు తీసుకోవాలి.

ఇంధనం, వనరులు



మన దేశం క్రూడ్ ఆయిల్ వినియోగంలో ఆసియాలో మూడవ అతి పెద్ద దేశం. ఈ రంగంలో మౌలిక సదుపాయాలు పెంపుపైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయి.

సవాళ్ళు: మైనింగ్ రంగం రిస్క్‌తో కూడింది. భారీ పెట్టుబడులు పెట్టినా ఫలితాలు ఇవ్వని గనులు ఉంటాయి.
- ఆర్థికాభివృద్ధి మందగమనం, తగ్గిన గిరాకీ ఈ రంగాన్ని దెబ్బతీసింది.
- ఇంధనం దిగుమతులపై ఎక్కువ ఆధారపడద్దన్న ప్రధాని మోడీ విజన్‌ని సాకారం చేసేందుకు ప్రైవేటును ప్రోత్సహించాలి. చమురు, గ్యాస్ అన్వేషణలో ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించాలి.

ఆశిస్తున్నదేమిటి ?: కార్పొరేట్ పన్ను రేటును 30 నుంచి 25 శాతానికి తగ్గించడం
- కనీస ప్రత్యామ్నాయ పన్నును పూర్తిగా రద్దుచేయడం, మౌలిక, ఇంధన కంపెనీల పన్ను రిటర్న్‌లను సమీకృతం చేయడం

చమురు, గ్యాస్



భారతదేశంలో ఇంధన వినియోగం 2035నాటికి 4.2 శాతానికి పెరుగగలదని బీపీ ఎనర్జీ అవుట్‌లుక్ పేర్కొంది. ప్రపంచంలోని ఇతర అభివృద్ధి చెందిన దేశాలన్నింటికన్నా, భారత్‌లో వినియోగం పెరగగలదని పేర్కొంది.

సవాళ్ళు: 2019 మార్చి నాటికి దేశమంతటా 24గంటల విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.
- ఇంధనరంగంలో పెట్టుబడులను సమీకరించడం.

ఆశిస్తున్నదేమిటి ?:
- ఈఅండ్‌పి ఆపరేషన్లకు వ్యాట రేటును బాగా తగ్గించాలి.
- పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్‌టీ పరిధిలోకి తేవాలి.

మీడియా, వినోదం



మీడియా, వినోద మార్కెట్ 2016లో 20.5 బిలియన్ డాలర్లుగా అంచనా వేయడం జరిగింది. అంతర్జాతీయంగా మనదేశం రెండవ అతిపెద్ద టెలివిజన్ మార్కెట్‌ని కలిగి ఉంది. ప్రపంచంలోనే అత్యధిక చలన చిత్రాలు నిర్మాణమవుతున్నది మన దేశంలోనే.

సవాళ్ళు: ప్రసారరంగం నిలదొక్కుకోవడానికి సాయం అందలేదు. ఇంటర్నెట్ వంటి సంస్థల మాదిరిగా కాపీరైట్, ఇతర కేసుల నుంచి రక్షణకు కలిగిఉన్న సదుపాయాలు ఈ రంగానికి లేవు. ప్రేక్షకుల సంఖ్య అమెరికా, చైనాలతో పోలిస్తే మన దేశంలో చాలా తక్కువే.
- సినిమా లైసెన్స్‌ల కోసం పాటించాల్సిన నియమనిబంధనలను 1952 నుంచి అవే కొనసాగిస్తున్నారు.

ఆశిస్తున్నదేమిటి ?:
ప్రసారరంగాన్ని పరిశ్రమగా గుర్తించాలి.
- క్లియరెన్స్‌లకు సింగిల్ విండోని ఏర్పాటు చేయాలి.
- కొత్త మల్టీప్లెక్స్‌లకు టాక్స్ హాలీడే ఇవ్వాలి.
- సినిమా టికెట్లపై స్థానిక ప్రభుత్వాల పన్నుతో పాటు జీఎస్‌టీ కూడా ఉంది. దీనిని నిలిపి వేయాలి. ఆ దామాషాలో జీఎస్‌టీని తగ్గించాలి.

బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్



ఆర్థిక సేవల రంగంలో వ్యవస్థీకృత మార్పులు రావాలి. మూలనిధి, రీఫైనాన్సింగ్ పరపతి పెరగడానికి పరిష్కారాలు కనుగొనాలి.

సవాళ్ళు: బ్యాంకుల ఆదాయం అంతా టీఎస్‌ఎస్‌లను బట్టే ఉంటుంది. దీంతో టీడీఎస్ సర్టిఫికెట్లు పెరిగిపోతున్నాయి.
- ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్‌లలో నెలకొల్పిన యూనిట్లకు మ్యాట్ రేట్ 9 శాతం లభిస్తోంది. ప్రపంచ మంతటా ఇలా లేదు. దుబాయ్‌లో జీరో శాతం, మలేసియాలో 3శాతం మాత్రమే లభిస్తోంది.

ఆశిస్తున్నదేమిటి ?: ఎన్‌బిఎఫ్‌సిలను బ్యాంకులతో సమానంగా పరిగణించాలి.
- అందరికీ టీడీఎస్ మినహాయింపు వర్తింపజేయాలి.
- ఐఎఫ్ ఎస్‌సీలలో యూనిట్లకు మ్యాట్ రద్దుచేయాలి. టాక్స్ హాలీడేస్ పెంచాలి.

తయారీ రంగం



2025నాటికి తయారీ రంగం ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుకోగలదని అంచనా. అంటే జీడీపీలో 25 నుంచి 30 శాతం అన్న మాట. 90 మిలియన్ల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా.

సవాళ్ళు: స్వదేశీ మార్కెట్‌లో వినిమయతత్వం పటిష్ఠం కావాలి. అత్యున్నత నైపుణ్యం, తక్కువకు లభించే మానవ వనరులు వృద్ధి కావాలి.
- పరోక్ష పన్నుల సంబంధిత సమస్యలను పరిష్కరించాలి.

ఆశిస్తున్నదేమిటి ?: పన్నుల సరళీకరణ, పెండింగ్‌లో ఉన్న పన్నుల కేసులు వేగంగా పరిష్కరించడం.
- పన్ను చెల్లింపుదారులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను అమలు జేయడం.
- మ్యాట్ రేట్‌ని తగ్గించడం.



ఎన్టీఆర్



విక్రమార్కుడు కోవలో అనుభూతినిచ్చే టచ్ చేసి చూడు

- వి.వి.వినాయక్

రవితేజ చాలా ఎనర్జీతో టచ్ చేసి చూడు చిత్రం చేశారు. సినిమాలోని రెండు రీళ్లు నేను చూశాను. విక్రమార్కుడుం సినిమా చూసి ఎలాంటి అనుభూతి చెందుతామో..ఈ సినిమా చూసినపుడు కూడా అలాంటి అనుభూతికి గురవుతాం అని వి.వి.వినాయక్ అన్నారు. రవితేజ, రాశిఖన్నా, సీరత్‌కపూర్ నాయకానాయికలుగా విక్రమ్ సిరికొండ దర్శకత్వంలో లక్ష్మీనరసింహ ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ సంయుక్తంగా నిర్మించిన టచ్ చేసి చూడు చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.వి.వినాయక్ ఆడియో సీడీలను విడుదలచేసిన అనంతరం మాట్లాడుతూ, ఈ చిత్ర నిర్మాతలతో నాకు మంచి అనుబంధం ఉంది. చిత్ర దర్శకుడు విక్రమ్ నాతో కలిసి పనిచేశాడు. అతనెంతో అద్భుతంగా చిత్రాన్ని మలిచాడు. రవితేజ వయసు పెరగకుండా తగ్గుతూ వస్తోంది. ఇందులో కూడా తను గొప్ప అభినయాన్ని కనబరిచారు అని అన్నారు. రవితేజ మాట్లాడుతూ, జామ్ 8 వీనులవిందైన సంగీతాన్ని అందించారు. ఫైట్స్ మాస్టర్స్ అంతా మంచి యాక్షన్ ఎపిసోడ్స్‌ను కంపోజ్ చేశారు. రాశిఖన్నా, సీరత్‌కపూర్‌ల అందం, అభినయం ఈ చిత్రానికి ఓ ఆకర్షణగా నిలుస్తుంది. నిర్మాతలకు బాగా డబ్బులు రావాలని కోరుకుం టున్నాను. దర్శకుడు విక్రమ్ స్పష్టతతో సినిమాను ఎంతోబాగా తీశారు. ఈ సినిమా విజయం సాధిస్తే ఆ క్రెడిట్ విక్రమ్‌కే చెందుతుంది అని అన్నారు.

దర్శకుడు విక్రమ్ సిరికొండ మాట్లాడుతూ, వినాయక్ నాకు ఫిల్మ్ గురువు. ఆయన నుంచి చాలా మంచి విషయాలు నేర్చుకున్నా. వక్కంతం వంశీ అద్భుతమైన కథను అందించారు. సంగీతాన్ని అందించిన జామ్ 8, నేపథ్య సంగీతాన్ని అందించిన మణిశర్మకు ధన్యవాదాలు. చోటాగారు నేను స్ఫూర్తి చెందేలా చేశారు. ఎనర్జీని తన నుంచి మరొకరికి ఇచ్చే వ్యక్తి రవితేజగారు. మనిషి జీవితంలో అద్భుతాలు జరుగుతుం టాయి. నా జీవితంలో జరిగిన అద్భుతం మాస్ మహారాజ్‌తో సినిమా చేయడం. టైటిల్‌లో ఎంత పవర్ ఉందో... సినిమాలో కూడా అంతే పవర్ ఉంటుంది. మంచి సందేశం కూడా ఉంది అని అన్నారు. చిత్ర నిర్మాతలతో పాటు ఇంకా ఈ కార్యక్రమంలో సి.కిరణ్, హరీష్‌శంకర్, వక్కంతం వంశీ, చోటా కె.నాయుడు, చిత్ర కథానాయికలు రాశిఖన్నా, సీరత్ కపూర్, కొడాలి వెంకటేశ్వరరావు, రామ్, లక్ష్మణ్, కాసర్ల శ్యామ్, ఆకాష్ సేన్‌గుప్తా, కౌశల్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

యంగ్ టైగర్ ఎన్టీఆర్ తన కొత్త చిత్రానికి అంతా సిద్ధం చేసుకుంటున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఆయన తాజా సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి ముహూర్తం కూడా పూర్తయింది. పూర్వ నిర్మాణ కార్యక్రమాలు తుది దశకు వచ్చాయి. అతి త్వరలోనే ఎన్టీఆర్ సెట్స్ మీదకు వెళ్లేందుకు

సెట్స్ మీదకు అంతా సిద్ధం...!

సిద్ధమవుతున్నారు. ప్రతి చిత్రానికి కొత్తగా కనిపించేందుకు ప్రయత్నించే ఎన్టీఆర్ ఈ సినిమాలోనూ విభిన్నమైన లుక్‌లో తెరపైకి వస్తారని సమాచారం. కథలో లీనమై నటించేందుకు తగినంత స్ఫూర్తి ఈ గెటప్‌లోనే కనిపిస్తుందని ఎన్టీఆర్ నమ్మకం. ఇటీవల సినిమా జై లవకుశలో మూడు పాత్రల్లో భిన్నంగా కనిపించారు. హారికా హాసినీ క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ ఇంకాస్త సన్నబడుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా శరీరాకృతిలో ఆకట్టుకునేలా కసరత్తులు చేస్తున్నారట. బాలీవుడ్‌లో పేరున్న ఫిట్‌నెస్ ట్రైనర్ ఒకరు సినిమా పూర్తయ్యేవరకు ఎన్టీఆర్‌కు శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. కథలో ఎన్టీఆర్ సైనికుడి పాత్రను పోషిస్తున్నట్లు తెలుస్తోంది. కథలో త్రివిక్రమ్ తరహా వినోదపాళ్లు, యంగ్ టైగర్ ప్రభావవంతమైన నటన ఉంటుందని సమాచారం.



కాజల్

వ్యోమగామిలా వారి అంతరిక్షంలో విహరించాలని బాల్యంలో కలగన్నానని కాజల్ తెలిపింది. నాయిక కావడంతో చిన్నప్పటి లక్ష్యం నెరవేరలేదని చెప్పింది. అయితే నటిగా సంతృప్తిగా, సంతోషంగా ఉన్నానంటోంది అందాల జాబిలి.

అదంతా నా అదృష్టం

ప్రోత్సాహంతోనే ఇప్పుడిలా అగ్రతారగా స్థిరపడ్డానంది. దశాబ్దంన్నరగా దక్షిణాదిలో పేరున్న నాయికగా కొనసాగుతోంది కాజల్ అగర్వాల్. తమిళం, తెలుగులో చెప్పుకోదగిన విజయాలు సాధించింది. ప్రస్తుతం కళ్యాణ్ రామ్ సరసన ఎమ్మెల్యే అనే సినిమా, నాని నిర్మాతగా వస్తున్న ఆ..!తో పాటు క్వీన్ చిత్ర తమిళ రీమేక్ పారిస్ పారిస్‌లో నటిస్తోంది. ఈ చిత్రంలో ప్రపంచాన్ని తెలుసుకునేందుకు ప్రయాణించే పాత్రను పోషిస్తోంది కాజల్. ఇది తన నిజ జీవితానికి పూర్తి భిన్నమైన పాత్ర అంటోంది కాజల్. చిన్నప్పటి నుంచి కోరుకున్న ప్రాంతానికి వెళ్లిన తాను...లోకం చూడని అమ్మాయి పాత్రలో నటించాల్సి రావడం సవాలుగా ఉందని చెబుతోంది. కాజల్ మాట్లాడుతూ.....వ్యోమగామి కావాలన్నది నా చిన్నప్పటి కల. అయితే నాయిక కావడం వల్ల అది నెరవేరలేదు. నటిగా లక్షలాది మంది ప్రేక్షకుల అభిమానం పొందడం అదృష్టంగా భావిస్తున్నాను. గతేడాది మంచి విజయాలతో గడిచింది. ఎన్నో జ్ఞాపకాలు మిగిల్చింది. ప్రస్తుతం విభిన్నమైన చిత్రాల్లో నటిస్తున్నాను. వాటిలో క్వీన్ తమిళ రీమేక్ నాకొక సవాలు లాంటి సినిమా. తెరపై కనిపించడాన్ని ఎప్పుడూ ఆస్వాదిస్తాను. అని చెప్పింది.

ఇంటిలిజెంట్ కోసం ఎదురుచూస్తున్నా

- ప్రభాస్



ఇంటిలిజెంట్ సినిమాలో నాకెంతో ఇష్టమైన పాట చమకు చమకు ఛాం...చిరంజీవిగారి పాటల్లో అద్భుతమైన పాట అది. ఆ పాటలో ఆయనెంతో గొప్పగా డ్యాన్స్ చేశారు. ఆ పాటను ఈ చిత్రం కోసం రీమిక్స్ చేశారు. దానిని సాయిధరమ్‌తేజ్ ఎలా చేశాడోనని ఆతృతగా ఎదురు చూస్తున్నాను అని హీరో ప్రభాస్ అన్నారు. సాయిధరమ్‌తేజ్, లావణ్యత్రిపాఠి నాయకానాయికలుగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రంలోని మొదటి పాటను ఆదివారం సాయంత్రం హీరో ప్రభాస్ ఆవిష్కరించారు. లెట్స్ డు అంటూ వచ్చే ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యాన్ని అందించగా...తమన్ సంగీతాన్ని సమకూర్చారు.

ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ, పాట విడుదల చేయాలని వినాయక్‌గారు మొహమాటపడుతూ పిలిచారు. ఆయన ఒక మెసేజ్ చేస్తే చాలు ఏ ఫంక్షన్‌కు అయినా, ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను. నా కెరీర్‌లో యోగి సినిమాకు చేసినంత ఎంజాయ్ ఏ సినిమాకు చెయ్యలేదు. వినాయక్‌గారు బాగా సుఖపెట్టేస్తారు అని రాజమౌళిగారితో చెప్పాను. ఆయన సుఖ పెట్టకూడదు. ఇంకా మేం చాలా కష్టపడాలి. తేజ్ సాహో షూటింగ్‌కు వచ్చాడు. వినాయక్‌గారితో చేయడం చాలా లక్కీ అని చెప్పాను. ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ కావాలని కోరుకుంటున్నా అని అన్నారు.

దర్శకుడు వి.వి.వినాయక్ మాట్లాడుతూ, ప్రభాస్ అంటే స్నేహానికి నిలువెత్తు రూపం. ఇలాంటి వ్యక్తి చిత్ర పరిశ్రమలో ఉండటం చాలా అరుదు. ప్రభాస్ ఎక్కువమందిని కలవడు...అయితే ఉన్నవారితో చాలా ఆత్మీయంగా ఉంటాడు. చిన్న చిన్న విషయాలకు కూడా ఆనందపడుతుంటాడు. ఇక ఈ చిత్రం టీజర్ విషయానికి వస్తే...ఇందులో తేజు చిరంజీవిగారిలా ఉన్నాడని అంటుంటే చాలా సంతోషంగా ఉంది. హీరోయిన్ లావణ్య మొదటిసారి కమర్షియల్ హీరోయిన్ పాత్రలో నటించింది. ఈ సినిమా తనకి చాలా మంచిపేరు తెచ్చిపెడుతుంది. శివ ఆకుల కాంబినేషన్‌లో వచ్చిన మా సినిమాలన్నీ పెద్ద హిట్టయ్యాయి. ఆ కోవలో ఈ చిత్రం కూడా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది అని అన్నారు. హీరో సాయిధరమ్‌తేజ్ మాట్లాడుతూ, ప్రభాస్ అన్నను మా కుటుంబంలో ఒక సభ్యుడిలా ఫీలవుతాం. ఇక ఈ చిత్రంలో నటించే అవకాశమిచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలను తెలియజేస్తున్నా. అందరం కలిసి ఓ మంచి సినిమా చేశాం అని చెప్పారు.

నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడుతూ, ఈ చిత్రంలో మొత్తం నాలుగు పాటలున్నాయి. ఈ రోజు నుంచి ప్రతీ నాలుగు గంటలకు ఒకసారి ఒక పాటను విడుదల చేస్తాం. భాస్కరభట్ల, వరికుప్పల యాదగిరి రాసిన పాటలు చాలాబాగా వచ్చాయి. అన్నిపాటలకు సాయిధరమ్, లావణ్య చక్కటి డ్యాన్స్‌ను ప్రదర్శించారు. ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయబోతున్నాం అని చెప్పారు. రచయిత శివ ఆకుల, హీరోయిన్ లావణ్య తదితరులు చిత్రం గురించి మాట్లాడారు.

ఎన్ హెచ్ 47లో బూత్ బంగ్లా గీతావిష్కరణ

ఏకే 9 స్టూడియోస్ ఫిలిమ్స్ సమర్పణలో అజయ్ కౌండిన్య, సంధ్య, అనూష హీరోహీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం ఎన్ హెచ్ 47లో బూత్ బంగ్లా. అజయ్ కౌండిన్య దర్శకత్వంలో మారం రాజేష్‌కుమార్, బుగ్గారపు రమేష్‌బాబు నిర్మించిన ఈ చిత్రం ఆడియో విడుదల హైదరాబాద్‌లో జరిగింది. అతిథులుగా విచ్చేసిన టీఆర్ఎస్ నేత ఠాగూర్ బాలాజీసింగ్, బీజేపీ నేత వి.ఆంజనేయులు సీడీలను ఆవిష్కరించారు. అనంతరం ఠాగూర్ బాలాజీసింగ్ మాట్లాడుతూ, సినిమా చేయాలంటే ఎంత ఇష్టం ఉంటుందో అంత కష్టం కూడా ఉంటుంది. అజయ్ కౌండిన్య ఆ కష్టాలు అన్నీ పడ్డారు. ఈ టీజర్ చాలా బావుంది అన్నారు. వి.ఆంజనేయులు మాట్లాడుతూ, మనిషి కసి ఉంటే ఏదైనా చేయగలడని అజయ్‌ని చూస్తే అనిపిస్తుంది. అతను మా చిన్ననాటి స్నేహితుడు. చిన్నప్పట్నుంచి అతనికి కళలంటే చాలా ఇష్టం అని అన్నారు. సంగీత దర్శకుడు చైతన్యరాజు మంచి పాటలను ఇచ్చారు అని చెప్పారు. దర్శకుడు అజయ్ కౌండిన్య మాట్లాడుతూ, ఇదివరకు వర్మ అనే సినిమా చేశాను. మూడు సినిమాలను నిర్మించాను. చైతన్యరాజు మంచి పాటలను ఇచ్చారు అని చెప్పారు. నిర్మాత అరుణాచలం మాట్లాడుతూ, అజయ్ పట్టుదలే ఈ సినిమాను ఇక్కడ దాకా తీసుకువచ్చింది. తప్పకుండా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది అని అన్నారు. సంగీత దర్శకుడు చైతన్యరాజు మాట్లాడుతూ, ఈ చిత్రంలో నాలుగు పాటలున్నాయని అన్నారు.





నారా రోహిత్

నారా రోహిత్ కొత్త చిత్రం

వైవిధ్యమైన కథలను ఎంచుకుంటున్న నారా రోహిత్ తాజాగా ఈ.ఎం.వి.ఈ స్టూడియోస్ సంస్థ నిర్మించబోయే చిత్రంలో నటించేందుకు అంగీకరించారు. ప్రొడక్షన్ నెం.3గా రూపొందనున్న ఈ చిత్రం ద్వారా ఎస్.డి.చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వైవిధ్యమైన కథతో విలేజ్ నేపథ్యంలో రూపొందే ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చి నుంచి మొదలుకానుంది. వడ్డేపల్లి సత్యనారాయణ సమర్పణలో తెరకెక్కే ఈ చిత్రంలో నారా రోహిత్ పాత్ర చిత్రణ, గెటప్ చాలా టిపికల్‌గా ఉంటాయని చిత్రబృందం వెల్లడించింది. ప్రస్తుతం తమ సంస్థ నిర్మించిన హౌరాబ్రిడ్జ్ చిత్రం విడుదలలో బిజీగా ఉండటం వల్ల నారా రోహిత్ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ఆ బృందం తెలియజేసింది. ఈ చిత్రానికి సంగీతాన్ని సాయికార్తీక్ సమకూర్చనున్నారు.

వినాయక్ ఆవిష్కరించిన

ఎందుకో ఏమో టీజర్

నందు, నోయల్, పునర్నవి నాయకానాయికలుగా తెరకెక్కుతున్న చిత్రం ఎందుకో ఏమో. కోటి వద్దినేని దర్శకత్వంలో మాలతి వద్దినేని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్ ఆదివారం దర్శకుడు వి.వి.వినాయక్ చేతులమీదుగా విడుదలైంది. ఈ సందర్భంగా వి.వి.వినాయక్ మాట్లాడుతూ, టైటిల్ లాగే ఈ చిత్రం టీజర్ కూడా చాలా ఆసక్తికరంగా ఉంది. చిత్రబృందానికంతటికీ ఈ చిత్రం మంచిపేరు తెచ్చిపెట్టాలని కోరుకుంటున్నా అని అన్నారు. దర్శకుడు కోటి వద్దినేని మాట్లాడుతూ, ఇదొక ముక్కోణపు ప్రేమకథ. మా నిర్మాత రాజీపడకుండా, పూర్తి స్వేచ్ఛనివ్వడంతో అనుకున్నట్లుగా సినిమా తీయగలిగాం. ప్రస్తుతం సినిమా సెన్సార్ దశలో ఉంది. ఫిబ్రవరి మొదటివారంలో ఆడియోను, అదే నెలలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. నిర్మాత మాలతి వద్దినేని మాట్లాడుతూ, ఈ బేనర్‌పై ఇది మా తొలి సినిమా. మంచి ప్రేమకథతో పాటు కమర్షియల్ హంగులతో నిర్మించిన చిత్రమిది అని అన్నారు.



నందు, పునర్నవి

చాలా కొత్తగా యు కథే హీరో



కొవెర క్రియేషన్స్ పతాకంపై కొవెరా కథానాయకుడిగా నటిస్తూ, తానే దర్శకత్వం వహిస్తున్న చిత్రం యు కథే హీరో. హిమాన్షికాంట్రగడ్డ కథానాయికగా నటిస్తుండగా, విజయలక్ష్మి కొండా నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం షూటింగ్ కార్యక్రమాలను పూర్తిచేసుకుని నిర్మాణానంతర పనుల్లో ఉంది. కాగా ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో దర్శకుడు సుకుమార్ ఆవిష్కరించారు. అనంతరం సుకుమార్ మాట్లాడుతూ, ఈ సినిమా లైన్ వినగానే చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. మోషన్ పోస్టర్‌ను కూడా కథానుగుణంగా చాలా వినూత్నంగా డిజైన్ చేశారు. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు.

దర్శకుడు కొవెరా మాట్లాడుతూ, సుకుమార్ చేతులమీదుగా ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను విడుదల చేయడం చాలా సంతోషంగా ఉంది. నేను వి.విజయేంద్రప్రసాద్‌గారి దగ్గర పనిచేశాను. కొన్ని సినిమాలకు రచయితగా కూడా పనిచేసి, తొలిప్రయత్నంగా దర్శకత్వం వహిస్తున్నాను అని చెప్పారు. స్క్రీన్‌ప్లే రచయిత మధు మాట్లాడుతూ, ఈ కథ చాలా కొత్తగా ఉంటుంది. అందుకే కథే హీరో అని క్యాప్షన్‌గా పెట్టాం అని పేర్కొన్నారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమాలో నూతన హీరోహీరోయిన్లతో పాటు తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాకేష్‌గౌడ్, సంగీతం: సత్యమహావీర్, ఎడిటింగ్: ప్రవీణ్‌పూడి,

షకీలా 250వ చిత్రం శీలవతి



జీ స్టూడియోస్ పతాకంపై షకీలా ప్రధాన పాత్రలో సాయిరాం దాసరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం శీలవతి. రాఘవ ఎం.గణేష్, వీరు బాసింశెట్టి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇటీవలే పూర్తిచేసుకుంది. కాగా రిపబ్లిక్ డే సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ని విడుదలచేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సాయిరాం దాసరి మాట్లాడుతూ, షకీలాకు ఇది 250వ చిత్రం. కేరళలో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. మా నిర్మాతలు ఇచ్చిన ప్రోత్సాహంతో అనుకున్నదానికంటే మరింత బాగా తెరకెక్కించగలిగాం. సంగీతానికి అధిక ప్రాధాన్యం ఉంది. ప్రజ్వల్ క్రిష్ అద్భుతమైన నేపథ్య సంగీతాన్ని అందించారు అని చెప్పారు.

నిర్మాతలలో ఒకరైన రాఘవ ఎం.గణేష్ మాట్లాడుతూ, ఊహించినదానికంటే ఈ చిత్రం బాగా వచ్చింది. ఈ రోజు నుంచి నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకోనుంది. ఏప్రిల్‌లో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకుని వస్తాం అని చెప్పారు. మరో నిర్మాత వీరు బాసింశెట్టి మాట్లాడుతూ, చాలా సినిమాలకు పీఆర్వోగా, కొన్ని సినిమాలకు డిస్ట్రిబ్యూటర్‌గా, రెండు సినిమాలకు నిర్మాతగా వ్యవహరించిన తాను మరోసారి నిర్మాతగా ఈ చిత్రం చేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు.

ఈ చిత్రంలో షకీలా, గీతాంజలి, (ప్రూటీ), లడ్డు, అశోక్‌బాబు తదితరులు నటించగా, ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్‌క్రిష్, కెమెరా: తరుణ్‌కరణ్‌తోత్, మాటలు: యష్ యాదవ్.

క్రీడాప్రభ

ఐపీఎల్ కోటీశ్వరులు (స్వదేశీ)

జయదేవ్ ఉనద్కట్	- రూ. 11.5 కోట్లు	- రాజస్థాన్ రాయల్స్
మనీశ్ పాండే	- రూ. 11 కోట్లు	- సన్‌రైజర్స్ హైదరాబాద్
కేఎల్ రాహుల్	- రూ. 11 కోట్లు	- కింగ్స్‌ఎలెవన్ పంజాబ్
కృనాల్‌పాండ్యా	- రూ. 8.8 కోట్లు	- ముంబై ఇండియన్స్
సంజు శాంసన్	- రూ. 8 కోట్లు	- రాజస్థాన్ రాయల్స్
కేదార్ జాదవ్	- రూ. 7.8 కోట్లు	- చెన్నై సూపర్ కింగ్స్
రవిచంద్రన్ అశ్విన్	- రూ. 6.4 కోట్లు	- కింగ్స్‌ఎలెవన్ పంజాబ్
దినేష్ కార్తీక్	- రూ. 7.4 కోట్లు	- కోల్‌కతా నైట్ రైడర్స్
రాబిన్ ఊతప్ప	- రూ. 6.4 కోట్లు	- కోల్‌కతా నైట్ రైడర్స్
కరుణ్ నాయర్	- రూ. 5.6 కోట్లు	- కింగ్స్‌ఎలెవన్ పంజాబ్
శిఖర్ ధావన్	- రూ. 5.2 కోట్లు	- సన్‌రైజర్స్ హైదరాబాద్
కరణ్ శర్మ	- రూ. 5 కోట్లు	- చెన్నై సూపర్ కింగ్స్
వృద్ధిమాన్ సాహా	- రూ. 5 కోట్లు	- సన్‌రైజర్స్ హైదరాబాద్

ఐపీఎల్ కోటీశ్వరులు (విదేశీ)

బెన్ స్టోక్స్	- రూ. 12.5 కోట్లు	- రాజస్థాన్ రాయల్స్
క్రిస్ లిన్	- రూ. 9.6 కోట్లు	- కోల్‌కతా నైట్ రైడర్స్
మిచెల్ స్టార్క్	- రూ. 9.4 కోట్లు	- కోల్‌కతా నైట్ రైడర్స్
గ్లెన్ మ్యాక్స్‌వెల్	- రూ. 9 కోట్లు	- ఢిల్లీ డేర్ డెవిల్స్
రషీద్ ఖాన్	- రూ. 9 కోట్లు	- సన్‌రైజర్స్ హైదరాబాద్
క్రిస్ వోక్స్	- రూ. 7.4 కోట్లు	- రాయల్ చాలెంజర్స్
ఆండ్రూ టై	- రూ. 7.2 కోట్లు	- కింగ్స్‌ఎలెవన్ పంజాబ్
డ్వైన్ బ్రావో	- రూ. 6.2 కోట్లు	- చెన్నై సూపర్ కింగ్స్
కీరన్ పొలార్డ్	- రూ. 5.4 కోట్లు	- ముంబై ఇండియన్స్
పాట్ కమిన్స్	- రూ. 5.4 కోట్లు	- ముంబై ఇండియన్స్

అమ్ముడైన ఆటగాళ్లు: 169 విదేశీ క్రికెటర్లు : 56
మొత్తం వ్యయం: రూ. 431.7 కోట్లు



ఉనద్కట్‌కు జాక్‌పాట్

- రూ.11.5 కోట్ల రికార్డు ధర పలికిన స్వదేశీ ఆటగాడు
- పోటాపోటీ వేలంలో సొంతం చేసుకున్న రాజస్థాన్
- ఎట్టకేలకు గేల్‌ను కరుణించిన ప్రీతిజింతా
- రూ.2 కోట్లకు పంజాబ్ జట్టుకు విండీస్ ఆటగాడు
- వేలంలో 169 మంది ఆటగాళ్లకు రూ.431.7కోట్లు
- స్వదేశీ ఆటగాళ్లు113- విదేశీ ఆటగాళ్లు56మంది
- ఐపీఎల్‌లో ఆడనున్న తొలి నేపాలీ క్రికెటర్ సందీప్



బెంగళూరు: ఐపీఎల్ 11వ సీజన్ వేలం ప్రక్రియ ముగిసింది. రేసు లో మొత్తం 578మంది ఆటగాళ్లుండగా, 169 మందిని ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. స్టార్ ప్లేయర్లు అనామకులుగా ఉండిపోగా, అనామక ప్లేయర్లు స్టార్ ఆటగాళ్లుగా తెరపైకి వచ్చారు. విధ్వంసకర బ్యాట్స్‌మన్ గేల్‌లాంటి ప్రాథమిక ధరకే అమ్ముడయ్యాడు. అలనాటి స్టార్లు గప్తిల్, షాన్ మార్ష్, వరుణ్ ఆరోన్ అక్కరకు రాకుండా పోయారు. ఇక అత్యధికంగా ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌ను రూ.12.5 కోట్లకు, ఆ తర్వాత అత్యధికం అయిన జయదేవ్ ఉనద్కట్‌ను రూ.11.5 కోట్లకు రాజస్థాన్ రాయల్స్ టీమ్ సొంతం చేసుకోవడం ఈ ఏడాది వేలంలో హైలైట్. ఉనద్కట్ అత్యధిక మొత్తం పలికిన ఇండియన్ ప్లేయర్‌గా నిలిచాడు. రెండో రోజు వేలం రాహుల్ చాహర్‌తో ప్రారంభమైంది. రాజస్థాన్‌కు చెందిన ఈ స్పిన్ మాంత్రికుడిని ముంబయి ఇండియన్స్ రూ.1.90కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది. అతడి ప్రారంభ ధర రూ.20లక్షలు కాగా, అధిక ధరకు అమ్ముడుపోయాడు. ఇక ఆండ్రూ టైని 7.2 కోట్లకు కింగ్స్ పంజాబ్, అనామక ప్లేయర్ అయిన గౌతమ్ క్రిష్ణప్పను రాజస్థాన్ రూ.6.2 కోట్లకు కొనుగోలు చేసి ఆశ్చర్యపరిచాయి. సందీప్ శర్మను రూ.3 కోట్లకు సన్‌రైజర్స్, హైదరాబాద్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌ను రూ.2.6 కోట్లకు బెంగళూరు, శార్దూల్ ఠాకూర్‌ను రూ.2.6 కోట్లకు చెన్నై సొంతం చేసుకున్నాయి. ఇక రైట్ టు మ్యాచ్ కింద రూ.2.4 కోట్లకు మోహిత్ శర్మను దక్కించుకుంది కింగ్స్ పంజాబ్. ఆస్ట్రేలియా బౌలర్ నేథన్ కూల్టర్‌నైల్‌ను రూ.2.2 కోట్లకు, స్పిన్నర్ వాషింగ్టన్‌సుందర్‌ను రూ.3.2 కోట్లకు బెంగళూరు కొనుగోలు చేసింది. ఢిల్లీ, ముంబై, సన్‌రైజర్స్, చెన్నై టీమ్స్ అత్యధికంగా 25 మంది ప్లేయర్స్‌ను, కోల్‌కతా నైట్ రైడర్స్ అతి తక్కువగా 19 మంది ప్లేయర్స్‌ను కలిగి ఉన్నాయి.

గేల్‌ను కరుణించిన పంజాబ్

టీ20ల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ ప్లేయర్.. ఈ ఫార్మాట్‌లో పది వేల రన్స్ చేసిన ఏకైక బ్యాట్స్‌మన్.. కానీ ఐపీఎల్ తాజా వేలంలో ఫ్రాంచైజీలు అతనిపై ఆసక్తి చూపలేదు. రెండుసార్లు అమ్ముడుపోని విండీస్ దిగ్గజం క్రిస్ గేల్‌ను, మూడోసారికి కింగ్స్ పంజాబ్ కరుణించింది. అతని కనీస ధర రూ.2 కోట్లకు పంజాబ్ కొనుగోలు చేసింది. చివరిసారి వేలంలో ప్రవేశపెట్టిన తర్వాత పంజాబ్ మాత్రమే అతని కోసం బిడ్ వేసింది. మరే ఇతర ఫ్రాంచైజీ అతన్ని పట్టించుకోలేదు. కింగ్స్ టీమ్ కోసం ఆ టీమ్ సహ యజమాని ప్రీతి జింటా బిడ్ వేయగానే మిగతా ఫ్రాంచైజీ వాళ్లంతా చప్పట్లతో అభినందించారు.

31 రెట్లు అధికంగా...

రెండో రోజు వేలంలో జయదేవ్ ఉనద్కట్ రికార్డులు తిరగరాశాడు. అత్యధిక మొత్తం పలికిన ఇండియన్ ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. ఆశ్చర్యకరంగా రూ.11.5 కోట్లకు అతన్ని రాజస్థాన్ సొంతం చేసుకుంది. తొలి రోజు రూ.11 కోట్లతో టాప్‌లో నిలిచిన రాహుల్, పాండేలను ఉనద్కట్ వెనక్కి నెట్టాడు. శనివారం బెన్ స్టోక్స్ కోసం పోటీపడిన రాజస్థాన్ రాయల్స్.. జయదేవ్ కోసం కూడా తీవ్రంగా పోటీ పడింది. ఉనద్కత్ ప్రారంభ ధర రూ.1.50కోట్లు. ఇప్పటి వరకూ అత్యంత ధర పలికిన ఆటగాళ్లలో ఉనద్కత్ రెండో స్థానంలో నిలిచాడు. సౌరాష్ట్రకు చెందిన జయదేవ్ కోసం పంజాబ్, చెన్నై కూడా ఆసక్తి చూపాయి. చివరికి భారీ మొత్తానికి రాయల్స్ అతన్ని ఎగరేసుకుపో యింది. గతేడాది ఐపీఎల్‌లో పుణె సూపర్ జెయింట్స్ తరపున ఆడిన ఉనద్కట్, 12 మ్యాచుల్లో 24 వికెట్లు తీశాడు. అత్యధిక వికెట్లు తీసినవారిలో రెండో స్థానంలో నిలిచాడు.



క్రిష్ణప్ప... కెవ్వుకేక

కర్నాటక ఆల్‌రౌండర్ గౌతమ్ క్రిష్ణప్ప ఒక్కసారిగా స్టార్ ప్లేయర్ అయ్యాడు. అనామక ఆటగాడిగా వేలంలోకి ప్రవేశించిన ఇతని ప్రాథమిక ధర రూ. 20 లక్షలే. కానీ, ఆదివారం నాటి వేలంలో ఏకంగా రూ.6.2 కోట్లు పలికాడు. రెండో రోజు వేలంలో ఆశ్చర్యం కలిగించిన బిడ్ ఇతనిదే. 12.5 కోట్లకు స్టోక్స్‌ను, 11.5 కోట్లకు ఉనద్కట్‌ను కొనుగోలు చేసిన రాజస్థాన్ రాయల్స్ అనూహ్యంగా, కృష్ణప్పనూ సొంతం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. గతేడాది ఇతడిని ముంబై ఇండియన్స్ రూ.2 కోట్లకు కొనుగోలు చేసింది. కానీ అతనికి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశమే రాలేదు.

ఢిల్లీ డేర్‌డెవిల్స్

1. రిషబ్ పంత్ (రూ.8 కోట్లు - రిటేన్డ్)
2. క్రిస్ మోరిస్ (రూ.7.1 కోట్లు- రిటేన్)
3. శ్రేయాస్ అయ్యర్ (రూ.7 కోట్లు- రిటేన్)
4. గ్లెన్ మ్యాక్స్‌వెల్ (రూ.9 కోట్లు)
5. గౌతమ్ గంభీర్ (రూ.2.8 కోట్లు)
6. జేసన్ రాయ్ (రూ.1.5 కోట్లు)
7. కొలిన్ మన్రో (రూ.1.9 కోట్లు)
8. మహ్మద్ షమి (రూ.3 కోట్లు)
9. కాగిసో రబాడా (రూ.4.2 కోట్లు)
10. అమిత్ మిశ్రా (రూ.4 కోట్లు)
11. పృథ్వీ షా (రూ.1.2 కోట్లు)
12. రాహుల్ తివాతియా (రూ.3 కోట్లు)
13. విజయ్ శంకర్ (రూ.3.2 కోట్లు)
14. హర్షల్ పటేల్ (రూ.20 లక్షలు)
15. అవేష్ ఖాన్ (రూ.70 లక్షలు)
16. షాబాజ్ నదీమ్ (రూ.3.2 కోట్లు)
17. డేనియల్ క్రిస్టియన్ (రూ.1.5 కోట్లు)
18. జయంత్ యాదవ్ (రూ.50 లక్షలు)
19. గురుకీరత్ మన్ (రూ.75 లక్షలు)
20. ట్రెంట్ బౌల్ట్ (రూ.2.2 కోట్లు)
21. మన్‌జోత్ కల్రా (రూ.20 లక్షలు)
22. అభిషేక్ శర్మ (రూ.55 లక్షలు)
23. సందీప్ లామిచానె (20 లక్షలు)
24. నమన్ ఓజా (1.4 కోట్లు)
25. సయన్ ఘోష్ (20 లక్షలు)

చెన్నై సూపర్ కింగ్స్

1. ధోనీ (రూ.15 కోట్లు-రిటేన్)
2. రైనా (రూ.11 కోట్లు-రిటేన్)
3. జడేజా (రూ.7 కోట్లు -రిటేన్)
4. డుప్లెసిస్ (రూ.1.6 కోట్లు)
5. హర్భజన్ (రూ.2 కోట్లు)
6. డ్వేన్ బ్రేవో (రూ.6.4 కోట్లు)
7. షేన్ వాట్సన్ (రూ.4 కోట్లు)
8. కేదార్ జాదవ్ (రూ.7.8 కోట్లు)
9. ఎ. రాయుడు (రూ.2.2 కోట్లు)
10. ఇమ్రాన్ తాహిర్ (రూ.1 కోటి)
11. కరణ్ శర్మ (రూ.5 కోట్లు)
12. శార్దూల్ (రూ.2.6 కోట్లు)
13. జగదీశన్ (రూ.20 లక్షలు)
14. మిచెల్ (రూ.50 లక్షలు)
15. దీపక్ చహర్ (రూ.80 లక్షలు)
16. ఆసిఫ్ కేఎం (40 లక్షలు)
17. లుంగి ఎంగిడి (50 లక్షలు)
18. కనిష్క్ సేథ్ (20 లక్షలు)
19. ధృవ్ షోరే (20 లక్షలు)
20. మురళీ విజయ్ (2 కోట్లు)
21. శామ్ బిల్లింగ్స్ (కోటి)
22. మార్క్ వుడ్ (1.5 కోట్లు)
23. క్షితిజ్ శర్మ (20 లక్షలు)
24. మోను సింగ్ (20 లక్షలు)
25. చైతన్య బిష్ణోయ్ (20 లక్షలు)

ముంబై ఇండియన్స్

1. రోహిత్‌శర్మ (రూ.15 కోట్లు-రిటేన్)
2. హార్దిక్ పాండ్యా (రూ.11 కోట్లు-రిటేన్)
3. జస్‌ప్రీత్ బుమ్రా (రూ.7 కోట్లు-రిటేన్)
4. కీరన్ పొలార్డ్ (రూ.5.4 కోట్లు- ఆర్టీఎం)
5. ముస్తఫిజుర్ రెహమాన్ (రూ.2.2 కోట్లు)
6. పాట్ కమిన్స్ (రూ.5.4 కోట్లు)
7. సూర్యకుమార్ జాదవ్ (రూ.3.2 కోట్లు)
8. కృనాల్ పాండ్యా (రూ.8.8 కోట్లు- ఆర్టీఎం)
9. ఇషాన్ కిషన్ (రూ.6.2 కోట్లు)
10. రాహుల్ చహర్ (రూ.1.9 కోట్లు)
11. ఎవిన్ లూయిస్ (రూ.3.8 కోట్లు)
12. సౌరభ్ తివారీ (రూ.80 లక్షలు)
13. బెన్ కటింగ్ (రూ.2.2 కోట్లు)
14. ప్రదీప్ సాంగ్వాన్ (రూ.1.5 కోట్లు)
15. డుమిని (రూ.కోటి)
16. జేసన్ బెహ్రండార్ఫ్ (రూ.1.5 కోట్లు)
17. తజిందర్ ఢిల్లాన్ (రూ.55 లక్షలు)
18. శరద్ లంబా (20 లక్షలు)
19. సిద్దేశ్ లాడ్ (20 లక్షలు)
20. ఆదిత్య తారె (20 లక్షలు)
21. మయాంక్ మార్కండె (20 లక్షలు)
22. అఖిల్ ధనంజయ (50 లక్షలు)
23. అనుకుల్ రాయ్ (20 లక్షలు)
24. మోహిసిన్ ఖాన్ (20 లక్షలు)
25. నిదీష్ ఎండీ దినేషన్ (20 లక్షలు)

రాయల్ చాలెంజర్స్

1. విరాట్ కోహ్లి (రూ.17 కోట్లు- రిటేన్)
2. ఏబీ డివిలియర్స్ (రూ.11 కోట్లు-రిటేన్)
3. సర్ఫరాజ్ ఖాన్ (రూ.1.75 కోట్లు-రిటేన్)
4. మెకల్లమ్ (రూ.3.6 కోట్లు)
5. క్రిస్ వోక్స్ (రూ.7.4 కోట్లు)
6. కొలిన్ గ్రాండ్‌హోమ్ (రూ.2.2 కోట్లు)
7. మొయిన్ అలీ (రూ1.7 కోట్లు)
8. క్వింటన్ డీకాక్ (ర.2.8 కోట్లు)
9. ఉమేష్ యాదవ్ (రూ.4.2 కోట్లు)
10. యుజువేంద్ర చాహల్ (రూ.6 కోట్లు- ఆర్టీఎం)
11. మనన్ వోహ్రా (రూ.1.1 కోట్లు)
12. కుల్వంత్ ఖేజ్రోలియా (రూ.85 లక్షలు)
13. అనికేత్ చౌదరి (రూ.30 లక్షలు)
14. నవదీప్ సైనీ (రూ.3 కోట్లు)
15. మురుగన్ అశ్విన్ (రూ.2.2 కోట్లు)
16. మణ్‌దీప్ సింగ్ (రూ.1.4 కోట్లు)
17. వాషింగ్టన్ సుందర్ (రూ.3.2 కోట్లు)
18. పవన్ నేగి (రూ.కోటి - ఆర్టీఎం)
19. మహ్మద్ సిరాజ్ (రూ.2.6 కోట్లు)
20. నేథన్ కూల్టర్ నైల్ (రూ.2.2 కోట్లు)
21. అనిరుద్ధ జోషి (20 లక్షలు)
22. పార్థివ్ పటేల్ (1.7 కోట్లు)
23. టిమ్ సౌథీ (కోటి)
24. పవన్ దేశ్‌పాండె (20 లక్షలు)

రాజస్థాన్ రాయల్స్

1. స్టీవ్ స్మిత్ (12 కోట్లు)
2. బెన్ స్టోక్స్ (12.5 కోట్లు)
3. రహానే (4 కోట్లు- ఆర్టీఎం)
4. స్టువర్ట్ బిన్నీ (50 లక్షలు)
5. సంజు శాంసన్ (8 కోట్లు)
6. జోస్ బట్లర్ (4.4 కోట్లు)
7. రాహుల్ (3.4 కోట్లు)
8. డార్సీ షార్ట్ (4 కోట్లు)
9. జోఫ్రా ఆర్చర్ (7.2 కోట్లు)
10. గౌతమ్ (6.2 కోట్లు)
11. ధవల్‌కులకర్ణి (75 లక్షలు
12. జయదేవ్ (11.5 కోట్లు)
13. అంకిత్ శర్మ (20 లక్షలు)
14. అనురీత్‌సింగ్ (30 లక్షలు)
15. జహీర్ (60 లక్షలు)
16. శ్రేయాస్ (20 లక్షలు)
17. ప్రశాంత్ (20 లక్షలు)
18. మహిపాల్ (20 లక్షలు)
19. జతిన్ సక్సేనా (20 లక్షలు)
20. ఆర్యమాన్ (30 లక్షలు)
21. దుష్మంత (50 లక్షలు)

కింగ్స్ పంజాబ్

1. అక్షర్ పటేల్ (6.75 కోట్లు)
2. అశ్విన్ (7.6 కోట్లు)
3. యువరాజ్ సింగ్ (2 కోట్లు)
4. కరుణ్ నాయర్ (5.6 కోట్లు)
5. కేఎల్ రాహుల్ (11 కోట్లు)
6. డేవిడ్ మిల్లర్ (3 కోట్లు)
7. ఆరోన్ ఫించ్ (6.2 కోట్లు)
8. మార్కస్ స్టాయినిస్ (6.2 కోట్లు -ఆర్టీఎం)
9. మయాంక్ అగర్వాల్ (కోటి)
10. అంకిత్‌సింగ్ రాజ్‌పుత్ (3 కోట్లు)
11. మనోజ్ తివారీ (కోటి)
12. మోహిత్ శర్మ (2.4 కోట్లు)
13. ముజీబ్ జర్దాన్ (4 కోట్లు)
14. బరిందర్ శరణ్ (2.2 కోట్లు)
15. అంద్రూ టై (7.2 కోట్లు)
16. అక్షదీప్ నాథ్ (కోటి)
17. బి ద్వార్షుయిస్ (1.4 కోట్లు)
18. ప్రదీప్ సాహు (20 లక్షలు)
19. మయాంక్ దాగార్ (20 లక్షలు)
20. క్రిస్ గేల్ (2 కోట్లు)
21. మంజూర్ దార్ (20 లక్షలు)

ఐపీఎల్‌లో తొలి నేపాలీ!



ఐపీఎల్‌లో ఆడనున్న తొలి నేపాలీ ప్లేయర్‌గా సందీప్ నిలిచాడు. ఢిల్లీ డేర్‌డెవిల్స్ టీమ్ ఇతన్ని రూ.20 లక్షలకు కొనుగోలు చేసింది. 17 ఏళ్ల సందీప్ లెగ్‌స్పిన్నర్. ఇప్పటివరకు 9 మ్యాచ్‌లు ఆడాడు. ఆస్ట్రేలియాలో క్లార్క్ అకాడమీలో శిక్షణ కూడా తీసుకున్నాడు. రెండేళ్ల కిందట బంగ్లాదేశ్‌లో జరిగిన అండర్ 19 వరల్డ్‌కప్‌లో 14 వికెట్లు తీసిన సందీప్, అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో 27 పరుగులకే 5 వికెట్లు తీసుకున్నాడు.

సన్‌రైజర్స్ హైదరాబాద్

1. డేవిడ్ వార్నర్ (రూ.12 కోట్లు- రిటేన్)
2. భువనేశ్వర్ (రూ.8.5 కోట్లు- రిటేన్)
3. శిఖర్ ధావన్ (రూ.5.2 కోట్లు- ఆర్టీఎం)
4. షకీబుల్ హసన్ (రూ.2 కోట్లు)
5. కేన్ విలియమ్సన్ (3 కోట్లు)
6. కార్లోస్ బ్రేత్‌వైట్ (2 కోట్లు)
7. యూసుఫ్ పఠాన్ (1.9 కోట్లు)
8. మనీష్ పాండే (11 కోట్లు)
9. వృద్ధిమాన్ సాహా (5 కోట్లు)
10. రషీద్ ఖాన్ (9 కోట్లు- ఆర్టీఎం)
11. రిక్కీ భుయ్ (20 లక్షలు)
12. దీపక్ హుడా (3.6 కోట్లు- ఆర్టీఎం)
13. సిద్ధార్థ్ కౌల్ (3.8 కోట్లు)
14. టీ నటరాజన్ (40 లక్షలు)
15. బేసిల్ థంపి (95 లక్షలు)
16. సయ్యద్ ఖలీల్ అహ్మద్ (3 కోట్లు)
17. మహ్మద్ నబీ (కోటి)
18. సందీప్ శర్మ (3 కోట్లు)
19. సచిన్ బేబీ (20 లక్షలు)
20. క్రిస్ జోర్డాన్ (కోటి)
21. బిల్లీ స్టాన్‌లేక్ (50 లక్షలు)
22. తన్మయ్ అగర్వాల్ (20 లక్షలు)
23. శ్రీవత్స గోస్వామి (కోటి)
24. బిపుల్ శర్మ (20 లక్షలు)
25. మెహదీ హసన్ (20 లక్షలు)

ఆండ్రూ టై.. సో లక్కీ..



ఆస్ట్రేలియా బౌలర్ ఆండ్రూ టైని అదృష్టం వరించింది. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో చివరి వన్డేలో చెలరేగిపోయిన ఆండ్రూ టై, రూ. 7.2 కోట్ల భారీ ధరకు అమ్ముడయ్యాడు. కనీస ధర రూ. 1 కోటి ఉండగా, అతనికి భారీ మొత్తం చెల్లించి కింగ్స్ పంజాబ్ సొంతం చేసుకుంది. అయితే ఇంగ్లండ్‌తో ఐదో వన్డేలో ఐదు వికెట్లను సాధించిన తర్వాత ఆండ్రూ టై ఐపీఎల్ వేలానికి రావడం విశేషం. ఐదు వికెట్లకు ఏడు కోట్లు దక్కాయంటూ క్రికెట్ అభిమానులు సెటైర్లు వేస్తున్నారు.

కోల్‌కతా నైట్ రైడర్స్

1. ఎస్. నరైన్ (రూ.8.5కోట్లు)
2. అంద్రూరసెల్ (రూ.7కోట్లు)
3. మిచెల్ స్టార్క్ (9.4 కోట్లు)
4. క్రిస్ లిన్ (9.6 కోట్లు)
5. దినేష్ కార్తీక్ (7.4 కోట్లు)
6. ఆర్.ఉతప్ప (6.4కోట్లు)
7. పియూష్ చావ్లా (4.2 కోట్లు)
8. కుల్‌దీప్ (5.8 కోట్లు)
9. శుభ్‌మాన్ గిల్ (1.8 కోట్లు)
10. ఇషాంక్ జగ్గి (20 లక్షలు)
11. నితీష్ రాణా (3.4 కోట్లు)
12. కమలేష్‌కోటి (3.2కోట్లు)
13. వినయ్ కుమార్ (కోటి)
14. అపూర్వ్ (20 లక్షలు)
15. రింకు సింగ్ (80 లక్షలు)
16. శివమ్ మావి (3 కోట్లు)
17. కేమరూన్ (30 లక్షలు)
18. మిచెల్ జాన్సన్ (2 కోట్లు)
19. జీవన్ (30 లక్షలు)

టీ 20 సిరీస్‌కు రైనా, ఉనద్కట్

ముంబై: ఫిబ్రవరిలో ద.ఆఫ్రికాతో జరిగే టీ20 సిరీస్‌కు సీనియర్ బ్యాట్స్‌మన్ సురేశ్ రైనా ఎంపికయ్యాడు. ఆదివారం జట్టును ఎంపిక చేసిన బీసీసీఐ, 16 మంది సభ్యుల బృందంలో రైనాకు అవకాశం కల్పించింది. డిసెంబర్‌లో యొ యొ టెస్ట్ పాసవడంతోపాటు, సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో సెంచరీతో రాణించి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. రైనా చివరిసారి గతేడాది ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఆడాడు. ఇప్పటి వరకు మొత్తం 65 టీ20 మ్యాచ్‌లు ఆడిన రైనా, 29.7 సగటుతో 1307 పరుగులు చేశాడు. తరచూ విమర్శకుల దాడిని ఎదుర్కొంటున్న సీనియర్ ఆటగాడు ఎంఎస్ ధోనీకి చోటు దక్కింది. శ్రీలంకతో సిరీస్‌లో రాణించిన కేఎల్ రాహుల్ పట్ల సెలక్టర్లు మొగ్గుచూపారు. రహానేతోపాటు మరో సీనియర్ బ్యాట్స్‌మన్ యువరాజ్‌ను సెలక్టర్లు మరోసారి నిరాశపరిచారు. ఐపీఎల్ వేలంలో రూ.11.5 కోట్లు పలికి సంచలనం సృష్టించిన జయదేవ్ ఉనద్కట్‌కు కూడా చాన్స్ లభించింది. ఫిబ్రవరి 18 నుంచి టీ20 సిరీస్ జరగనున్నది. 18న జోహనెస్‌బర్గ్‌లో తొలి టీ20, సెంచూరియన్‌లో ఫిబ్రవరి 21, కేప్‌టౌన్ ఫిబ్రవరి 24న జరుగుతాయి.

ఇండియా టీ20 జట్టు: విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, కేఎల్ రాహుల్, సురేశ్ రైనా, ఎంఎస్ ధోనీ, దినేశ్ కార్తీక్, హార్దిక్ పాండ్యా, మనీశ్ పాండే, అక్షర్ పటేల్, యుజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా, జయదేవ్ ఉనద్కట్, శార్దూల్ ఠాకూర్.

టీ20 సిరీస్ పాక్‌దే

మౌన్‌గాని: న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ 20ల సిరీస్‌ను పాకిస్తాన్ కైవసం చేసు కుంది. ఆదివారం జరిగిన చివరి టీ20లో పాకిస్తాన్ 18 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను చేజిక్కించు కుంది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లకు 181 పరుగు లు చేసింది. ఫకార్ జమాన్(46) రాణించగా, సర్ఫరాజ్ అహ్మద్ (29), ఉమర్ అమిన్(21), హారిస్ సోహైల్(20 నాటౌట్), అహ్మద్ షెహజాద్(19), బాబర్ అజమ్(18)లు ఫర్వాలేదనిపించారు. ఆపై లక్ష్య ఛేదనలో కివీస్ 163 పరుగులకే పరిమితమై ఓటమి పాలైంది. మార్టిన్ గప్టిల్(59) హాఫ్ సెంచరీ సాధించగా, రాస్ టేలర్(25), సాంత్నార్(24 నాటౌట్)లు మోస్తరుగా ఆడారు. అంతకుముందు జరిగిన ఐదు వన్డేల సిరీస్‌లో పాకిస్తాన్ వైట్‌వాష్ అయింది. కాగా, అంచనాలు తారుమారు చేస్తూ పాకిస్తాన్ వరుస విజయాలతో సిరీస్‌ను 2-1 సాధించింది. ఈ తాజా సిరీస్ విజయంతో ట్వంటీ 20ల్లో పాకిస్తాన్ నంబర్‌వన్ ర్యాంకును సొంతం చేసుకుంది. న్యూజిలాండ్ రెండో ర్యాంకుకు పడిపోయింది.

ఫైనల్స్‌లో సైనాకు చుక్కెదురు

ఇండోనేషియా మాస్టర్స్ ఫైనల్స్‌లో సైనాకు చుక్కెదురైంది. చిరకాల ప్రత్యర్థి, ప్రపంచ నంబర్ వన్ షట్లర్ తైజుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత షట్లర్ పరాజయం పాలైంది. కాగా, తై జు చేతిలో ఓడటం సైనాకిది వరుసగా ఏడోసారి. మోకాలి గాయం నుంచి కోలుకున్న అనంతరం, సైనా ఆడిన తొలి అంతర్జాతీయ ఫైనల్ మ్యాచ్ ఇది. ప్రారంభం నుంచి ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో 9-21, 13-21 పాయింట్లతో తైజు గెలుపొందింది. కేవలం 27 నిముషాల్లోనే గేమ్ ముగిసింది. సైనా వరుస తప్పిదాలు ఘోర పరాజయానికి కారణాలయ్యాయి. మొదటి నుంచీ దూకుడు కొనసాగించిన తైజు కొద్ది నిముషాల్లోనే స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. 11-3 లీడ్‌తో సైనాను వెనక్కి నెట్టింది. ఈ దశలో పుంజుకునేందుకు ప్రయత్నించిన భారత షట్లర్ పోరాటం ఫలించలేదు. చివరకు 9-21తో తొలి గేమ్‌ను కోల్పోయింది. రెండో గేమ్‌లోనూ సైనాకు ఏమాత్రం అవకాశం ఇవ్వని తైజూ దూకుడును కొనసాగించింది. ఒకదశలో 9-16 పాయింట్లతో సైనా పోరాట పటిమను ప్రదర్శించినా, చివరకు 21-13తో జైజూ గేమ్‌తోపాటు, టైటిల్‌ను సొంతం చేసుకుంది.

బోపన్న జోడీ రన్నరప్స్

ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్స్‌లో ఇండియా-హంగేరి జోడీ పరాజం పాలైంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రోహన్ బొపన్న- టిమీబబోస్ ద్వయంపై పవిక్-గాబ్రియెలా జోడీ విజయం సాధించింది. బొపన్న జోడీ రన్నరప్‌కే పరిమితం అయ్యారు. తొలి సెట్‌ను గెలిచినా, తర్వాత శక్తిమేరకు రాణించలేకపోయారు. దీంతో ఐదోసీడ్ బొపన్న జోడీ 6-2, 4-6, 9-11 స్కోరుతో ఎనిమిదో సీడ్ పవిక్- డబ్రొస్కి చేతిలో ఓటమి పాలయ్యారు. 1.08 గంటల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రారంభంలో ఆధిక్యం కనబరిచిన బొపన్న జంట తొలి సెట్‌ను తేలిగ్గానే నెగ్గింది. తర్వాత పవిక్ జోడీ పుంజుకుని ఆడింది. సింగిల్ బ్రేక్ పాయింట్ కూడా కోల్పోకుండా పోరాడింది. అదే ఉత్సాహంతో కీలకమైన మూడో సెట్‌ను గెలిచింది. ఆసక్తికర విషయం ఏమంటే, 2017 ఫ్రెంచ్ ఓపెన్‌లో డబ్రొస్కిని ఓడించి తొలి బొపన్న తొలి గ్రాండ్‌శ్లామ్ సాధించడం.

ఆస్ట్రేలియా ఓపెన్ విజేత ఫెదరర్



స్విస్ మాస్టర్, డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్ ఆరోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో ఆరోసీడ్ మారిన్ సిలిచ్‌పై 6-2, 6-7, 6-3, 3-6, 6-1 తేడాతో విజయం సాధించాడు. ఐదు సెట్లపాటు పోరాడి విజేతగా నిలిచాడు. కెరీర్‌లో అతనికిది 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కావడం విశేషం. ఇక ఆరుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచిన రాయ్ ఎమర్సన్, నొవాక్ జొకోవిచ్‌ల సరసన ఫెడెక్స్ నిలిచాడు. సుమారు మూడున్నర గంటల పాటు హోరాహోరీగా సాగిన ఈ ఫైనల్లో విజయం కోసం ఫెదరర్ చెమటోడ్చాల్సి వచ్చింది. తొలి సెట్‌ను సునాయాసంగా గెలిచి టైటిల్ వేట మొదలుపెట్టిన ఫెదరర్, తర్వాతి సెట్‌ను టైబ్రేకర్‌లో కోల్పోయాడు. ఇక మూడో సెట్‌లో సిలిచ్ సర్వీస్ బ్రేక్ చేసి ఆధిక్యంలోకి దూసుకెళ్లిన ఈ స్విస్ మాస్టర్, ఆ తర్వాత తన సర్వీస్‌లను డిఫెండ్ చేసుకొని 6-3తో సెట్ కైవసం చేసుకున్నాడు. నాలుగో సెట్‌లో సిలిచ్ మళ్లీ పుంజుకున్నాడు. కీలకమైన సమయంలో ఫెదరర్ సర్వీస్ బ్రేక్ చేసి 6-3 ఆ సెట్ గెలిచాడు. దీంతో మ్యాచ్ నిర్ణయాత్మక ఐదో సెట్‌లోకి వెళ్లింది. ఈ సెట్‌లో ఫెడెక్స్ తన విశ్వరూపం చూపించాడు. ప్రత్యర్థికి ఏమాత్రం చాన్స్ ఇవ్వకుండా సునాయాసంగా పాయింట్లు సాధిస్తూ వెళ్లాడు. ఈ క్రమంలో రెండుసార్లు సిలిచ్ సర్వీస్ బ్రేక్ చేశాడు.

Published & Printed by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812
RNI Regd.No.32178/1977, Printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT.